www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 259 | శనివారం | 10 మార్చి, 2018
...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం
సంగారెడ్డి జిల్లా గమ్మడిదలలో ఎగసిన అగ్నికీలలు 7

త్రిపుర సిఎంగా బిప్లవ్ కుమార్ ప్రమాణం 10

తమిళనాడులో విద్యార్థిని నరికివేత 10

దేశానికి కొత్త చుక్కాని

నూతన అభివృద్ధి ఎజెండాను రూపొందించాలి



రాజ్యాంగాన్ని, చట్టాలను సవరించి సంస్కరణలు తేవాలి

నిపుణులు, అధికారులు, రాజకీయ నాయకులు తగు సూచనలు ఇవ్వాలి

ప్రగతి భవన్‌లో ప్రముఖులతో సమావేశంలో ముఖ్యమంత్రి కెసిఆర్

మన తెలంగాణ / హైదరాబాద్ : యావత్తు దేశానికి అవసరమైన 'అభివృద్ధి ఎజెండా' రూపొందాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి కెసిఆర్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం అమలవుతున్న విధానాలను, చట్టాలను అధ్యయనం చేసి రాజ్యాంగ, చట్ట సవరణలతో పాటు సంస్కరణలను తీసుకురావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం ఆయా రంగాల్లో అనుభవం, ప్రావీణ్యం కలిగిన నిపుణులు, సీనియర్ అధికారులు, రాజకీయ నాయకులు సూచనలు చేయడం ద్వారా ఈ ప్రయత్నంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, సీనియర్ అధికారులతో ప్రగతి భవన్‌లో సిఎం శుక్రవారం సమావేశమై పలు విషయాలపై చర్చించినట్లు ప్రభుత్వం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ, 'క్రియ' స్వచ్ఛంద సంస్థ సిఇఒ డాక్టర్ ఊట్ల బాలాజీ, పలువురు పదవీ విరమణ చేసిన అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన అన్ని సెక్షన్ల ప్రజలు 'అభివృద్ధి ఎజెండా'లో పాలుపంచుకోవాలని కోరారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటినా ఆశించిన పురోగతి రాలేదని, అనేక దేశాలు ప్రగతిపథంలో దూసుకుపోతున్నా మన దేశంలో మాత్రం ప్రజల ప్రాథమిక అవసరాలు తీరడం లేదని సిఎం పేర్కొన్నారు. అనేక సమస్యలు పరిష్కారానికి తరువాయి 6లో



మూలాలకు ముప్పు

భారతీయత మౌలిక విలువలకు ప్రమాదం

అసహనం, విద్వేషాలను రెచ్చగొడుతున్నారు

నిజాలను వక్రీకరిస్తున్నారు

మన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పెను సవాళ్లను ఎదుర్కొంటున్నాయి

దేశాన్ని తిరోగమన పథంలోకి మళ్లిస్తున్నారు

ఇండియా టుడే సదస్సులో సోనియా ఆందోళన

ముంబయి : "మన దేశం, మన సమాజం, వ్యవస్థ, మన స్వేచ్ఛా స్వాతంత్ర్యం అన్ని కూడా పెనుసవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఒక పద్ధతి ప్రకారం, ముప్పేట దాడి ప్రమాదం పొంచి ఉంది. చరిత్రను తిరగరాస్తున్నారు. నిజాలను వక్రీకరిస్తున్నారు. అసహనం, విద్వేషాలను రెచ్చగొడుతున్నారు" అని యుపిఎ చైర్‌పర్సన్, కాంగ్రెస్ నేత సోనియాగాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సోనియాగాంధీ ఇక్కడ ఇండియా టుడే సదస్సులో ప్రసంగించారు. పరోక్షంగా బిజెపి, సంఘ్ పరివార్ నుంచి ముప్పు తలెత్తుతోందని తెలిపారు. అన్ని కోణాలలో పక్షపాత ధోరణి పెరిగిపోతోందని, ఇది అనర్థాలకు దారితీస్తుందని తరువాయి 6లో

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి

నిలబెట్టాలని శాసనసభాపక్షం నిర్ణయం

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున అభ్యర్థిని పోటీలో పెట్టాలని కాంగ్రెస్ శాసనసభాపక్షం నిర్ణయించింది. అభ్యర్థి ఎంపిక, నామినేషన్ వేసే సమయంపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని సిఎల్‌పి నాయకులు, పిసిసి అధ్యక్షులు, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్‌కు అప్పగించింది. గడిచిన నాలుగేళ్ళలో ఇచ్చిన హామీల అమలుపై శాసనసభ తరువాయి 6లో

చరమాంకంలో చావుబతుకుల మధ్య

స్వచ్ఛంద మరణహక్కు

ఆరోగ్యపరంగా బతకడం దుస్సాధ్యం అనిపించే స్థితిలో వైద్యాన్ని నిరాకరించి వీలునామా రాసి క్రమంగా స్వచ్ఛందంగా మరణించే హక్కు సరైనదేనని సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: జీవించి ఉన్నప్పుడే రాసిన వీలునామా ప్రాతిపదికన స్వచ్ఛంద మరణ హక్కు కల్పించడం సరైనదేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రాణాంతక వ్యాధులతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నవారి అనాయాస మరణం అభ్యర్థన కీలక అంశమైంది. దీనిపై సుప్రీంకోర్టు శుక్రవారం చారిత్రక తీర్పు



వెలువరించింది. వ్యక్తులకు గౌరవప్రదంగా మరణించే తరువాయి 6లో

వరుడు మృత్యు ఒడికి

చెట్టును కారు ఢీకొని ఐదుగురు దుర్మరణం

ఖమ్మం జిల్లా తల్లాడ సమీపంలో ఘోర ప్రమాదం

మృతుల్లో అప్పడే వివాహం చేసుకొని స్వస్థలానికి వెళ్తున్న పెళ్లి కొడుకు, ఆస్పత్రిలో వధువు



మన తెలంగాణ / కొణిజర్ల : పెళ్లి జరిగిన గంటల వ్యవధిలోనే ఆ జంటను విధి వెంటాడింది. వివాహం చేసుకుని వరుడి ఇంటికి బయలుదేరిన కారు మార్గం మధ్యలో ఘోర ప్రమాదానికి గురై ఐదుగురు దుర్మరణం పాలైన ఘటన ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పల్లిపాడు వద్ద శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఈ ఘటనలో పెళ్లి కుమారుడు, మరి నలుగురు అక్కడికక్కడే మృత్యువాత పడగా, పెళ్లి కూతురు మృత్యువుతో పోరాడుతూ చికిత్స పొందుతోంది. వరంగల్ జిల్లా వర్ధన్నపేటకు చెందిన అచ్చి రామకృష్ణ ప్రసాద్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన భావన దుర్గకు వివాహం నిశ్చయమైంది. వీరి వివాహం తణుకులోని కేశవస్వామి దేవాలయంలో గురువారం రాత్రి తరువాయి 6లో



త్యాగాలు తప్ప ద్రోహాలు తెలియవు

- పుట్టుక, చావు టిఆర్ఎస్‌లోనే
- కెసిఆర్ మాటే నా బాట
- దుష్ప్రచారం చేస్తే సహించేది లేదు
- మంత్రి హరీశ్ రావు ప్రకటన 3



మిలియన్ మార్చ్ ఉద్రిక్తత

- జిల్లాల సరిహద్దుల్లో రహదారులపై చెక్‌పోస్టులు
- అనుమతి లేకున్నా జరుపుతామనే ప్రకటనతో అడుగడుగునా పోలీసులు 7

భైంసాలో వ్యక్తి తల సంచలనం

హత్య చేసి గోనె సంచిలో పెట్టి పడేసిన దుండగులు 7

ముషారఫ్ అరెస్టుకు పెషావర్ కోర్టు ఆదేశాలు 11

కుంచెపోటు



వీటినీ ఆధార్‌తో అనుసంధించాలా లాయర్ గారూ..?

గాంధీభవన్‌కు చేరుకున్న కాంగ్రెస్ సర్కస్ టీమ్: ఎంఎల్‌సి కర్నె



మన తెలంగాణ/హైదరాబాద్ : వారం రోజులుగా రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కస్ టీమ్ ప్రదర్శనలనిచ్చి తిరిగి గాంధీభవన్‌కు చేరుకున్నదని ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్ ఎద్దేవా చేశారు. టిఆర్‌ఎస్‌ఎల్‌పి కార్యాలయంలో శుక్రవారం సాంస్కృతిక సారథి ఛైర్మన్ రసమయి బాలకిషన్‌తో కలిసి ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ 'బస్సు యాత్ర' పేరుతో కాంగ్రెస్ నేతలు ఈ వారం రోజుల్లో రకరకాల ఫీట్లు చేశారని, జనాలతో సంబంధం లేకుండానే మాటల విన్యాసాలు చేశారన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని, ఇప్పుడు టిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని రాష్ట్ర ప్రజలు పోల్చుకుంటున్నారని చెప్పారు. రిజర్వేషన్ల పెంపు అంశంపై తమ ఎంపిలు గత ఐదారు రోజులుగా పార్లమెంట్‌లో ఆందోళన చేస్తుంటే దీనిపై కాంగ్రెస్ నేతలు అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారన్నారు. నాటి ప్రధాని పి.వి.నర్సింహారావు హయాంలోనే తమిళనాడు రిజర్వేషన్ల పెంపు అంశాన్ని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చిన విషయం కాంగ్రెస్ నేతలకు తెలియదా అని ప్రశ్నించారు. రిజర్వేషన్లపై పోరాటం చేయకపోతే కాంగ్రెస్ నేతలు మౌనంగా ఉండాలని, ఈ అంశంపై కెసిఆర్ మిగతా పార్టీలను కలుపుకుని ఢిల్లీలో ఆందోళనకు వెనుకాడరని చెప్పారు. గాంధీభవన్ సర్కస్ కంపెనీలో రేవంత్‌రెడ్డి లాంటి తుపాకీ రాముళ్ల చప్పట్ల కోసం మాట్లాడే మాటలను తెలంగాణ ప్రజలు పట్టించుకోరన్నారు.

ఇన్విజిలేటర్లకు జంబ్లింగ్

పదో తరగతి పరీక్షల్లో కాపీ జరిగితే వారిపైనా చర్యలు



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 2 వరకు జరుగనున్న పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షల్లో ఇన్విజిలేటర్లకు జంబ్లింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు. ఈ ప్రకారం ఒక ఇన్విజిలేటర్ ఒక పరీక్షా కేంద్రంలో ఒక గదిలో ఒకే రోజు విధులు నిర్వహిస్తారు. అదే గదిలో రెండోసారి విధులు నిర్వహించే అవకాశం ఉండదు. కొంత మంది ఇన్విజిలేటర్లకు పరీక్షా కేంద్రాలను కూడా మార్చనున్నారు. ఉపాధ్యాయులు బోధించే సబ్జెక్ట్‌కు సంబంధించిన పరీక్షరోజు ఆ ఉపాధ్యాయులకు ఇన్విజిలేషన్ విధులు ఉండవు. పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు చూచిరాతలకు పాల్పడితే సంబంధిత ఇన్విజిలేటర్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని హైకోర్టు మార్గదర్శకాలను జారీ చేసింది. చూచిరాతలపై ఇన్విజిలేటర్లకు వ్యక్తిగత జావాబుదారీతనం ఉండాలని పేర్కొంది. చూచిరాతలపై సాధారణ ప్రజలు ఫిర్యాదు చేసేలా ఒక రిజిష్టర్ పొందుపరచాలని తెలిపింది. ఫిర్యాదులు చేసేందుకు అధికారుల ఫోన్ నెంబర్ల జాబితా సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రదర్శించాలని స్పష్టం చేసింది. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులతోపాటు పరీక్షల విధులు నిర్వహించే ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది కూడా ఫోన్లు వినియోగించేందుకు అనుమతి లేదు. ఛీఫ్ సూపరింటెండెంట్‌కి ఫోన్ వాడేందుకు అనుతి ఉండదు. ఈ ఏడాది 431 కేంద్రాలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయగా, 26 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నట్లు గుర్తించారు. రెగ్యులర్ విద్యార్థుల కోసం 2,375, ఫెయిలైన విద్యార్థుల కోసం మరో 167 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 2,542 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలలో 5,38, 867 విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు

పదవ తరగతి పరీక్షల హాల్‌టికెట్లను ప్రభుత్వ పరీక్షల విభాగం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. హాల్‌టికెట్లు అందనివారు, పోగొట్టుకున్నవారు www.bse.telangana.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సంచాలకులు బి.సుధాకర్ తెలిపారు. ఇప్పటికే హాల్‌టికెట్లు పంపించామని, ఎవరికైనా అందకపోతే డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరుకావచ్చని అన్నారు. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లతో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను ఫొటో అంటెండెన్స్ షీట్‌తో సరిచూసి అనుమతించాలని సూచించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలు ధ్వంసం

- దళితులకు న్యాయవ్యవస్థలోనూ అన్యాయమే
- కాంగ్రెస్ ఎస్‌సి సెల్ సమావేశంలో ఉత్తమ్



మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రజాస్వామ్య వ్యవస్థలు పూర్తిగా ధ్వంసమయ్యాయని, చివరకు న్యాయ వ్యవస్థ కూడా ప్రజలకు న్యాయం చేయడం లేదని, ఇది దారుణమైన విషయమని టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డిఆరోపించారు. దళితుల ఓట్ల కోసం ఎన్నికల ముందు సిఎం కెసిఆర్ అనేక హామీలు ఇచ్చారని ,వారిని నమ్మించి వారి ఓట్లతో గద్దెనెక్కి చివరకు వారికి న్యాయం చేయకపోగా, వారిపై అమానుషంగా దాడులు చేయడంతోపాటు మోసం చేశారని అన్నారు. సికింద్రాబాద్‌లోని జయలక్ష్మి గార్డెన్ లో దిశ పేరుతో శుక్రవారం జరిగిన టిపిసిసి ఎస్‌సి సెల్ ప్లీనరీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఆరేపల్లి మోహన్ అధ్యక్షత వహించగా ఎఐసిసి ఎస్‌సి సెల్ అధ్యక్షులు కొప్పుల రాజు, రాష్ట్ర కాంగ్రెస్ ఇంఛార్జ్ ఆర్.సి కుంటియా, కార్య నిర్వాహక అధ్యక్షులు భట్టి విక్రమార్క, ఎంఎల్‌ఎలు గీతారెడ్డి, సంపత్‌కుమార్, మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ, మాజీ మంత్రులు ప్రసాద్ కుమార్, చంద్రశేఖర్, విజయరామారావు, మాజీ ఎంపి రవి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూఅధికారంలో ఉన్న నాలుగేళ్ళ పాటు దళితులకు భూమి ఇవ్వకుండా నాన్చి, భూమి దొరకడం లేదని సాకు చెబుతున్నారని, దళితులకు అర్హులైన వారికి భూమి ఇవ్వాలని లేకపోతే అంతకు సమానమైన ఎకరానికి రూ. 5 లక్షల చొప్పున 15 లక్షల రూపాయలు డిపాజిట్ చేయాలని డిమాండ్ చేశారు. దురదృష్టవశాత్తు న్యాయవ్యవస్థ వల్ల ప్రజలను న్యాయం జరగడం లేదని దళితులపై జరిగిన దాడులకు సంబంధించి అనేక కేసులను కోర్టులు రోజుల తరబడి పెండింగ్‌లో పెడుతున్నాయని, ఇది బాధాకరమైన విషయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొప్పుల రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ కార్యకర్తలు, ముఖ్యంగా ఎస్‌సి,ఎస్‌టి నియోజకవర్గాలలో ఎల్‌డిఎంఆర్‌సి విధానాల ప్రకారం పనిచేస్తే 25 సీట్లు గెలుస్తామని అన్నారు. కుంటియా మాట్లాడుతూ ప్రతిపక్షాలను బలహీన పరిచేందుకు కెసిఆర్ మూడో ఫ్రంట్ అంటూ నాటకాలు ఆడుతున్నారని, అక్కడ మోడీని, ఇక్కడ కెసిఆర్‌ను గద్దె దింపాలన్నారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ టిఆర్ ఎస్ ప్రభుత్వ హయంలో దళితులకు జరుగుతున్న అన్యాయాలు, నిర్బంధాలు, నియంత పాలనపై దళితులు ఊర్లలో పెద్ద ఎత్తున చర్చ చేయాలన్నారు. కాంగ్రెస్ బస్సు యాత్రకు అద్భుత స్పందన లభిస్తోందని, టిఆర్‌ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని మల్లు రవి అన్నారు.

రేపే పల్స్ పోలియో


మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో ఈనెల 11న పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీని కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఏడేళ్లుగా దేశంలో ఎక్కడా కూడా పోలియో కేసు నమోదు కాలేదని, పొరుగున ఉన్న పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, నైజీరియా దేశాలలో పోలియో కేసులు నమోదు కావడంతో మన దేశానికి వ్యాప్తి చెందకుండా ఈ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపడుతోందన్నారు. ఆదివారం రాష్ట్రంలో అయిదేళ్లలోపు వయసు ఉన్న 36.55 లక్షల మంది పిల్లలకు పోలియో చుక్కలు వేస్తామని చెప్పారు. దీని కోసం 22,768 పోలియో కేంద్రాలను ఏర్పాటుచేశామని ఆయన తెలిపారు. ప్రయాణాలలో ఉన్న వారి కోసం బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో, ప్రధాన కూడళ్లలో 737 ట్రాన్సిట్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతం కావడానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నామని, అవసరమైన ప్రచార సామగ్రిని ఇప్పటికే పంపిణీ చేశామన్నారు.

కమిషనర్‌కు సిఐ భార్య ఫిర్యాదు

మన తెలంగాణ/హైదరాబాద్ : డిసిపి బాబురావు, ఇన్‌స్పెక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి, ఎస్‌ఐ ప్రభాకరరెడ్డి, కానిస్టేబుల్ సందీప్‌కుమార్‌ల ఉదంతాలు మరువకముందే మరో ఇన్‌స్పెక్టర్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్ శివారులో విధులు నిర్వహిస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్ ఒక మహిళలతో రాసలీలలు కొనసాగిస్తున్నాడంటూ స్వయంగా ఆయన భార్యే పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రశ్నించినందుకు తనను వేధిస్తున్నాడని ఆ ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. ప్రత్యక్షంగా పోలీసు కమిషనర్‌ను కలిసి ఆమె మొరపెట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు చేపట్టి తనకు న్యాయం చేయాలని కోరారు. పోలీసుశాఖలో తనకున్న హోదాను వాడుకుని తన భర్త వివిధ సమస్యలపై స్టేషన్‌కు వచ్చిన మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, కొద్దిమందితో వివాహేతర సంబంధం కూడా కొనసాగిస్తున్నాడని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని నిలదీసినందుకు తనకు వేధింపులు మొదలయ్యాయని, పిల్లలను నిర్లక్ష్యం చేస్తున్నాడని ఆమె ఫిర్యాదు చేశారు. వీటిపై విచారణ జరపాలంటూ డిప్యూటీ కమిషన్‌ను నగర పోలీసు కమిషనర్ ఆదేశించారు.

బ్యాంకుల ప్రైవేటీకరణకు నిరసనగా

21న ఢిల్లీలో ధర్నా



మన తెలంగాణ / హైదరాబాద్ : ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేటీకరించాలన్న కేంద్ర ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ ఈ నెల 21న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (ఏపి,తెలంగాణ యూనిట్) కన్వీనర్ వివిఎస్‌ఆర్ శర్మ వెల్లడించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణానికి బాధ్యులైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. నగరంలో శుక్రవారం శర్మ మీడియాతో మాట్లాడుతూ, నిర్దిష్టంగా ఒక బ్యాంక్ తప్పుడు విధానాలకు పాల్పడిందన్న పేరుతో ప్రభుత్వరంగ బ్యాంకులన్నింటినీ ప్రైవేటీకరించాలని కేంద్రప్రభుత్వం ఆలోచించడం సమర్థనీయం కాదన్నారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉద్యోగుల కోటి సంతకాల క్యాంపెయిన్‌ను ఇప్పటికే చేపట్టారని, త్వరలోనే లోక్‌సభ స్పీకర్‌కు అందజేస్తామని, ఒక విజ్ఞాపనపత్రాన్ని కూడా సమర్పిస్తామని తెలిపారు. బ్యాంకుల నుండి తీసుకునే అప్పులను పేద మధ్యతరగతి ప్రజానీకం చాలా పద్ధతిగా తిరిగి చెల్లిస్తుండగా విజయ్ మాల్యా లాంటి బడా పారిశ్రామికవేత్తలు వేల కోట్లు ఎగ్గొట్టి దర్జాగా ఉంటున్నారని వివిఎస్‌ఆర్ శర్మ గుర్తు చేశారు. విజయ్ మాల్యా లాంటి వాళ్ళ కారణంగానే బ్యాంకులు దివాలా తీస్తున్నాయన్నారు. ఈ తరహా నేరాలనుపై సమగ్ర దర్యాప్తు జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని, కానీ ఇందుకు ప్రైవేటీకరణ పరిష్కారం కాదన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకులోని క్రింది సిబ్బందిని బాధ్యుల్ని చేయడం, ఉద్యోగులపై వేధింపులకు పాల్పడుతూ సామూహిక బదిలీలు చేయడం సరైన చర్య కాదని, దర్యాప్తులో రిజర్వుబ్యాంకు పాత్రను విస్మరించరాదని, సమగ్ర దర్యాప్తుకు పార్లమెంటరీ సంయుక్త కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ సలహాదారులు హర్షవర్ధన్, బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యదర్శి వెంకట్రామయ్య, బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం, ఇండియన్ నేషనల్ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రతినిధి వెంకటస్వామిలు సమావేశంలో పాల్గొన్నారు.




రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఉంటే ఎంపిలతో రాజీనామా చేయించండి

మన తెలంగాణ/హైదరాబాద్: ఎస్‌టి, ముస్లిం రిజర్వేషన్‌లను పెంచడంలో విఫలమైన సిఎం కెసిఆర్ చిత్తశుద్ధి ఉంటే తమ ఎంపిలతో రాజీనామా చేయించాలని సిఎల్‌పి ఉపనేత టి.జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బ్యాంకులను ముంచిన నీరవ్ మోడీ అంశాన్ని పార్లమెంట్‌లో చర్చకు రాకుండా ఉండేందుకు ప్రధానిమోడి సూచనల మేరకే టిఆర్‌ఎస్ ఎంపిలు పార్లమెంట్‌లో ఆందోళనలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం,ఎస్‌టి రిజర్వేషన్ల పెంపు బిల్లును కేంద్ర ప్రభుత్వానికి పంపించి చేతులుదులుపుకున్నదన్నారు. ఎస్‌టిలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను కల్పించే అధికారం రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నదన్నారు. గిరిజనుల రిజర్వేషన్ల అమలుపై ఎవరికీ అభ్యంతరాలు లేవని, ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వంపై నెట్టి వివాదస్పదం చేస్తున్నారన్నారు. ఎస్‌టి రిజర్వేషన్ల పెంపు అంశం రాష్ట్ర పరిధిలోదని, కేంద్రంలో గిరిజనులకు 7.5 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయని, రాష్ట్రంలో కేవలం ఆరు శాతం మాత్రమే అమలవుతున్నాయని చెప్పారు. ఈ నాలుగేళ్లుగా అన్ని అంశాల్లో కేంద్రంలోని మోడి ప్రభుత్వానికి బేషరతుగా మద్దతు తెలిపిన టిఆర్‌ఎస్ ప్రభుత్వం, ఆ సమయంలో రిజర్వేషన్లను ఎందుకు సాధించలేకపోయిందని ప్రశ్నించారు.

ప్రభుత్వాధికారికి జైలు శిక్ష

మన తెలంగాణ/హైదరాబాద్ : కోర్టు ఆదేశాల్ని పెడచెవినపెట్టిన తెలంగాణకు చెందిన అధికారికి రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది. అయితే ఆ అధికారి అప్పీల్ చేసుకునేందుకు వీలుగా తీర్పును మూడు వారాలపాటు సస్పెండ్ చేసింది. ఈ మేరకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నల్లగొండ జిల్లా మూసీ మత్స్య కార మార్కెటింగ్ సంఘానికి ఆరు వారాల్లో ఎన్నికలు నిర్వహించాలని 2017 సెప్టెంబర్ 7న హైకోర్టు ఆదేశాలిచ్చింది. ఈ ఆదేశాల్ని అమలు చేయకుండా కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారంటూ నర్సయ్య మరొకరు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు అదనపు కమిషనర్/తెలంగాణ సహకార సంఘ ఎన్నికల అధికారి శ్రీనివాస్‌రావు శుక్రవారం స్వయంగా కోర్టుకు హాజరయ్యారు. ఆయన ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందని బెంచ్ రెండు నెలల జైలు శిక్ష విధించింది. అప్పీల్ చేసుకునేందుకు వీలుగా మూడు వారాలపాటు శిక్షను సస్పెండ్ చేసింది.

నేడు, రేపు సందర్శకులకు అవకాశం



మన తెలంగాణ/హైదరాబాద్: బేగంపేట ఎయిర్‌పోర్టులో నిర్వహిస్తున్న ఏవియేషన్ ప్రదర్శన 'వింగ్స్ ఇండియా 2018'కు శని ఆదివారాల్లో సందర్శకులకు అవకాశం లభించనుంది. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు ఈ ప్రదర్శనను తిలకించేందుకు వీలుగా అధికారులు ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు, సాధారణ ప్రజానీకంతో పాటు ఏవియేషన్ సంస్థల ప్రతినిధులను శని, ఆదివారాల్లో సందర్శనకు అనుమతించనున్నారు. సాధారణ సందర్శకులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో ప్రత్యేక బారికేడ్ల నుండి వారిని విమానాల వరకూ అనుమతించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సందర్శకులకు తాగునీరు, కాఫిటేరియా, టాయిలెట్స్ సదుపాయాలు సిద్ధమయ్యాయి. మొబైల్ ఫోన్ల ద్వారా సెల్ఫీలు దిగుతూ ఇతరులకు ఇబ్బంది కల్గించవద్దని అధికారులు ప్రత్యేక సూచనలు చేశారు. సందర్శకుల తాకిడికి అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు చేశారు. మెటల్ డిటెక్టర్ స్కానింగ్ యంత్రంలోంచి స్కాన్ చేసిన తర్వాతే సందర్శకుల వస్తువులను లోనికి అనుమతిస్తారు. అమెరికా, యూరోపియన్ యూనియన్‌లోని పలు దేశాలకు చెందిన విమానాల తయారీ సంస్థలు విమానాలను ప్రదర్శిస్తున్నాయి.

ఎయిర్ కార్గో పరిశ్రమకు భవిష్యత్తు : ప్రైవేట్ రంగ ఎయిర్ కార్గో, లాజిస్టిక్స్ పరిశ్రమ, కేంద్ర ప్రభుత్వం ఈ మూడు సమన్వయంతో పని చేస్తేనే పరిశ్రమకు మంచి భవిష్యత్తు ఉంటుందని కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హా అన్నారు. ఇందుకోసం పరస్పర సహకారం, సంప్రదింపులు నిరంతరం తప్పనిసరిగా ఉండాలని అన్నారు. బేగంపేట విమానాశ్రయంలో నిర్వహిస్తున్న 'వింగ్స్ ఇండియా–2018'సదస్సును ఆయన శుక్రవారం సందర్శించారు.

ఆగని మోన్‌శాంటో రాయల్టీ దగా !

మనతెలంగాణ/హైదరాబాద్ : గత ఐదేండ్లుగా బిజి–2 పత్తి విత్తనానికి అక్రమంగా రాయల్టీ (ట్రెయిట్ వాల్యూ) తీసుకున్న మోన్‌శాంటో ఈసారి కూడా అదే దగాకు పాల్పడుతోంది. రైతు పక్షాన ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సిన కేంద్రం ఈ విషయంలో అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. పత్తి విత్తన ప్యాకెట్‌లో రూ. 39 రాయల్టీ కింద చెల్లించాలని పత్తి విత్తన ధరలపై ఇటీవల ఢిల్లీలో సమావేశమైన కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గత ఏడాది రాయల్టీ రూ.49గా ఉండటం గమనార్హం. వచ్చే వానాకాలంలో బిజి–2 పత్తి విత్తన ప్యాకెట్ (450 గ్రాములు) రూ. 740గా నిర్ణయించినట్లు తెలిసింది. ఈ ధరను పెంచాలని నేషనల్ సీడ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కేంద్రానికి లేఖ రాయడం గమనార్హం. పత్తి మద్దతు ధర చాలా పెరిగిందని, విత్తన ప్యాకెట్ ధరను పెంచాలని అందులో కోరినట్లు తెలిసింది. లేదంటే విత్తనోత్పత్తి తగ్గిస్తామని, తద్వారా మార్కెట్‌లో కొరత ఏర్పడుతుందని పేర్కొంది. వాస్తవానికి బిజి–1 విత్తనం 2006లో గులాబీ రంగు పురుగును తట్టుకునే శక్తిని కోల్పోయింది. దాంతో మరోమారు జన్యుమార్పిడి చేసి మోన్‌శాంటో బిజి–2 పత్తి విత్తనాన్ని ప్రవేశపెట్టింది. ఇది కూడా 2012 నాటికి గులాబీ రంగు పురుగును తట్టుకునే శక్తి కోల్పోయింది. గత 4 ఏండ్లుగా ఈ విత్తనం సాగు చేస్తూ తెగుళ్ల బారిన పడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మోన్‌శాంటోకు చెందిన బిజి–1, బిజి– 2 పత్తి విత్తనాలకు వేటికీ పేటెంట్ లేదు. వీటిపై అక్రమంగా వందల కోట్ల రాయల్టీ వసూలు చేస్తున్నారు. ఒక వేళ పేటెంట్ హక్కులు ఉన్నాయనుకున్నా.. పదేళ్ల తర్వాత అవి రద్దవుతాయి. కానీ అవి వచ్చి 15 ఏళ్లు నిండాయి. అయినా రాయల్టీ వసూలునకు కేంద్రం అనుమతించడంలో ఉన్న మతలబు ఏమిటోనని రైతు సంఘాలు విమర్శిస్తున్నాయి.

13న సర్టిఫికెట్ వెరిఫికేషన్

మనతెలంగాణ/హైదరాబాద్ : టిజిటి(మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, బయోలాజికల్ సైన్స్, సైన్స్) పోస్టులకు ఈ నెల 13న టిఎస్‌పిఎస్‌సి కార్యాలయంలో రెండవ దఫా ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కారణాలతో ధ్రువపత్రాల పరిశీలనకు గైర్హాజరైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే వివిధ కారణాలతో మిగిలిన టిజిజి(తెలుగు,హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ) పోస్టులకు సెకండ్ స్పెల్‌లో 1:2 నిష్పత్తిలో 407 మంది అభ్యర్థులను ఎంపిక చేశామని, ఈ అభ్యర్థులకు ఈ నెల 14 నుంచి 16 వరకు ధృవపత్రాల పరిశీలన నిర్వహించనున్నట్లు తెలిపారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సహించేదిలేదు : హైకోర్టు

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కోర్టుల్లో కేసులు వేసిన వారిపై దాడులకు దిగి చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిని వదిలిపెట్టేది లేదని హైకోర్టు హెచ్చరించింది. సిద్దిఅంబర్ బజార్, మహబూబ్‌గంజ్ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నారంటూ ఫోటోలతో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేసినందుకే తనపై దుండగులు దాడి చేశారని లక్ష్మీ నివాస్ అగర్వాల్ హైకోర్టుకు విన్నవించారు. అగర్వాల్‌కు ఏమేరకు ముప్పు ఉందో సీనియర్ పోలీస్ అధికారితో దర్యాప్తు చేయించి నివేదిక సమర్పించాలని తెలంగాణ సర్కార్‌ను శుక్రవారం ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె విజయలక్ష్మి లతో కూడిన డివిజన్ బెంచ్ తెలంగాణ హోం శాఖను ఆదేశించింది. సిసి పుటేజీని సీల్ కవర్‌లో అందజేయాలని బెంచ్ ఆదేశించింది. దాడి తర్వాత తనకు ప్రాణ హాని ఉందని అగర్వాల్ ఆందోళన వ్యక్తం చేయడంతో బెంచ్ ఆయనకు భరోసా ఇస్తూ ప్రకటన చేసింది.

ఫ్రంట్ ఎజెండాపై కసరత్తు

- విదేశీ అనుభవాల అధ్యయనం
- సలహాదారులకు బాధ్యతలు
- చైనా, సింగపూర్, మలేషియాల అభివృద్ధిపై అధ్యయనం



మన తెలంగాణ/హైదరాబాద్: కాంగ్రెసేతర, బిజెపియేతర పార్టీలతో కూటమి ఏర్పాటు చేయాలని భావిస్తున్న సిఎం కెసిఆర్ వివిధ దేశాల్లోని స్థితిగతులు, అభివృద్ధికి దారితీసిన పరిస్థితులు, అక్కడి అనుభవాలు తదితరాలను అధ్యయనం చేయడంపై దృష్టి పెట్టారు. వివిధ దేశాల్లో పర్యటించిన మాజీ కేంద్ర సివిల్ అధికారుల సాయాన్ని కూడా తీసుకోవాలనుకుంటున్నారు. ప్రభుత్వ సలహాదారులుగా ఉన్న రాజీవ్‌శర్మ, అనురాగ్‌శర్మ, జిఆర్ రెడ్డి, ఏకె గోయల్‌లతో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారిగా ఉన్న ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు సేవలను కూడా ఇందుకోసం వినియోగించుకోవాలనుకుంటున్నారు. చైనా, సింగపూర్, మలేషియా లాంటి దేశాలు వేగంగా అభివృద్ధి చెందడానికి దారితీసిన విధాన నిర్ణయాలు, అక్కడి పరిస్థితులకు అనుగుణంగా అనుసరించిన పద్ధతులు, ఒక్కో రంగంలో అవి సాధించిన అద్భుతాలు తదితరాలను కెసిఆర్ స్వయంగా అధ్యయనం చేయడంతో పాటు సలహాదారుల నుంచి కూడా నివేదిక సమర్పించాల్సిందిగా కోరినట్లు తెలిసింది. ఫ్రంట్ ఎజెండా రూపకల్పనలో భాగంగా ఈ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. వివిధ రంగాల్లో నిపుణులైనవారితో ప్రత్యేకంగా సమావేశం కావాలనుకుంటున్నట్లు తెలిసింది. ముఖ్యంగా వ్యవసాయం, నీటిపారుదల, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పేదరిక నిర్మూలన, పారిశ్రామికాభివృద్ధి, ఉపాధికల్పన, ఆర్థికాభివృద్ధి తదితర అంశాలతో పాటు ప్రజల జీవన ప్రమాణాల్లో వచ్చిన మార్పు, తలసరి ఆదాయంలో సాధించిన ప్రగతి, ఆ దేశాల్లోని పరిపాలనా పద్ధతులు, అధికార వికేంద్రీకరణ లాంటి అనేక అంశాలను స్వయంగా విశ్లేషిస్తుండడంతో పాటు ఆ దేశాలు అనుసరించిన విధానాలపై నిపుణుల బృందంగా ఉన్న సలహాదారుల నుంచి కూడా వివరాలను కెసిఆర్ సేకరిస్తున్నారు. నలుగురు సలహాదారులు నాలుగు రంగాల్లో నిపుణులుగా గుర్తింపు పొందారు. గతంలో వారు వివిధ దేశాల్లో జరిపిన అధికారిక పర్యటనల సందర్భంగా అక్కడి పరిస్థితులను అధ్యయనం చేయడంతో పాటు విధి నిర్వహణలో భాగంగా అందులోని అంశాలను విధాన నిర్ణయాల్లో పొందుపర్చిన అనుభవం వీరికి ఉందని సిఎం అభిప్రాయం. ఆ దేశాల్లో అమలవుతున్న విధానాలను క్రోడీకరించి అందించే బాధ్యతతో పాటు ఆ దేశాలకు ఉన్న విశిష్ట ప్రత్యేకతలను మన దేశానికి వర్తింపజేయడంలో ఉన్న వెసులుబాటు, సాధ్యాసాధ్యాలను కూడా నివేదిక రూపంలో సమర్పించాల్సిందిగా కోరినట్లు తెలిసింది. జాతీయ రాజకీయాల్లో గుణాత్మక మార్పుకు శ్రీకారం చుట్టేందుకు ఫ్రంట్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్న కెసిఆర్ అంతిమంగా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు, దేశ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేందుకు ఆలోచన చేస్తున్నారు. జాతీయ రాజకీయాలపై దృష్టి సారించే అంశాన్ని మీడియాకు వివరించే సందర్భంలో సైతం చైనా, సింగపూర్ అనుభవాలను ఆయన ప్రస్తావించారు. స్వాంతంత్ర్యం వచ్చిన తర్వాత అమలైన 13 పంచవర్ష ప్రణాళికలను అధ్యయనం చేసినట్లు పేర్కొన్న కెసిఆర్ త్వరలోనే ఢిల్లీ, కోల్‌కతా, ముంబాయి, చెన్నయ్ లాంటి నగరాల్లో ప్రాంతీయ సమావేశాలను నిర్వహించడంపై దృష్టి సారించారు. ఫ్రంట్‌కు ఎజెండా రూపొందించడానికి ముందు ఈ నగరాల్లో సమావేశాలను నిర్వహించడంతో పాటు వివిధ దేశాల అనుభవాలను, విధి విధానాలను అధ్యయనం చేయడం కూడా అనివార్యమని భావిస్తున్నారు. పదవీ విరమణ చేసిన కేంద్ర సర్వీసు అధికారులతో సైతం త్వరలోనే భేటీ కానున్నట్లు తెలిసింది. గతంలో చాలా దేశాలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నాయని, ఆ చేదు అనుభవాల నుంచి గట్టెక్కిన పరిస్థితులను సైతం అధ్యయనం చేయాల్సిందిగా సలహాదారులకు సూచించినట్లు తెలిసింది. ఫ్రంట్‌కు పకడ్బందీ ఎజెండాను తయారుచేసి దేశ రాజకీయాల్లో పకడ్బందీ మార్పులకు శ్రీకారం చుట్టే దిశగా కెసిఆర్ ప్రయత్నాలు జరుగుతున్నాయని సన్నిహితవర్గాలు పేర్కొన్నాయి.

బొగ్గు గని కార్మిక సంఘం నూతన కార్యవర్గం

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘం గౌరవ అధ్యక్షులు, ఎంపి కల్వకుంట్ల కవిత శుక్రవారం ప్రకటించారు. అధ్యక్షులు– బి.వెంకటరావు, ప్రధానకార్యదర్శి– ఎం.రాజిరెడ్డి, ఉపాధ్యక్షులు– బొడికల సంపత్‌కుమార్, అప్పని శ్రీనివాస్, కోశాధికారి ఎల్. వెంకటేష్ నియమితులయ్యారు.

12న గుత్తా బాధ్యతల స్వీకరణ



మన తెలంగాణ/హైదరాబాద్: ఈ నెల 12వ తేదీన తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఎంపి గుత్తా సుఖేందర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లోని వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఆయనకు ఛాంబర్‌ను ఏర్పాటు చేశారు.తనను ఛైర్మన్‌గా నియమించినట్లు గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో గుత్తా శుక్రవారం మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డిని కలిశారు. మంత్రి ఆయనకు అభినందనలు తెలిపారు.

రైతు రుణ విమోచన కమిషన్ ఇంకా ఏర్పాటు చేయలేదేం?

- కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోకూడదు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి హైకోర్టు నోటీసులు



మన తెలంగాణ/హైదరాబాద్ : రైతు రుణ విమోచన కమిషన్‌ను మూడు మాసాల్లో ఏర్పాటు చేయాలనే తమ ఉత్తర్వుల్ని ఎందుకు అమలు చేయలేదో వివరించాలని, మీపై కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోరాదో కూడా తెలియజేయాలని తెలంగాణ సర్కార్‌ను హైకోర్టు ఆదేశించింది. ఈమేరకు శుక్రవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ నోటీసులు జారీ చేసింది. వచ్చే విచారణ సమయంలో స్వయంగా హాజరై వివరణ ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. తెలంగాణ రాష్ట్ర రుణ విమోచన చట్టం 2016లోని సెక్షన్ 3(1) ప్రకారం రైతులు, వ్యవసాయ కూలీలు తదితరుల సంక్షేమం కోసం కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్న నిబంధనల్ని అమలు చేయకపోవడాన్ని తప్పుపడుతూ బిజెపి అగ్రనేత, మాజీ ఎంఎల్‌ఏ ఎన్. ఇంద్రసేనారెడ్డి దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని బెంచ్ శుక్రవారం విచారించింది. మూడు నెలల్లో ఏర్పాటు చేయాలని గత ఏడాది ఆగస్టులో హైకోర్టు ఆదేశాలు అమలు కాలేదంటూ ఆయన కోర్టు ధిక్కార రిట్ వేశారు. కమిషన్‌కు హైకోర్టు రిటైర్డు జడ్జిని ఛైర్మన్‌గా నియమించేందుకు హైకోర్టుతో ఉత్తరప్రత్యుత్తరాలు జరపాల్సివుందని ప్రభుత్వ ప్రత్యేక లాయర్ చెప్పారు. గతసారి కూడా ఇదే జవాబు చెప్పారని, తీరా తమతో ఎవరూ సంప్రదింపులే చేయలేదని బెంచ్ వాఖ్యానించింది. సీఎస్ స్వయంగా కోర్టుకు రావాలని ఆదేశిస్తూ విచారణ నెల రోజులకు వాయిదా వేసింది.

త్వరలో రుణ విమోచన కమిషన్?

- హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో సిఎం సమీక్ష
- తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు !

మన తెలంగాణ/హైదరాబాద్ : రుణ విమోచన కమిషన్‌ను సిఎం కె. చంద్రశేఖర్‌రావు త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం.మూడు మాసాల్లో కమిషన్ ఏర్పాటుపై తమ ఉత్తర్వులను అమలు చేయకపోవడం పట్ల ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు శుక్రవారం తీవ్రంగా స్పందించింది. దీంతో సిఎం కెసిఆర్ ఉన్నతాధికారులతో అత్యవసరంగా సమీక్ష సమావేశం నిర్వహించినట్లు సమాచారం. కమిషన్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. ఇప్పటికే రైతు సంక్షేమం కోసం అనేక రకాలుగా కృషి చేస్తున్నామని, రుణ విమోచన కమిషన్ వంటివి ఏర్పాటు చేయకపోతే రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షాలకు అవకాశం ఇచ్చిన వారవుతామని సిఎం అభిప్రాయపడినట్లు సమాచారం. త్వరలోనే కమిషన్ ఏర్పాటుకు సంబంధించి అధికారిక ప్రకటన రానున్నట్లు తెలిసింది. రుణ విమోచన కమిషన్‌కు సంబంధించిన బిల్లుకు 2016 బడ్జెట్ సమావేశాల చివరి రోజున ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి ఛైర్మన్‌గా, నలుగురు సభ్యులతో ఏర్పాటు చేస్తారు.

రైతుల ఆత్మహత్యల నివారించడానికి, తమ సమస్యలను రైతులు కమిషన్‌కు నివేదిస్తే పరిశీలించి కరువు, రుణ పరిస్థితి, రుణాల రీషెడ్యూల్ తదితర అంశాలపై ప్రభుత్వానికి సూచనలు చేస్తుంది. కమిషన్ ఇచ్చే తీర్పును ఏ కోర్టులోనూ అప్పీలు చేయటానికి వీలులేదు. కరువు ప్రాంతాలను ప్రకటించే విషయమై కూడా సిఫార్సులు చేస్తుంది. ఆ తరువాత ప్రభుత్వం తప్పని సరిగా ప్రకటించి తీరాల్సిందే. దాని ప్రకారం రుణాలు రీషెడ్యూల్ చేయడంతో పాటు వడ్డీ మాఫీ చేయాలి. ప్రైవేటు అప్పులు, సహకార, బ్యాంకుల అప్పులపై తీర్పునిచ్చే హక్కు కూడా ఈ కమిషన్‌కు ఉంటుంది.

కాంగ్రెస్‌కు ఇప్పుడున్న సీట్లూ రావు

- బస్సు యాత్రకు ప్రజల నుంచి స్పందన లేదు
- బడ్జెట్ సమావేశాలు అర్థవంతంగా నిర్వహిస్తాం
- మంత్రులు హరీశ్‌రావు, తలసాని




మన తెలంగాణ/హైదరాబాద్: బస్సుయాత్ర కాదు కదా మోకాళ్ళ యాత్ర చేపట్టినా కాంగ్రెస్‌కు అధికారం దక్కదని, ప్రతిపక్ష హోదా కాదు కదా కనీసం ఇప్పుడున్న సీట్లు కూడా రావని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు.కాంగ్రెస్ నేతల బస్సుయాత్రకు ప్రజల్లో ఏ మాత్రం స్పందన లేదని, అందుకే వారిలో తీవ్ర అసహనం పెరిగి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని 2009 ఎన్నికల ప్రణాళికలో కాంగ్రెస్ పొందపర్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. అప్పుడు మంత్రిగా ఉన్న ప్రస్తుత పిసిసి అధ్యక్షులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏ హామీలను అమలు చేశారో స్పష్టం చేయాలన్నారు. టిఆర్‌ఎస్‌ఎల్‌పి కార్యాలయంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, శాసనమండలిలో ప్రభుత్వ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లుతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. తాము అధికారంలోనికి వస్తే వ్యవసాయానికి 9గంటల కరెంటు ఇస్తామని చెప్పి, ఏడు గంటలు కూడా కరెంటు ఇవ్వలేదన్నారు. ఎన్నికల ప్రణాళికలో పొందపర్చిన అంశాలను వందకు వంద శాతం అమలుచేస్తున్న చరిత్ర తమ ప్రభుత్వానిదేనని చెప్పారు. కాంగ్రెస్ నేతలు మాట్లాడేందుకు ఏ ఒక్క అంశం లేదని, రాష్ట్ర ప్రజలంతా సంతోషంగానే ఉన్నారని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ నేతలు తమ ఉనికి చాటుకునేందుకే బస్సుయాత్రను పేరుతో బయల్దేరారని, దీనికి ప్రజల నుంచి స్పందన లేదన్నారు. మంత్రులు కెటిఆర్, ఈటల రాజేందర్‌ను ఇష్టమొచ్చినట్లు కాంగ్రెస్ నేత లు దూషించారని, ప్రభుత్వంలో ఉన్నప్పుడు దోచుకునితిని సిబిఐ కేసులను ఎదుర్కొన్న చరిత్ర కాంగ్రెస్ నేతలదని, ఇప్పటికీ వారు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను అర్ధవంతంగా నిర్వహిస్తామని మంత్రి టి. హరీశ్‌రావు వెల్లడించారు. గతంలో సమావేశాలు ఎక్కువ రోజులు జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తే, ప్రభుత్వాలు పారిపోయేవని, ఇప్పుడు తమ ప్రభుత్వం ఎక్కువ రోజులు సభ నిర్వహిస్తామంటే ప్రతిపక్షాలు పారిపోతున్నాయన్నారు. ప్రజా సమస్యలపై లోతైన చర్చ జరగాలన్నారు. అసెంబ్లీ సమావేశాలను ఎన్ని రోజులైనా,ఎన్ని గంటలైనా జరపాలన్నది ప్రభుత్వ ఆలోచన అని ఆయన స్పష్టం చేశారు. మంత్రి తలసాని మాట్లాడుతూ బిసిల గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. కాంగ్రెస్ బస్స యాత్ర ఒక పిక్నిక్‌లాగా సాగిందన్నారు. బస్సు యాత్రకు స్పందన లేదని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అడ్రస్ లేకుండా పోతుందని అన్నారు. బిసిల గురించి మాట్లాడే హక్కు కాంగ్రెస్ పార్టీకి ఒక్క శాతం కూడా లేదన్నారు.

పుట్టుక, చావు టిఆర్‌ఎస్‌లోనే..


తాను క్రమశిక్షణ కలిగిన కార్యకర్తనని, తన పుట్టుక టిఆర్‌ఎస్‌లోనే, చావు టిఆర్‌ఎస్‌లోనేనని నీటి పారుదల శాఖ మంత్రి టి. హరీశ్‌రావు స్పష్టం చేశారు. కెసిఆర్ మాటే తన బాట అని పేర్కొన్నారు. తాను ఉద్యమాలు, త్యాగాల నుంచి వచ్చానని, తెలంగాణ కోసం రెండు సార్లు ఎంఎల్‌ఎ పదవికి రాజీనామా చేశానని, తనకు త్యాగాలు తప్ప ద్రోహాలు తెలియవని చెప్పారు. ఇతర పార్టీలలో చేరుతున్నట్లు తనపై అదే పనిగా దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మీడియా ప్రతి నిధులు కూడా ఇలాంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వకూడదని కోరారు. టిఆర్‌ఎస్‌ఎల్‌పి కార్యాలయంలో శుక్రవారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ శాసనమండలిలో ప్రభుత్వ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లుతో కలిసి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ తాను బిజెపిలో చేరుతున్నట్లు సోషల్‌మీడియాలో ఒక వీడియోను పెట్టారని, ఒక ప్రముఖ ఛానెల్‌లో ప్రసారమైనట్లు ఆ ఛానెల్ లోగోను మార్ఫింగ్ చేసి, తప్పుడు పోస్టింగ్ చేశారని వివరించారు. దీనిపై తక్షణమే విచారణ జరిపి, అందుకు కారణమైన వారిని జైలులో పెట్టాలని తాను డిజిపికి కోరినట్లు వివరించారు.

రిజర్వేషన్లపై కావాలనే తాత్సారం



మనతెలంగాణ/న్యూఢిల్లీ: రిజర్వేషన్లు పెంచుకొనే అధికారాన్ని రాష్ట్రాలకు ఇవ్వాలంటూ పార్లమెంట్ లోపలా బయటా టిఆర్‌ఎస్ ఎంపిలు తమ ఆందోళనలను కొనసాగిస్తూనే ఉన్నారు. వరుసగా అయిదవ రోజయిన శుక్రవారం కూడా ఎంపిలు.. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తమ గళం వినిపించారు. లోక్‌సభ ప్రారంభం కాగానే వెల్‌లోకి దూసుకెళ్లారు. నినాదాలు చేశారు. ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. సభ రెండు సార్లు వాయిదాపడిన అనంతరం లోక్‌సభలో టిఆర్‌ఎస్ ఉప నేత వినోద్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తుందని విమర్శించారు. తెలంగాణ శాసనసభలో చేసిన చట్టాన్ని గౌరవించి రాజ్యాంగంలోని షెడ్యూల్ 9లో పొందుపరచి, గిరిజన సోదరులకు, వెనుకబడిన వర్గాల మహిళలకు, మైనార్టీ సోదరులకు, వెనుకబడిన కులాలకు రక్షణ కల్పించాలని మోడీని కలసి సీఎం కేసీఆర్ ప్రాదేయపడ్డారని అన్నారు. ఎంపిలు కూడా పదినెలల నుండి వివిధ మంత్రులను కలసి చట్టసవరణ చేయాలని కోరాము. చూద్దాం, చేద్దాం, మాట్లాడతాం అనే రెస్పాన్స్ తప్ప మరే అనుకూల ప్రకటన రాలేదంటూ కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆయన దుయ్యబట్టారు. తెలంగాణ కోరుతున్న విధంగా రిజర్వేషన్లకు సంబంధించి చట్టసవరణ చేయలేమని కేంద్ర హోం శాఖ స్పష్టం చేసిందని, చట్టాల గురించిన సమగ్ర అవగాహన కేంద్ర మంత్రులకు, అధికారులకు లేదని విమర్శించారు. 1992 లో ఇందిరా సహాని కేసు స్పష్టంగా చెప్పింది. 50శాతం రిజర్వేషన్లు మించకూడదని చెబుతూ.... ప్రత్యేక పరిస్థితులలో స్పష్టమైన జనాభా సంఖ్యని చూపించి అవసరమైతే పెంచుకోవచ్చని కూడా సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని ఆయన వెల్లడించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కంటే, తెలంగాణ ఏర్పడిన తరువాత గిరిజనుల శాతం పెరిగింది. మైనారిటీలు వెనుకబడిన తరగతులలో ఉన్నారు. వారి సంఖ్య కూడా తెలంగాణాలో ఎక్కువగా ఉన్నది కాబట్టి, పూర్తి అవగాహన తో కేసీఆర్ శాసనసభలో చట్టసవరణ చేసి పంపించారని వివరించారు. రిజర్వేషన్ల పెంపు గురించి అవగాహన లేనట్లు, కేంద్ర ప్రభుత్వ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాస్తూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు.అందుకే రాజ్యాంగాన్ని రాసిన మహనీయుడు అంబేద్కర్ సాక్షిగా శుక్రవారం మా ఎంపిలు నిరసన తెలియజేశారని వినోద్ తెలిపారు. జనాభా రీత్యా రిజర్వేషన్లు పొందే హక్కును రాజ్యాంగ రచన సందర్భంగా కల్పించారని వివరించారు. బిజెపి పెత్తందార్ల పార్టీ అని దేశ ప్రజలకు మరొకసారి చెప్పదలచుకున్నారా ? అని కేంద్రాన్ని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంపై స్పందించే వరకు మా నిరసన కొనసాగిస్తామని ఎంపి వినోద్ వెల్లడించారు. తెలంగాణ ప్రజల న్యాయమైన కోరిక అయిన రిజర్వే షన్ల పెంపు గురించి గత ఐదు రోజులుగా ఆందోళన చేస్తున్నా కనీస స్పందన కరువైందని ఎంపి సీతారాం నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం చర్చ జరగకుండా దాటవేయడం అన్యాయం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ విషయంపై దాటవేసిన ధోరణిని అవలంభిస్తే, తెలంగాణ ప్రజలు బిజెపికి తగిన గుణపాఠం చెబుతారన్నారు.

"కృషి అనే ద్వారాన్ని తెరవకపోతే అదృష్టం అదృశ్యమవుతుంది.
– అబ్రహాం లింకన్"



ఉద్యోగాల్లో స్త్రీ, పురుష అసమానత

సంపాదకీయం

అందరికీ తెలిసిన సంగతే. ప్రతి క్షణం, అనుదినమూ కళ్లారా చూస్తున్నదే. కానీ మరోసారి ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఒ)కుండబద్దలు కొట్టినట్లు చెప్పింది. ప్రపంచవ్యాప్తంగా స్త్రీ, పురుష సమానత్వం దిశగా గతంకంటె మరికొంత ప్రగతి సాధ్యమైనప్పటికీ వారి మధ్య పూర్తి అభేదాన్ని, లింగ సమతౌల్యాన్ని అందుకోవడానికి ఇంకా ఎంతోదూరం ప్రయాణించవలసి ఉంటుందన్న చేదువాస్తవాన్ని మానవాళి ముఖంమీద గుద్దినట్లు వెల్లడించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఐఎల్‌ఒ ఈ నిర్ధారణను లోకవిదితం చేసింది.

మాతృస్వామ్యం వంటి స్త్రీ యాజమాన్యంలోని సామాజిక వ్యవస్థలు వర్ధిల్లిన ప్రపంచంలో పురుషాధిక్యత, ఆధిపత్యాలు అనంతర కాలంలో చొరబడి ఇంతగా కరడుగట్టుకుపోయి ఇంకా కొనసాగుతూ ఉండడం మానవజాతి సిగ్గుపడవలసిన విషయం. ఇదిఅది అని తేడాలేకుండా అన్ని రంగాలలోనూ స్త్రీపురుష అసమానత కొనసాగుతున్నది. ఆధిపత్య హోదా, నిర్ణయాధికారం, అధిక వేతనం, స్వేచ్ఛగల ఉద్యోగాలు మగవారికి, కిందిస్థాయి కొలువులు స్త్రీలకు అనే పరిస్థితి ఇంకా దారుణంగా నెలకొని ఉన్నదని ఐఎల్‌ఒ నివేదిక స్పష్టం చేసింది. భారతదేశంలోనైతే ఈ దుస్థితి మరింత దారుణంగా ఉంది. దేశంలో వేళ్లానుకున్న సామాజిక వ్యవస్థ రీత్యా ఎంత చదువుకున్న, మరెంత నైపుణ్యంగల అమ్మాయినైనా ఇంటికే పరిమితం చేసి పెళ్లిచేసి అత్తవారింటికి పంపించడం అక్కడ కూడా గృహిణిగానే ఉంచడం జరుగుతున్నది. స్త్రీకి ఈ చిమ్మచీకటి నుంచి ఇప్పుడిప్పుడే పిసరంత వెలుగు, వెసులుబాటు లభిస్తున్న మాట వాస్తవం. పురుష దురహంకార దుర్మార్గాలు నానాటికీ పెచ్చరిల్లిపోతున్నప్పటికీ తల్లిదండ్రులే ఆడపిల్లలను చదువులకు, ఉన్నత విద్యలకు పంపించి వారిలో కొద్దిమందిచేతనైనా ఉద్యోగాలు చేయించే ధోరణి పెరుగుతున్నది. ఇందుకు సంతోషించాలి. అయితే ఎంత చదువుకున్నా స్త్రీలకు లభిస్తున్నవి కిందిస్థాయి ఉద్యోగాలే. అందులోనూ అకాల ఉద్వాసన కత్తి మహిళల మీదనే వేలాడుతూ ఉంటుంది.

2017 సంవత్సరం తొలి నాలుగు మాసాల్లో దేశంలో పురుషులకు ఉద్యోగ అవకాశాలు 0.9శాతం పెరగగా 24లక్షలమంది ఉద్యోగినులు కొలువులు కోల్పోయారు. 2018 లో కూడా పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉండే అవకాశాలు లేవని నిపుణులు చెబుతున్నారు. దేశంలోని మహిళల్లో 27శాతంమందే ఉపాధి, ఉద్యోగాల్లో ఉన్నారు. అందులోనూ వ్యవస్థీకృత రంగంలో మహిళల సంఖ్య తక్కువే. గృహ నిర్మాణాది అవ్యవస్థీకృత రంగాల్లోనే పురుషులకంటె తక్కువ వేతనాలమీద స్త్రీలచేత కఠోరమైన శ్రమ చేయించుకుంటున్నారు. దేశంలో మహిళది ఎంతటి దయనీయ స్థితి అంటే పార్లమెంట్‌లో పాలక పార్టీకి పూర్తి మెజారిటీ ఉన్నప్పటికీ చట్టసభల్లో ఆమెకు రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి నోచుకోవడం లేదు.

మహిళల ఉద్యోగాల విషయంలో దక్షిణాసియా దేశాలలోనే భారత్ పరిస్థితి హీనంగా ఉన్నది. 2013కు ముందరి రెండు దశాబ్దాలలో దేశ కార్మిక శక్తిలో మహిళ భాగస్వామ్యం 34.8శాతం నుంచి 27శాతానికి పడిపోయింది. గ్రామీణ ప్రాంతాల లోని నిరక్షరాస్య మహిళలు, పట్టణ ప్రాంతాల్లోని పట్టభద్ర స్త్రీలు మాత్రమే బయటికొచ్చి పలు రకాల పనులు, ఉద్యోగాలు చేస్తున్నారని 2017 మార్చిలో విడుదలైన ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడించింది. దేశంలో ఉద్యోగులు, బయటి పనిపాట్లలో మహిళలు 1990లో 34.80 శాతం ఉండగా 2016నాటికి అది 23.70శాతానికి పడిపోయిందంటే స్త్రీని ఇంటికి పరిమితం చేయడమే ఘనమైన, పురుషుడికి గర్వకారణమైన విషయమనే భావన పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని భావించవలసి ఉంది. దేశంలో చదువుకుంటున్న ఆడపిల్లల సంఖ్య పెరుగుతున్నది కానీ వారిలో అతి తక్కువమందే ఉద్యోగాలలో చేరుతున్నారని అనేక సర్వేలు చాటుతున్నాయి. ఐఎల్‌ఒ నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా మహిళల్లో నిరుద్యోగం పురుషులలో కంటె అధికంగా ఉన్నది. ఈ దేశం, ఆ దేశం అనకుండా అంతటా ఉద్యోగాల్లోను, ఇతరత్రా ఇంట,బయటా మహిళ ద్వితీయ శ్రేణిలోనే కొనసాగడానికి ఆయా సామాజిక వ్యవస్థలు పురుష నిరంకుశ పాలనలో ఉండడమే కారణం. మూలంలో అధికారం, నిర్ణయ హక్కు పురుషుల చేతుల్లో ఉన్నంతవరకు ప్రపంచంలో ఎక్కడైనా స్త్రీది రెండవ వరుసే. ఎక్కడికక్కడ పురుషుడికి ఎదురులేని అగ్రస్థానాన్ని ఇస్తున్న సనాతన, పురాతన వ్యవస్థల్లోని సామాజిక అన్యాయాన్ని సమూలచ్ఛేదం చేయకుండా ప్రజాస్వామ్యం నిర్దేశిస్తున్న లింగసమానత్వం అవతరించదు.


అగ్నిపరీక్ష ముగిసినట్టేనా?

చూపు

మైనారిటీ తీరిన తర్వాత ఎవరైనా ఎవరినైనా తమ ఇష్టప్రకారం పెళ్ళి చేసుకోవచ్చని ఇంతవరకు భావిస్తూ వచ్చాం. కాని కేరళ హైకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు తర్వాత యుక్తవయస్కులు ఇష్టప్రకారం పెళ్ళి చేసుకునే అవకాశం లేదని, పాతికేళ్ళ యువతి కూడా తల్లిదండ్రుల సంరక్షణలోనే ఉండాల్సి ఉంటుందని అనిపించింది. వ్యక్తిస్వేచ్ఛలు పైకి కనిపిస్తున్నంత సులభంగా లభించవు. చివరాఖరుకు సుప్రీంకోర్టు కలుగజేసుకుని యుక్త వయస్సు వచ్చిన తర్వాత ఇష్టప్రకారం పెళ్ళి చేసుకోవచ్చని చెప్పడం చాలా బాగుంది. బహుశా ఈసారి మహిళాదినోత్సవం సందర్భంగా సుప్రీంకోర్టు మహిళలకు ఇచ్చిన కానుక ఇది. కాని ఒక స్త్రీ, ఒక పురుషుడు ఇష్టపడి పెళ్ళి చేసుకునే హక్కు వారికి ఉందని, ఆ పెళ్ళిని ఎవరూ కాదనలేరని స్వతంత్రం వచ్చిన ఇన్ని దశాబ్దాల తర్వాత సుప్రీంకోర్టు చెప్పవలసి రావడం చాలా దురదృష్టకరమైన పరిస్థితి. ఇలాంటి దురదృష్టకరమైన వాతావరణం దేశంలో ఎందుకు, ఎలా ఏర్పడిందన్నది అందరూ ఆలోచించవలసిన ప్రశ్న. ఈ చర్చంతా కేరళకు చెందిన ఒక అమ్మాయికి సంబంధించిన పెళ్ళి వ్యవహారం చివరకు సుప్రీంకోర్టు వరకు వెళ్ళడంతో వచ్చింది. ఇష్టప్రకారం పెళ్ళి చేసుకున్న హదియా అనే పాతికేళ్ళ యువతి తన భర్త షఫీ జహాంతో కలిసి ఉండవచ్చని, ఆమె పెళ్ళి చట్టబద్ధమైనదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

హదియా కేసు విషయంలో వివిధ సంస్థలు వ్యవహరించిన తీరు చాలా ఆందోళనకరంగా ఉంది. ముఖ్యంగా క్రింది కోర్టుల్లో వచ్చిన తీర్పులు దిగ్భ్రాంతికరంగా ఉన్నాయి. యుక్తవయస్కురాలైన ఒక యువతి తన జీవితం గురించి నిర్ణయాలు తాను తీసుకోరాదన్నట్లు దిగువ కోర్టు మాట్లాడింది. ఒక హిందూ అమ్మాయి మతం మార్చుకుంటే అందులో ఏదో అనుమానాస్పద విషయం ఖచ్చితంగా ఉంటుందన్నట్లు వ్యవహరించింది. లవ్ జిహాద్ అంటూ మతతత్వ శక్తులు చేస్తున్న హంగామాను నూటికి నూరుపాళ్ళు నమ్ముతున్నట్లుంది ఈ వ్యవహారశైలి. సుప్రీంకోర్టు కూడా హదియా వివాహం చట్టబద్ధమని ఒప్పుకుంటూనే లవ్ జిహాద్ విషయంలో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సీ తన విచారణ కొనసాగించవచ్చని చెప్పింది. ఈ ఒక్క మాట చాలు హదియా తండ్రి అశోకన్ తన మాటే నెగ్గాలని పట్టుపట్టడానికి. ఎన్ ఐ ఏ విచారణ కొనసాగాలని సుప్రీంకోర్టు చెప్పింది కాబట్టి హదియా పెళ్ళి చేసుకున్న షఫీ జహాం టెర్రరిస్టే అని ఆయన తీర్మానించేసాడు. ఇప్పుడు తన కూతురు ఒక టెర్రరిస్టుతో కలిసి ఉండడం తనకు చాలా బాధాకరంగా ఉందని కన్నీళ్ళు కూడా పెట్టుకుంటాడు. సహజంగానే అతని పట్ల సానుభూతి కురుస్తుంది. కాని తన ప్రాణాలకు తన తండ్రి నుంచే ప్రమాదంలా ఉందని ఇంతకు ముందు ఆ అమ్మాయి మొత్తుకున్నప్పుడు అసలు టెర్రర్ సృష్టిస్తుందెవరన్నది మాత్రం ఆలోచించిన వాళ్ళు చాలా తక్కువ. తన కూతురు ఒక టెర్రరిస్టుతో కలిసి ఉండడం తనకు ఇష్టం లేదని అందువల్ల తాను రివ్యూ పిటీషను వేయబోతున్నానని హదియా తండ్రి తాజాగా ప్రకటించాడు.

కేరళ హైకోర్టు మే 2017లో హదియా పెళ్ళి చెల్లదని తీర్పుచెప్పింది. ఇద్దరు యుక్తవయస్కులు చేసుకున్న పెళ్ళి చెల్లదని ఒక హైకోర్టు చెప్పడమేమిటని ప్రశ్నించిన వాళ్ళు చాలా తక్కువ. అంతేకాదు, హైకోర్టు ఆమెను తల్లిదండ్రుల సంరక్షణలో ఉండాలని అదేశించింది. అంటే గృహనిర్బంధం. ఈ గృహనిర్బంధం కాలంలో సంఘ్ పరివార్‌కి సన్నిహితుడిగా భావించే రాహుల్ ఈశ్వర్ అనే యాక్టివిస్టు ఆమెను కలిసి మాట్లాడారు. తన తండ్రి నుంచే తనకు ప్రమాదం ఉందని, తనను హింసిస్తున్నారని, తనను చంపేయవచ్చని కూడా ఆమె అప్పుడు చెప్పింది. ఆ మాటలకు చలించిపోయిన రాహుల్ ఈశ్వర్ తర్వాత ఆ విడియో విడుదల చేశాడు. హదియా చాలా ధైర్యంగా నిలబడింది. ఆత్మవిశ్వాసంతో సుదీర్ఘపోరాటం చేసింది. నిజానికి ఇది ప్రేమ వివాహం కూడా కాదు. ఒక మాట్రిమోనియల్ సైటు ద్వారా ఆమె షఫీ జహాంను భర్తగా ఎంచుకుంది. ఆమె వివాహం 2016లో జరిగింది. తండ్రి లవ్ జిహాద్ కేసు పెట్టాడు. సంవత్సరం తిరక్కుండానే మే 2017లో కేరళ హైకోర్టు ఈ పెళ్ళి చెల్లదంటూ తీర్పు వినిపించేసింది. కోర్టు చెప్పిన మాటలేమంటే, ''ఇరవై నాలుగు సంవత్సరాల అమ్మాయి బలహీనురాలు. ఒత్తిడికి లొంగిపోతుంది. అనేకవిధాలుగా దోపిడీకి గురి అవుతుంది''. కోర్టు చెప్పిన మరో మాట, ''ఆమె పెళ్ళి జీవితంలో చాలా ముఖ్యమైన నిర్ణయం. తల్లిదండ్రుల ప్రమేయంతో మాత్రమే తీసుకోవలసిన నిర్ణయం''. భారతరాజ్యాంగం ఈ మాటలు చెప్పిందా? దేశ చట్టాలు చెప్పాయా? దేశంలో జరుగుతున్న రిజిష్టర్డు వివాహాల సందర్భంగా అమ్మాయి తల్లిదండ్రులు తమ ఆమోదాన్ని తెలియజేస్తూ సంతకాలు చేస్తున్నారా? అలా చేయకపోతే ఆ వివాహాలు చెల్లుతాయా లేదా? కేరళ హైకోర్టు చెప్పిన ఈ మాటలను ఎలా అర్థం చేసుకోవాలి?



ఈ తీర్పును సవాలు చేస్తూ ఆమె భర్త అప్పీలు చేశాడు. కాని ఊరట చాలా నెమ్మదిగా, వాయిదాల పద్ధతిలో దొరికింది. నవంబర్ 2017న సుప్రీంకోర్టు హదియాను గృహనిర్బంధం నుంచి తప్పించి చదువుకోడానికి కాలేజీ పంపించింది. ఆమె మెడిసిన్ చదువుతోంది. తమిళనాడు, సేలమ్ లోని హోమియోపతి కాలేజీకి ఆమె వెళ్ళింది. అప్పుడు కూడా ఆమె స్పష్టంగా తాను భర్తతో కలిసి ఉండాలనుకుంటున్నానని, తన భర్తే తనకు గార్డియన్ గా ఉండాలని, తన ఇష్టప్రకారం పెళ్ళి చేసుకున్నానని గొంతుచించుకుని చెప్పింది. కాని కోర్టు మాత్రం కాలేజి డీన్ గార్డియన్ గా ఉంటారని పేర్కొంది. ఆమె భర్తతో మాట్లాడే అవకాశం ఇవ్వలేదు.

హదియా తల్లి హిందూ. తండ్రి తన్నుతాను నాస్తికుడిగా చెప్పుకున్నట్లు వార్తలు వచ్చాయి. ఆమె స్కూలు చదువు తర్వాత సేలమ్ లో చదువుకోడానికి వెళ్ళింది. అక్కడ ముస్లిం మిత్రుల వ్యవహారశైలి ఆమెకు చాలా నచ్చింది. ఇస్లామ్ గురించి తెలుసుకోవడం ప్రారంభించింది. 2015లో ఆమె ఇస్లామ్ మతం స్వీకరించాలని నిర్ణయించుకుంది. ఇంట్లో తెలిసింది. గొడవ జరిగింది. ఆమె ఇల్లు వదిలి ముస్లిం మిత్రుల ఇంట ఉండసాగింది. జులై 2016లో ఆమె లాంఛనంగా ఇస్లాం స్వీకరించిన ప్రకటన చేసింది. తన పేరు హదియాగా మార్చుకుంది. క్రింది కోర్టు పిటీషను కొట్టి వేసిన తర్వాత ఆమె తండ్రి హైకోర్టుకు వెళ్లాడు. ముస్లిం సంస్థలు తన కూతురిని కిడ్నాప్ చేసి విదేశాలకు తీసుకెళ్ళే కుట్ర చేస్తున్నాయని, ఐయస్‌ఐయస్‌లో చేర్చేస్తారని చెప్పుకున్నాడు. అదే సంవత్సరం డిసెంబరులో హదియా ఒక మాట్రిమోనియల్ సైటు ద్వారా షఫీ జహాంను ఎంచుకుని వివాహం చేసుకుంది. తన పెళ్ళయిన రెండురోజుల తర్వాత ఆమె కోర్టులో తన భర్తతో పాటు హాజరైంది. కాని హైకోర్టుకు ఆమె పెళ్ళి నచ్చలేదు. ఆమె హాస్టలుకు వెళ్ళిపోవాలని ఆదేశించింది. ఆమె భర్తతో ఉండరాదని ఆంక్షలు విధించింది. ఇప్పుడు హదియా, షఫీజహాం సంతోషంగా కలిసి ఉండవచ్చు. కాని ఈ కేసు మన సమాజంలో లోలోతుల్లో వేళ్ళూనుకుపోయిన పురుషస్వామ్యాన్ని, మైనారిటీ మతాలపట్ల అనుమానాలను బట్టబయలు చేసింది.

* ఆయేషా

త్రిపుర నుంచి హైదరాబాద్‌కు



టంకశాల అశోక్
9848191767

ఈ ఏప్రిల్‌లో హైదరాబాద్‌లో కీలకమైన 22వ కాంగ్రెస్ సమావేశాలను జరుపుకోనున్న సిపిఎం పార్టీ ఇప్పటికే క్లిష్టస్థితిని ఎదుర్కొంటున్నది. అందుకు సరిగా నెలరోజులముందు త్రిపురలో అధికారాన్ని కోల్పోవటం ఆ క్లిష్టతను మరింత పెంచుతున్నది. తన వైఫల్యాల వల్ల బెంగాల్‌లో ఓడిన గత ఏడేళ్లలో కూడా ఎటువంటి సవరణలు చేసుకోకుండా కేవలం అధికార రాజకీయ క్రీడలలో నిమగ్నమై ఉన్న స్థితిలో, ఇపుడు హైదరాబాద్ కాంగ్రెస్‌పై ఆశలు పెట్టుకోదగింది ఏమైనా ఆ పార్టీకి ఉండవచ్చునా?

త్రిపుర ఓటమి సాధారణమైనది కాదు. దానికి గల ఒక కోణం గురించి ఎవరూ మాట్లాడటం లేదు. దేశం లో కేవలం వామపక్షాలకు భాగస్వామ్యం గల లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వాలు రెండు ఉండేవి. అవి బెంగాల్, త్రిపుర. కేరళది లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్. అనగా లెఫ్ట్ నాయకత్వాన కొన్ని డెమొక్రటిక్ లేదా బూర్జువా పార్టీ లు కూడా ఫ్రంట్‌లో చేరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమన్న మాట. ఆ విధంగా నికార్సయిన వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వాలు దేశంలో రెండు ఉండగా వాటిలో బెంగాల్ ఏడేళ్ల క్రితం పోయింది. ఇపుడు త్రిపుర కూడా పోయింది. ఇది మంచి నమూనాయే. కాని దానిని తమకు తామే ఓడించుకున్నారు. ఆ విధమైన సైద్ధాంతిక స్థాయిలో చూసినపుడు కేరళ లెక్కలోకి రాదు గనుక దేశంలో ఈ రోజున కమ్యూనిస్టులు పూర్తిగా స్వయంశక్తితో ఎక్కడా అధికారంలో లేరన్నమాట. పైన అన్నట్లు కేరళలో నాయకత్వం లెఫ్ట్‌ది అయినా ఆ ఫ్రంట్‌లో బూర్జువా పార్టీలు కొన్ని ఉన్నందున 'స్వేచ్ఛ' గా పనిచేసే అవకాశం లెఫ్ట్‌కు ఉండదు. అటువంటి అవకాశం లేనందునే తాము కొన్ని పనులు చేయలేకపోతున్నామన్నది లెఫ్ట్ నాయకులు ఎప్పుడూ చేసే వాదన. అందులో తర్కం అసలు లేదని కాదు. కాని అదే సమయంలో అయిదేళ్లకొకసారి లెక్కన అయినా పాలిస్తున్నపుడు, తామే నాయకత్వ స్థానంలో ఉన్నపుడు, క్రమంగా ప్రజాదరణ పొంది ఎందుకు ఎదగటం లేదన్నది ఒక ప్రశ్న. అధికారం అనుభవించటం వల్ల వచ్చే అవలక్షణాలు తమలో ఎందుకు ప్రవేశిస్తున్నాయన్నది మరొ క ప్రశ్న. అనేక ఇతర రాష్ట్రాలలో వలె ప్రజలు ''వీరు కాకుంటే వారు, వారు కాకుంటే వీరు'' అనే పద్ధతిలో పెండ్యులం ఓటింగ్ చేస్తే అయిదేళ్ల కొకసారి అధికారానికి రావటం మినహా, స్వయంగా తమ పరిపాలన నమూనాతో ప్రజాదరణ ద్వారా సుస్థిర అధికారం ఎందుకు రావటం లేదన్నది ఇంకొక ప్రశ్న. వీటన్నింటి మధ్య వీరు ఘనంగా చాటి చెప్పే 'కేరళ నమూనా' స్వరూప స్వభావాలేమిటి? బూర్జువా పార్టీలు కూడా భాగస్వాములైన చోట ఒక ''గొప్ప'' నమూనాను ఆవిష్కరించగలిగిన వారు కేవలం వామపక్షాలే గల ఫ్రంట్ ద్వారా బెంగాల్‌లో ఎందుకు ఆవిష్కరించలేకపోయారు?

కనుక, త్రిపుర ఓటమిని ఆవరించుకుని అనేక ప్రశ్నలున్నాయి. బెంగాల్‌లో పలు ఎన్నికల పరాజయా లు తమను కలవరపెడుతుండగా 2015లో విశాఖపట్నంలో జరిగిన 21వ కాంగ్రెస్‌లో సిపిఎం కొన్ని ముఖ్య నిర్ణయాలు తీసుకుంది. జాతీయ పార్టీలతో, ప్రాంతీయపార్టీలతో ఎన్నికల అవగాహనలు, ఆ విషయి గత పాతికేళ్ల అనుభవాల గురించి వారక్కడ తమ రాజకీయ తీర్మానంలో చాలానే చెప్పుకున్నారు. కాని ఏడాది తిరిగే సరికి బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్‌తో పొత్తు ప్రశ్నపై చిన్న అరాచకం అనదగ్గ గందరగోళంలో పడ్డారు. బెంగాల్ శాఖకు, కేంద్ర నాయకత్వానికి మధ్య పేచీ ఏర్పడగా, రాష్ట్ర కమిటీ దాదాపు తిరుగుబాటు చేసి పై చేయి సాధించింది. అప్పటి గందరగోళం ఇప్పటికీ ముగియలేదు. 2019 ఎన్నికలలో గాని, ఇతరత్రా గాని కాంగ్రెస్‌తో అవగాహన విషయమై పార్టీ ప్రధాన కార్యదర్శి యేచూరి సీతారాం, మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ లైన్ల మధ్య తీవ్రమైన విభేదాలు తలెత్తా యి. అవి ఎంతవరకు పోయాయంటే, సీతారాం కాంగ్రెస్ అనుకూలుడని ప్రకాశ్ వర్గం ప్రచారం సాగించగా,''అట్లయితే మీరు బిజెపికి అనుకూలమని నేను అంటా''నని సీతారాం బహిరంగంగా హెచ్చరించారు. సిపిఎం జాతీయ పార్టీయే తప్ప కేరళ పార్టీ కాదని (ప్రకాశ్ ది కేరళ) మరొక సందర్భంలో అన్నారు. సెంట్రల్ కమిటీ లో తన విధానపత్రం ముసాయిదా వరుసగా ఓడుతూ ప్రకాశ్ తీర్మానం నెగ్గుతుండటంతో, ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా ఇవ్వజూపారు. పార్టీ చీలిక మార్గంలో లేదంటూ చివరకు రెండు వర్గాలూ వివరించుకోవలసి వచ్చింది.

> అసలు సమస్య ఏమంటే సిపిఎంకు ఈ రోజున వివిధ అంశాలపై, సవాళ్లపై స్పష్టతలు, లోపాలను నిజాయితీతో గుర్తించి ధైర్యంగా ఒప్పుకుని దార్శనికతతో ముందుకు పోగల నాయకత్వాలు లేవు. వెనుకటి తరం వలె క్షేత్రస్థాయిలో పునాదులు, ఆ స్థాయిలో కార్యాచరణ అనుభవాలు లేవు. వాస్తవిక అంచనాల కన్న వైయక్తిక ధోరణులు ఎక్కువ. పలువురిపై ఏదో ఒక స్థాయిలో ''బూర్జువా'' ధోరణులు, ప్రలోభాల ప్రభావాలు ఉన్నాయి. తమ కష్టతరమైన జీవితాల మూలంగా, చెదరని ఆశలతో, అమాయకంగా నమ్మి, ప్రశ్నలు రేకెత్తించకుండా, త్యాగాలు చేస్తున్న సామాన్య కార్యకర్తలు పలువురు వెంటలేకపోయినట్లయితే, ఇటువంటి నాయకత్వాల కారణంగా ఈ పార్టీలు ఎన్నడో అంతర్ధానమయేవి. ఈ సిసలైన మౌలిక సంక్లిష్టతను మాత్రం హైదరాబాద్‌లో చర్చించ బోవటం లేదు.

ఉమ్మడి కమ్యూనిస్టుపార్టీ 1964లో సిపిఐ, సిపిఎంగా చీలిన తర్వాత, తిరిగి ఇంత క్లిష్టమైన పరిస్థితి గత 54 సంవత్సరాలలో ఎప్పుడూ ఏర్పడలేదు. యథాతథంగానే ఈ క్లిష్టస్థితిని మోసుకుంటూ సిపిఎం పార్టీ వచ్చే నెలలో 22వ కాంగ్రెస్ కోసం హైదరాబాద్ వచ్చేందుకు ఉద్వేగాల మధ్య సన్నద్ధమవుతున్నది. ఇది చాలదన్నట్లు ఇపుడు త్రిపుర పరాజయం మూలిగేవాడి నెత్తిన తాటి పండువలె పడింది. దీనితో సంక్లిష్టత మరింత పెరిగే అవకాశం ఉంది. విశేషం ఏమంటే సీతారాం, ప్రకాశ్‌ల మధ్య గల భిన్నవాదనలలో త్రిపుర కమిటీ సీతారాంతో ఏకీభవించలేదు. అక్కడి సిపిఎంకు కాంగ్రెస్‌తో ఎట్లానూ పొత్తు లేదుగాని, ఇపుడు ఓడినందున 2019 లోక్‌సభ ఎన్నికలలో బిజెపిని నిలువరించేందుకు అటువంటి అవగాహనకు రావచ్చుననే ఊహాగానాలు అప్పుడే మొదలయ్యాయి. ఈ కొత్త స్థితి లో త్రిపుర కమిటీ సీతారాం తీర్మానాన్ని బలపరచవచ్చు నా? అసలు ఈశాన్య భారతంలో బిజెపి విజయాల దృష్ట్యా మరికొందరు కూడా సీతారాం వైపు మళ్లవచ్చు నా? ఇటువంటి ప్రశ్నలకు జవాబులు పార్టీ కాంగ్రెస్‌లోనే లభించగలవు. కాని విధానపరమైన సంక్లిష్టత త్రిపురకు ముందుకన్న ఆ తర్వాత పెరుగుతున్నదనటంలో సందేహం లేదు.

దీనిని దాటి కొంత లోతుకు వెళ్లి ఆలోచిస్తే, సిపిఎం ఎదుర్కొంటున్న సమస్య కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవటం వల్లగాని, లేదా పెట్టుకోకపోవడం వల్లగాని పరిష్కారమవుతుందా? పొత్తుపెట్టుకోవాలనుకోవటం కేవలం బిజెపికి అడ్డుకట్టవేయటం కోసం. అందుకోసం కాంగ్రెస్‌తో పొత్తు అవసరమన్న వైఖరిని సిపిఐ ఇప్పటికే సూత్రప్రాయంగా తీసుకుంది. ఆ ప్రశ్నపై సిపిఐ–సిపిఎంల మధ్య విభజన రేఖ ఏర్పడి పోయింది. బిజెపికి అడ్డుకట్ట అవసరమన్నంతవరకు ప్రకాశ్ వర్గానికి భిన్నాభిప్రాయం లేదు. కాని అందుకోసం కాంగ్రెస్‌తో పొత్తు పొరపాటని, ఆ రెండు ''బూర్జువా'' పార్టీల మధ్య తేడా లేదని, కనుక వామపక్షాలు స్వయంగా ఆ స్థాయికి ఎదగాలన్నది ఆయన వాదన. అదే ప్రకారం తెలంగాణలోనూ సిపిఐ నాయకత్వం కాంగ్రెస్‌తో పొత్తుకు సిద్ధమవుతుండగా సిపిఎం ససేమిరా అంటున్నది. చివరకు తేలేది సిపిఎం హైదరాబాద్ కాంగ్రెస్‌లో.

సిపిఎంలోగాని, మొత్తం లెఫ్ట్‌ఫ్రంట్‌లోగాని వరుస వైఫల్యాలకు మూలం బిజెపి విజృంభణలోనో, కాంగ్రెస్‌తో పొత్తు ప్రశ్నలోనో లేవు. అందుకు మౌలిక కారణాలు అంతర్గత బలహీనతలలో, వైఫల్యాలలో ఉన్నాయి. అవి వారు గ్రహించనివి కావు. సిపిఎం రాజకీయ తీర్మానాలు స్వయంగా ఒక మేరకైనా వాటిని పేర్కొన్నాయి కూడా. కనుక, వాటిని పరిష్కరించుకోవటంలోనే వారి కి భవిష్యత్తు ఉంటుంది. పొత్తులు ఉండటం ఉండకపోవటం, బిజెపి బలపడటం దెబ్బతినటం వంటివి తాత్కాలికమైన మధ్యంతర విషయాలు. అసలు సమస్య ఏమంటే సిపిఎంకు ఈ రోజున వివిధ అంశాలపై, సవాళ్లపై స్పష్టతలు, లోపాలను నిజాయితీతో గుర్తించి ధైర్యంగా ఒప్పుకుని దార్శనికతతో ముందుకు పోగల నాయకత్వాలు లేవు. వెనుకటి తరం వలె క్షేత్రస్థాయిలో పునాదులు, ఆ స్థాయిలో కార్యాచరణ అనుభవాలు లేవు. వాస్తవిక అంచనాల కన్న వైయక్తిక ధోరణులు ఎక్కువ. పలువురిపై ఏదో ఒక స్థాయిలో ''బూర్జువా'' ధోరణులు, ప్రలోభాల ప్రభావాలు ఉన్నాయి. తమ కష్టతరమైన జీవితాల మూలంగా, చెదరని ఆశలతో, అమాయకంగా నమ్మి, ప్రశ్నలు రేకెత్తించకుండా, త్యాగాలు చేస్తున్న సామాన్య కార్యకర్తలు పలువురు వెంటలేకపోయినట్లయితే, ఇటువంటి నాయకత్వాల కారణంగా ఈ పార్టీలు ఎన్నడో అంతర్ధానమయేవి. ఈ సిసలైన మౌలిక సంక్లిష్టతను మాత్రం హైదరాబాద్‌లో చర్చించ బోవటం లేదు.

ఎడిటర్‌కు లేఖలు

కాలుష్య నియంత్రణలో స్థానిక సంస్థల పాత్ర కీలకం

మనదేశంలో వివిధ రకాల ఘన, ద్రవ వ్యర్థాలు చాప కింద నీరులా అంతకంతకూ విస్తరిస్తూ యావత్ జాతి ఆరోగ్యాన్ని కబళిస్తున్నాయి. నీరు, గాలి, భూమి కాలుష్యం బారినపడి మానవాళి మనుగడ ప్రమాదంలో పడుతుంది. చెత్తను సశాస్త్రీయంగా నిర్మూలించగల విధానాల్లో భారత్ ఎంతో వెనుకబడి ఉంది. పోగుబడిన చెత్తను నగర శివార్లలో పారబోసి తగులబెట్టి చేతులు దులుపుకుంటున్నారు. ఆ వ్యర్థాల నుంచి వెలువడే పొగ, దుర్గంధం పరిసరాల్లో కాలుష్య, పారిశుద్ధ్య సమస్యలకు దారితీస్తోంది. పారిశ్రామిక రసాయన వ్యర్థాల వల్ల అనేక చోట్ల భూగర్భ జలాలూ కలుషితమవుతున్నాయి. ఈ విపత్తును ఎదుర్కొవాలంటే దేశంలోని ప్రతి పౌరుడు పరిశుభ్రతను ఓ బాధ్యతగా గుర్తించాలి.

ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన స్వచ్ఛభారత్ వెనుక గల అసలు పరమార్థమిదే. స్వచ్ఛభారత్ ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రతి వ్యక్తి దాన్ని ఓ పవిత్ర బాధ్యతగా భావించి, ఆ మేరకు జీవనశైలిని మార్చుకోవలసిన సమయం ఆసన్నమైంది. ప్రధాని మోదీ ఇచ్చిన స్వచ్ఛభారత్ పిలుపు దేశంలో బహిరంగ మలమూత్ర విసర్జన విషయంలో మెరుగైన ఫలితాలు రాబట్టింది. ఇప్పుడు వ్యర్థాల నియంత్రణను ప్రాధాన్యాంశంగా చేపట్టి స్వచ్ఛభారత్ కార్యక్రమాలను ప్రభుత్వాలు వ్యూహాత్మకంగా తీర్చిదిద్దాలి. వాస్తవానికి ఏయే వ్యర్థాన్ని ఎలా నిర్మూలించాలన్న విషయంలో ప్రభుత్వాలు ప్రజలకు స్పష్టత ఇవ్వలేకపోతున్నాయి. ఈ విషయంలో పాలకులు చేయవలసింది ఎంతో ఉందని చెప్పవచ్చు. వ్యర్థాల నిర్మూలనలో స్వీడన్ స్ఫూర్తిదాయకంగా పనిచేస్తోంది. అక్కడ 99శాతం వ్యర్థాలు విద్యుత్ తయారీకి ఇంధనంగా మారుతున్నాయి. ఒక శాతం వ్యర్థాలుమాత్రమే చెత్తకుంటను చేరుతున్నాయి. వ్యర్థాల్లో అనేక రకాలుంటాయి. ప్లాస్టిక్, కాగితం, అట్టముక్కలు, చెక్క, లోహాలు, గ్లాస్ ముక్కలు, ఔషధాలు, వైద్య పరికరాలు, విద్యుత్, ఎలక్ట్రానిక్ వస్తువులు వాటిలో కొన్ని. ఆహార పదార్థాలు, రసాయనాలు వంటి తడి చెత్త మరో రకం. పాలనాపరమైన విధానాలు, చట్టబద్ధ కట్టుబాట్లు స్వీడన్ ప్రజలను పరిశుభ్రత వైపు మళ్ళించేలా చేశాయి. స్వీడన్ ప్రభుత్వం తమ స్థానిక సంస్థలకు విశేష అధికారాలు కట్టబెట్టింది. వ్యర్థాల నియంత్రణ అన్నది పూర్తిగా పురపాలక సంఘాల వ్యవహారం. చెత్త నుండి స్థానిక సంస్థలు ఇంధనం తయారు చేస్తుంటే, పౌరులు దాన్ని ఆదాయ మార్గంగా మలచుకున్నారు. వస్తువులను వాడేసి పడేసే పద్ధతి ఆ దేశంలో ఉండదు. ఉత్పత్తులు నాణ్యతతో, దీర్ఘకాలం పనిచేసేలా తయారు చేయాలన్న నిబంధనలను స్వీడన్ నిష్టగా అమలుపరుస్తోంది. అవసరమైతే అవి మరమ్మత్తు చేసుకొని వాడేలా ఉంటాయి. ప్రతి నివాస ప్రాంతానికి మైలు దూరంలో వ్యర్థాల సేకరణ కేంద్రాలు ఉంటాయి. వీటిని ప్రైవేటు సంస్థలు నిర్వహిస్తాయి. నిర్ణీత కాలావధుల్లో స్వీడన్ ప్రజలు విభాగాల వారీగా వ్యర్థాలను సేకరించి సంస్థలకు అప్పగిస్తారు. అందుకు ప్రజలు కొంత రుసుము చెల్లించాల్సి ఉంటుంది. బహిరంగ ప్రదేశాల్లో ప్రజలే వ్యర్థాలను స్వచ్ఛందగా చెత్తకుండీల్లో పడేస్తుంటారు. వ్యర్థం పడేసినప్పుడు సంగీతం వినిపించే కుండీలు పిల్లలను, పెద్దలని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. గ్రామ స్వరాజ్యం కోసం జాతిపిత కలలుగన్నారు. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతంలో ఆయన కలలు అక్షరాలా కల్లలయ్యాయి. స్థానిక సంస్థలు అంతకంతకూ బలహీనపడ్డాయి. స్థానిక సంస్థలకు కఠిన నిర్ణయాలు కట్టబెట్టినప్పుడే కాలుష్య నియంత్రణను ఆపడం సాధ్యమవుతుంది.

– శ్రీనివాస్ చిరిపోతుల

ఆడబిడ్డకు రక్షణ ఎక్కడ?

రానురాను ఆడబిడ్డలకు కన్నతల్లి ఒడిలో ఉన్న స్వచ్ఛరక్షణ ఈ ప్రపంచంలో మరెక్కడా కనిపించడం లేదు. మూడేళ్ల బాలిక నుండి పండు ముసలివరకూ ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించడం కష్టంగా మారుతోంది. ఇటీవల వరుసగా జరుగుతున్న సంఘటనలను చూస్తుంటే గడపదాటి కాలు బయటపెట్టిన ఆడబిడ్డ క్షేమంగా ఇంటికి వస్తుందనే నమ్మకం సన్నగిల్లిపోతుంది. ప్రపంచం చిన్నదైపోతుంది.

అభివృద్ధి సాంకేతిక ఫలాలు విశ్వవ్యాప్తమవుతున్నాయి. వాటిల్లో ఆడబిడ్డల పాత్ర చిన్నదేం కాదు. అదే సమయంలో అభివృద్ధి ఫలాలు తమ చేతుల్లోకి రావాలనే కొద్దిమంది పెట్టుబడిదారులు దుర్బుద్ధితో రూపొందిస్తున్న ప్రకటనలు, వ్యాఖ్యానాలు, ప్రచారాలు ఆడబిడ్డలకు రక్షణ లేకుండా చేస్తున్నాయి. ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ సమాజంలో టెక్నాలజీ ఉపయోగం కన్నా దుర్వినియోగం ఎక్కువగా ఉంటోంది. ఆ ప్రభావం ముఖ్యంగా యువతపై ఎక్కువగా ఉంటోంది. సద్వినియోగం చేసుకోవాల్సింది పోయి జీవితాలు నాశనం చేసుకునే పరిస్థితికి దారితీస్తోంది.

ముఖ్యంగా ఫేస్‌బుక్, వాట్సాప్, మెయిల్ చాటింగ్స్ వంటివి భవిష్యత్తుకు మార్గం లేకుండా అణచివేస్తున్నాయి. ఇక వివాహితుల విషయానికొస్తే ఒకడు వరకట్నం కావాలంటాడు. మరొకడు తాగొచ్చి రోజూ కొడతాడు. మరొకడు విడాకులకు సైతం సిద్ధమైపోతాడు. యువకులకు తల్లిదండ్రులు మహిళపట్ల ఎలా ప్రవర్తించాలో, సమాజంలో మహిళ స్థానం గురించి చిన్ననాటినుంచి పాఠశాలల్లో నేర్పించాలి. రాష్ట్రంలో 'షి' టీమ్‌లు ఏర్పాటుతో కొంత మార్పు జరుగుతుంది. 'షి' టీంల్లో మహిళా ఉద్యోగులే ఉంటే బాగుంటుంది. ఎక్కువశాతం మహిళలనే రిక్రూట్ చేసుకోవాలి.

– గుండమల్ల సతీష్‌కుమార్



అవనిలో మహోన్నతమైన జన్మ ఆడజన్మ.. అమ్మగా స్వర్గం ఆమె పాదాక్రాంతం... అలిగా ఆమె సేవలు త్యాగాలు అనిర్వచనీయం. అందుకే ఇంటికి దీపం ఇల్లాలు అన్నారు. ఆడ బిడ్డలు ఇంటికే కాదు అవనికే వెలుగులు అన్నారు. బేటీ రోటీ అని ఊరకే అనలేదు. మొదటి సంతానం ఆడబిడ్డ పుడితే ఇక ఆ ఇంట్లో శుభాల వర్షం కురిసినట్లే. అందుకే అల్లాహ్ ఖుర్‌ఆన్ గ్రంథంలో మహిళలకోసం ప్రత్యేక అధ్యాయమే కేటాయించాడు.

తల్లిగా.. భార్యగా.. కుమార్తెగా..

ఆమె పాత్ర అమోఘం

పవిత్ర ఖుర్‌ఆన్ ప్రతిని తెరచి చూస్తే నాలుగో అధ్యాయం 'నిసా' అని మనకు కనబడుతుంది. 'నిసా' అంటే మహిళ అని అర్థం. ఈ అధ్యాయంలో బోధనలన్నీ మహిళలకే ప్రత్యేకం. అనాథ బాలికల హక్కులు, పెళ్లి కాని యువతుల హక్కులు, పెళ్లి విషయంలో అమ్మాయిల అంగీకారం, పెళ్లయిన పిదప ఇల్లాలిగా ఆమెకు సంక్రమించే హక్కులు, తల్లిదండ్రుల ఆస్తిలో వాటా ఇలా మహిళలకు ఎన్నో హక్కులు కల్పించింది ఇస్లామ్. ముహమ్మద్ ప్రవక్త (స) మహిళలను గౌరవించాలని, వాళ్లను ఆదరించాలని తాకీదు చేశారు. కనిపెంచిన అమ్మను ఎలా గౌరవించాలి, కన్న కూతుర్ని ఎలా ఆదరించాలి, కట్టుకున్న భార్యను ఎంత ప్రేమగా చూసుకోవాలో ఆచరణాత్మకంగా చూపించారు. ఆయన పవిత్ర జీవితంలోని కొన్ని మచ్చుతునకలు మహిళా దినోత్సవం సందర్భంగా...

తల్లిగా...

ఒకసారి ముహమ్మద్ ప్రవక్త (సఅసం) తన సహచరులతో ఏదో పనిలో నిమగ్నమై ఉన్నారు. అటుగా ఒక మహిళ ప్రవక్త (స) సమక్షంలో వచ్చింది. వెంటనే ప్రవక్త (స) లేచి నిలబడి తన భుజంపై ఉన్న దుప్పటిని తీసి పరిచి ఆమెను కూర్చోబెట్టారు. ఆమెతో ఎంతో గౌరవభావంతో మాట్లాడారు. ఒక సహచరుడు అక్కడున్న వారితో ఆమె ఎవరా అని అడగ్గా ప్రవక్త (స)కు పాలుపట్టిన తల్లి అని మరో సహచరుడు చెప్పారు. ప్రవక్త (స) మాతృమూర్తి బాల్యంలోనే కన్నుమూశారు. ఆమెను దాయీ హలీమా అనే మహిళ పాలుపట్టి పెద్దచేశారు. పాలుపట్టిన తల్లిని చూడగాలే లేచి నిలబడటం, ఆమెకు తన భుజంపై దుప్పటిని తీసి పర్చి కూర్చోబెట్టడం ఎంతో ఆదర్శనీయం.

ఒకసారి ప్రవక్త (స) సమక్షంలోకి ఆయన అనుచరుడు వచ్చి "ప్రవక్తా వృద్ధాప్య భారంతో నడవలేక మంచానికే పరిమితమైన మా అమ్మను నా భుజాలపై కూర్చోబెట్టుకుని హజ్ యాత్ర చేశాను. మా అమ్మ రుణాన్ని తీర్చుకున్నట్లేనా" అని అడిగాడు. దానికి ప్రవక్త "మీ అమ్మ నిన్ను ప్రసవిస్తున్నప్పుడు బాధ భరించలేక పెట్టిన ఒక్క కేక రుణం కూడా తీరలేదు" అని చెప్పి పంపారు.

పై రెండు సంఘటనలు తల్లి స్థానం ఎంత గొప్పదో బోధపడుతుంది. పురిటి నొప్పులు భరించి, రక్తాన్ని పాలగా మార్చి మన ఆకలి తీర్చి తన ఒడిలో జీవిత పాఠాలు నేర్పిన తల్లిని ఎంతగా గౌరవించాలో, ఇంకెంతగా ఆదరించాలో పైరెండు సంఘటనలు చెప్పకనే చెబుతున్నాయి. అందుకే ప్రవక్త (స) తల్లి పాదాల క్రింద స్వర్గముందని చెప్పారు. ఎవరైనా స్వర్గాన్ని కోరుకునే వారు వృద్ధాప్యంలో ఉన్న తల్లి సేవ చేయాలని చెప్పారు.

కుమార్తెగా...

ఒకసారి ముహమ్మద్ ప్రవక్త (స) సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) దగ్గరికి ఒక మహిళ తన ఇద్దరు ఆడపిల్లలను వెంట పెట్టుకొని వచ్చింది. ఎన్నో రోజులుగా పస్తులున్నామని తన ఆకలి బాధను తెలియజేసిందా మహిళ. అప్పుడు ఆయిషా (రజి) ఇంట్లో తినడానికి ఏమీ లేవు ఒకే ఒక్క ఖర్జూరం పండు తప్ప. ఆ ఖర్జూరాన్ని ఆయిషా (రజి) ఆమెకు అందించారు. ఆ మహిళ ఆ ఖర్జూరాన్ని అందుకొని రెండు సమాన భాగాలు చేసి తన ఇద్దరు కూతుళ్లకు పంచి తాను మాత్రం పస్తులుండిపోయింది. ఈ వృత్తాంతాన్ని ఆయిషా (రజి) ఆమె భర్త ముహమ్మద్ (స) ఇంటికి రాగానే వినిపించారు. అప్పుడు ప్రవక్త (స) ఆ మహిళ త్యాగాన్ని ఎంతగానో ప్రశంసించారు. "తాను పస్తులుండి తన ఆడ పిల్లల ఆకలి తీర్చిన ఆ మహిళకు ఆ ఆడ పిల్లలే నరకానికి అడ్డుగోడలవుతారు. స్వర్గానికి బాటలవుతార'ని ప్రవక్త చెప్పారు. ఇద్దరు లేక ముగ్గురు ఆడపిల్లలను పెంచి పోషించి వారికి సరైన విద్యాబుద్ధులు నేర్పించి మంచి వరుడికిచ్చి పెళ్లి జరిపిస్తే అలాంటి తల్లిదండ్రులు స్వర్గానికి వారసులవుతారని ప్రవక్త చెప్పారు. ఆడపిల్లల పట్ల వివక్ష చూపేవారికి, ఆడపిల్లల్ని గుండెలమీద కుంపటిగా భావించే వారికి, ఆడపిల్లల్ని కడుపులోనే చిదిమేసే వారికి ఈ సంఘటనలు కనువిప్పు. ప్రవక్త (స) తన నలుగురు కుమార్తెలను ఎంతో ప్రేమాదరణలతో పెంచి పెద్ద చేశారు. బయటి నుంచి ఇంటికి రాగానే తమ ఆడబిడ్డల చేతులను ముద్దాడేవారు. ఇంట్లో మగపిల్లలు, ఆడపిల్లలు కనుగ ఉంటే ఇద్దరినీ సరిసమానంగా పెంచమన్నారు. ఎలాంటి వివక్ష చూపొదన్నారు. ఏదైనా వస్తువు, కానుక ఇంటికి తీసుకువస్తే ముందు ఆడపిల్లలకే ఇవ్వాలన్నారు.

పై సంఘటనలన్నీ తల్లిగా, భార్యగా, కుమార్తెగా మహిళల ఔన్నత్యం గురించి చెప్పకనే చెబుతున్నాయి. మహిళలలతో ప్రవక్త (స) వ్యవహార శైలి మనందరికీ అనుసరణీయం.



ముహమ్మద్ ముజాహిద్
96406 22076



భార్యగా..

పెళ్లీడొచ్చిన అమ్మాయిల వివాహం వాళ్ల అనుమతితోనే చేయాలన్నది ఇస్లామ్ సిద్ధాంతం. అమ్మాయి ఇష్టంతోనే పెళ్లి జరపాలన్నారు ప్రవక్త (స). వాళ్ల అంగీకారం లేకుండా చేసిన పెళ్లి చెల్లదు. అలాంటి వివాహం రద్దు అవుతుంది. వధువుకు మెహర్ ధనం చెల్లించి వివాహమాడాలి. ఆ డబ్బుకు ఆమె వారసురాలు. పెళ్లయిన తరువాత భార్యపట్ల ప్రేమవాత్సల్యంతో మెలగాలని ఖుర్‌ఆన్ సూచిస్తుంది. పురుషులు తాను తిన్నదే తన భార్యకు తినిపించాలి. ప్రవక్త (స) తన సతీమణుల పట్ల ఎంతో ప్రేమతో మెలిగేవారు. ప్రవక్త (స) సతీమణి సఫియా ఆయన వీపుపై కాలుమోపి ఒంటె ఎక్కేవారు. ప్రవక్త (స) తన భార్యకు ఎంత ప్రాధాన్యతనిచ్చేవారో ఈ సంఘటన ద్వారా అర్థం చేసుకోవచ్చు. భార్యలో కనిపించే లోపాలు భూతద్దంలో చూసి ఆమెను కించపర్చరాదని ఖుర్‌ఆన్ హెచ్చరిక. "వారితో సద్భావంతో జీవితం గడపండి. ఒకవేళ మీకు వారు నచ్చకపోతే, బహుశా మీకు ఒక వస్తువు నచ్చకపోవచ్చు. కాని అందులోనే అల్లాహ్ ఎంతో మేలును పెట్టివుండవచ్చు." (ఖుర్‌ఆన్ 4:19).


దక్షిణ కాశి కొలనుపాక

వీరశైవ మతాచార్యులు శ్రీశ్రీ రేణుకాచార్యుల జన్మస్థలంగా ఉన్న కొలనుపాక సోమేశ్వరాలయానికి వేయి సంవత్సరాల ఘనచరిత్ర ఉంది. సోమేశ్వర మహాలింగం నుంచి ఉద్భవించిన ఈ ఆచార్యులు వీరశైవమతాన్ని ప్రపంచానికి బోధించి లింగంలోనే ఐక్యం చెందాడని ప్రతీతి. కొలనుపాక శివారుప్రాంతాల్లో వివిధ సమయాల్లో జరిపిన తవ్వకాల్లో బయటపడ్డ శిలాశాసనాలు, దేవతా ప్రతిమల ఆధారంగా ఇక్కడి చరిత్ర మనకు తెలుస్తోంది. దక్షిణ కాశిగా పిలువబడే ఈ గ్రామంలో కాశీలో ఉన్నట్లుగా 18 సామాజిక వర్గాలకు మఠాలు ఉన్నాయి. అలాగే చండీశ్వరీఆలయం, కోటిలింగేశ్వరాలయం, భైరవస్వామి ఆలయం, రుద్రమహేశ్వరాలయం, ఏకాదశరుద్రాలయం, మల్లికార్జున స్వామి ఆలయం, క్షేత్రపాలకుడు వీరభద్రస్వామి ఆలయాలు ఉన్నాయి. వీరశైవ మతగురువైన రేణుకాచార్యులు చండికాంబ సహిత సోమేశ్వరాలయంలోని స్వయంభూ లింగం నుంచి ఉద్భవించి చివరకు అదే లింగంలో ఐక్యం అయినట్లు వీరశైవ కవి షడక్షరుడు రాసిన రాజశేఖర విలాసంలో ఉంది. వీరశైవ మతోద్ధరణ కోసం రేణుకాచార్యులు ఎంతోకృషి చేశారని తెలుస్తోంది. ఈ శైవపీఠానికి సంబంధించిన వివరాల ప్రకారం తానుకేశుడనే శైవాచార్యునికి రుద్రమునీశ్వరుడనే కుమారుడున్నాడు. తానుకేశుని అనంతరం రుద్రమునీశ్వరుని లింగాయతు మతానికి అధిపతిని చేశాడు. ఆయన కొలనుపాక కేంద్రంగా వీరశైవ మతాన్ని స్థాపించి ప్రచారం చేశాడని తెలుస్తోంది. ఘనమైన చరిత్ర కొలనుపాక చండికాంబ సహిత సోమేశ్వరాలయానికి ఘనమైనచరిత్ర ఉంది. 10, 11వ శతాబ్దానికి చెందిన పశ్చిమ చాళుక్యుల కాలం నాటిది. నాటినుంచి నేటివరకు సోమేశ్వరుడు, చండికాంబ దేవతలు నిత్య పూజలు అందుకుంటున్నారు. చాళుక్యుల కాలంలో కొలనుపాక గ్రామం రాజప్రతినిధి స్థానంగా ఉండేదని సమాచారం. సైనికపరంగా దక్షిణాపథంలో కొలనుపాక ముఖ్యకేంద్రంగా ఉండేదట. రాజులు, రాజప్రతినిధులు వివిధస్థాయుల్లో ఆలయ నిర్మాణానికి పెద్దఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి చేసినట్లు పరిసర ప్రాంతాల్లో దొరికిన శాసనాల్లో నిక్షిప్తమై ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలో ఉన్న ఈ దేవాలయానికి దేశ, విదేశాల నుంచి భక్తులు రోజు వచ్చి పోతుంటారు. మధ్య యుగానికి ముందు నుంచే ఇక్కడ ఉన్న ఈ ఆలయం ఎంతో విశిష్టమైనదిగా ఉంది. లింగాకారంలో స్వామి దర్శనం ఇక్కడ స్వామి వారు లింగాకారంలో భక్తులకు దర్శనమిస్తారు. ఈ లింగం నుంచే జగత్‌గురువు రేణుకాచార్యులు ఉద్భవించి వీరశైవ మతాన్ని, సిద్ధాంతాలను విశ్వవ్యాపితం చేశారు. ఈ ఆలయంలో ఉన్న సహస్ర లింగేశ్వరుని కాకతీయ రాజు గణపతిదేవ చక్రవర్తి సోదరి మైలాంబ ప్రతిష్టించినట్లు ప్రతీతి. ప్రధానాలయంలోనే చండికాంబ అమ్మవారు ఉంటారు. కోరిన కోర్కెలు తీర్చమని అమ్మవారికి భక్తులు ముడుపులు కడతారు. కోర్కెలు తీరిన తర్వాత అమ్మవారికి ఒడిబియ్యం పోయడం ఇక్కడ ప్రత్యేకత. పక్కనే కోటొక్క లింగం అత్యంత రమణీయంగా భక్తులకు కనువిందు చేస్తుంది. దేవదేవుని ప్రతిరూపమైన లింగాకారానికి ఖర్జురపు పండ్ల ఆకారంలో చెక్కబడిన చిన్నచిన్న లింగాలన్నిటినీ కలుపుకుంటే కోటొక్కటి ఉంటాయని చెబుతారు. ఈ కోటొక్కలింగాన్ని దర్శిస్తే పునర్జన్మ ఉండదని భక్తుల విశ్వాసం. చరిత్రను తెలిపే మ్యూజియం ఆలయం ముందు పురావస్తు శాఖ ఏర్పాటు చేసిన మ్యూజియం ఉంది. ఈ మ్యూజియం ఈ కొలనుపాక ఆలయం, గ్రామ చరిత్రకు సంబంధించిన పలు విశిష్టతలను తెలియజేస్తోంది. కళ్యాణ చాళుక్యులు, కాకతీయ రాజుల ఏలుబడిలో గొప్ప శైవక్షేత్రంగా కొలనుపాక వెలుగొందిన విషయాలను విపులంగా వివరిస్తోంది. వీరశైవ, జైన, వైష్ణవ మతాలకు సంబంధించిన మహోన్నత చరిత్రను మనకు అందిస్తోంది. కొలనుపాక సోమేశ్వరాలయానికి తెలంగాణతో పాటు ప్రతి నిత్యం కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి లింగాయత్‌లు వస్తారు. తమ ఆరాధ్యదైవం సోమేశ్వరునితోపాటు జగద్గురువు రేణుకాచార్యులను దర్శనం చేసుకుని వెళ్తారు. శివరాత్రి పర్వదినం రోజు వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. దేశ విదేశాల పర్యాటకులు వచ్చిపోతుంటారు. ఎలా రావాలంటే.. హైదరాబాద్ వరంగల్ జాతీయ రహదారి పై సరిగ్గా 70 కిలో మీటర్ల వద్ద ఆలేరు ఉంటుంది. ఇక్కడి ఆర్టీసీ బస్‌లు, రైళ్లు ఉంటాయి. భక్తులు ఆలేరులో దిగిన తర్వాత ఆటోలు, ఆర్టీసీ బస్‌లలో ఐదుకిలోమీటర్ల దూరంలో ఉన్న కొలనుపాకకు వెళ్లవచ్చు. ఆలేరు చేర్యాల మార్గంలో కొలనుపాక ఉంది.హైదరాబాద్‌కు 75 కిలోమీటర్ల దూరంలో ఉంది కొలనుపాక. యాదాద్రి దివ్యక్షేత్రం నుంచి 20 కిలోమీటర్ల దూరం!




పర్షియా చక్రవర్తి అర్థశహస్తకు పానదాయకుడు (బట్లర్) గా వున్న ఒక చిరుద్యోగి నెహెమ్యా. పర్షియా లో ఒక బానిసగా పుట్టినా, నెహెమ్యాది యూదు మతం, హృదయం కూడా. శత్రువులు పడదోసిన యెరూషలేము పట్టణ ప్రాకారాలు వందేళ్లుగా పాడుదిబ్బగానే ఉన్నాయన్న వార్త విని అతడు కృంగిపోయాడు. ఆ విషయం దాదాపుగా 120 రోజులపాటు ప్రార్ధన చేయగా, దేవుడతణ్ణి చక్రవర్తి కరుణించేలా చేశాడు.ఫలితంగా యెరూషలేము ప్రాకారాల పునర్నిర్మాణానికి అనుమతి మాత్రమే కాక, ద్రవ్యాన్ని కూడా చక్రవర్తి ఇచ్చి పంపాడు. తనవైపు దేవుడూ, చక్రవర్తి కూడా ఉన్నారన్న మనోబలంతో నెహెమ్యా తన శక్తికి మించిన ఎంతో ఎత్తైన పర్వతాల్లాంటి సమస్యలను అవలీలగా అధిగమించి, తాను గెలవలేని శత్రువులను చాకచక్యంతో మట్టి కరిపించి వందేళ్ల శిథిల ప్రాకారాలను కేవలం 52 రోజుల్లో పునరుద్ధరించాడు. మన గొప్పతనాన్ని మనం చేసే పనులు చాటాలి, మన మాటలు కాదు. మౌనానికి, ప్రార్ధనకున్న శక్తి నెహెమ్యా జీవితం, పరిచర్య లో చూడవచ్చు.

తెలివుంటే సరిపోదు తెగింపు కావాలి



అసాధ్యాలను సుసాధ్యమెలా చేసుకోవాలో నెహెమ్యా వద్దే నేర్చుకోవాలి, అతనొక చిరుద్యోగి, నిర్మాణరంగంలో ఏమాత్రం అనుభవంలేని వాడు, అయినా మహామహులైన యూదు నాయకులెవరూ చేయలేని పనిని ఎలా సాధించాడు? ముందు ప్రార్ధించి దేవుని కటాక్షం పొందాడు,అప్పుడు దేవుడతనికి చక్రవర్తి అనుగ్రహాన్నిప్పించాడు. ముఖ్యంగా శిథిల ప్రాకారాలు దేవునికి అవమానకరమని అతను దృఢంగా సంకల్పించాడు. గొప్పవాళ్లను కాదు. దేవునికోసం గొప్పకార్యాలు చేయాలన్న దృఢసంకల్పం ఉన్నవారినే దేవుడు వాడుకుంటాడు. ఎంత జ్ఞానమున్నా, యుక్తిపరులైనా దేవుణ్ణి, ఆయన పనిని ప్రేమించని వాళ్ళు ఈ లోకంలో అనామకులే, అశక్తులే. నెహెమ్యా చిన్నవాడే, కానీ తాను మహోన్నతుడైన దేవుని చేతిలో పనిముట్టునని, తనను వాడుకొని దేవుడే గొప్పకార్యాలు తనతో చేయిస్తాడని నమ్మిన వినయశీలి, సాత్వికుడు. పనులు చేతకాని వాడికి అసూయ ఎక్కువ, ప్రగల్భాలెక్కువ. అక్కడే యెరూషలేములోనే ఉన్న సన్బల్లటు, టోబియాలనే ఇద్దరు యూదు ప్రముఖులు ఆ కోవకు చెందిన వారే. అక్కడే యెరూషలేములో ఉన్నా ఆ శిథిల ప్రాకారాలను కట్టాలన్న ఆలోచన వారికి రాలేదు. అవికట్టడానికి పూనుకున్న నెహెమ్యా మీద మాత్రం బోలెడు ద్వేషం పెంచుకున్నారు. చేతకానితనం, అసూయతో నెహెమ్యాను అనరాని మాటలన్నారు, దుమ్మెత్తి పోశారు. కాని వారిని పనికిమాలినవారిగా ఎంచి లెక్కచేయక, మౌనంగా ముందుకు సాగి, నెహెమ్యా నిలబెట్టిన మహా ప్రాకారాలే వారి విమర్శలకు జవాబయ్యింది, వారి నోళ్లకు తాళం వేశాయి. విమర్శకు ప్రతివిమర్శ మామూలు పద్ధతి. తిట్టేవాడిని పట్టించుకోకుండా దేవుని పనిచేస్తూ ముందుకు సాగిపోవడం గొప్పవాడి పని. చేతకానివాడికి మాటలెక్కువ, కానీ పనిచేసేవాడికి మాట్లాడే తీరిక ఉండదు. పరుగెత్తే గుర్రానికి కాలుదువ్వే అవకాశముండదు కదా. దేవుని పనులు చేసేందుకు తెలివుంటే సరిపోదు, తెగింపు కావాలి. బైబిల్ జ్ఞానం కాదు, దేవుని భయముండాలి.పెత్తనం చెయ్యడం కాదు, ప్రజలతో కలిసిపోవాలి. నాయకులమన్న ధీమా కాదు, మెట్లు దిగివెళ్ళే దీనత్వముండాలి.



రెవ.టి.ఎ. ప్రభుకిరణ్
98488 21472



వ్రతాలలో సత్యనారాయణస్వామి వ్రతానికి ఎంతో విశిష్టత వుంది. అనేక కష్టాల నుంచి ... నష్టాల నుంచి ... బాధల నుంచి బయటపడేసే శక్తి ఈ వ్రతానికి వుంది. ఒక్క మాటలో చెప్పాలంటే, జీవితమనే సముద్రంలో కష్టాల సుడిగుండంలో చిక్కుకున్న వాళ్లని క్షేమంగా తీరానికి చేర్చే నావలా సత్యనారాయణస్వామి వ్రత ఫలితం పనిచేస్తుంది. సాధారణంగా ఈ వ్రతాన్ని కార్తీకమాసంలో ఎక్కువగా జరుపుకుంటూ వుంటారు. ఇక తొలిసారిగా కొత్తకోడలు తమ ఇంట్లో అడుగుపెట్టిన సందర్భంగా, అత్తగారింటి వాళ్లు నూతన దంపతులతో సత్యనారాయణస్వామి వ్రతం చేయించడం ఆచారంగా వస్తోంది. ఎక్కడో కొంతమంది తప్ప చాలామంది ఈ ఆచారాన్ని పాటిస్తూ వుంటారు. సత్యనారాయణ వ్రతం చేసుకోకపోతే దోషంగా భావిస్తుంటారు. త్రిమూర్తుల ఏకరూపంగా సత్యనారాయణస్వామి ఈ భూమిపై ఆవిర్భవించాడని పురాణాలు చెబుతున్నాయి. ఇక ఈ వ్రతానికి తమ గ్రామస్తులను ఎక్కువగా పిలుస్తూ వుంటారు. తమ గ్రామానికి కొత్తగా వచ్చిన కోడలు

కొత్తకోడలు రాగానే సత్యనారాయణవ్రతం

పిల్లను చూడాలని అక్కడి స్త్రీలు ఆతృత పడుతుంటారు. సత్యనారాయణస్వామి వ్రతానికి వచ్చిన వాళ్లు ఆ కోడలు పిల్లను చూడటం జరుగుతుంది. ఈ కారణంగా వాళ్లందరితో ఆ కోడలికి పరిచయం ఏర్పడటం వలన, ఆ తరువాత చాలాతొందరగా వాళ్లతో కలిసిపోతుంది. తనకి ఆ ఊరు కొత్త అనే విషయాన్ని కొద్ది రోజుల్లోనే మరిచిపోతుంది. అసాధారణమైన శక్తిని కలిగిన ఈ స్వామి మహిమాన్వితుడని భక్తులు భావిస్తుంటారు. ఈ స్వామిని పూజించడం వలన త్రిమూర్తులను ప్రత్యక్షంగా సేవించిన ఫలితం దక్కుతుందని విశ్వసిస్తుంటారు. పెళ్లితో ఒక్కటైన నూతన దంపతులు కొత్త జీవితాన్ని ఆరంభిస్తారు. వాళ్ల జీవన ప్రయాణం ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సుఖసంతోషాలతో సాగేలా ఆశీస్సులు అందజేయమని, త్రిమూర్తి స్వరూపుడైన సత్యనారాయణ స్వామిని వేడుకుంటూ ఈ వ్రతాన్నిచేయిస్తూ వుంటారు. ఇలా ఒక పవిత్రమైన పూజా సమయంలో తమ కోడలను ఇతరులకు పరిచయం చేయడాన్నిఅత్తింటి వాళ్లు శుభసూచకంగా భావిస్తుంటారు. కొత్తగా కోడలు పిల్ల తమ ఇంటికి వచ్చిన సందర్భంగా, సత్యనారాయణస్వామి వ్రతాన్ని చేయడం ... దానికి గ్రామస్తులను పిలవడం అనే ఆచారం వెనుకగల అర్థ ఇదే!

కొత్తబట్టలకు సూక్ష్మక్రిములు

పవిత్రమైన కార్యక్రమాల్లో పసుపు ప్రధాన పాత్రను పోషిస్తూ వస్తోంది. పసుపును అంతా మంగళకరమైనదిగా భావిస్తుంటారు. అంతే కాకుండా పసుపు క్రిమిసంహారిణిగా సమర్థవంతంగా పనిచేస్తుంది. వివిధ దశలలో ఎన్నో రూపాంతరాలు చెందిన తరువాత గాని ఒక వస్త్రం బయటికి రాదు. పట్టు ... నూలు ... ఉన్ని వస్త్రాల తయారీ సమయాల్లో కొన్ని రకాల సూక్ష్మ క్రిములు వస్త్రంలో కలిసిపోతుంటాయి. ఫలితంగా అవి ధరించిన వారు అనారోగ్యానికి గురవుతూ వుంటారు. ఇక ఇటు అమ్మకపు దారులు ... అటు కొనుగోలు దారుల మధ్య చేతులు మారడం వలన కూడా కొత్తబట్టలకు సూక్ష్మ క్రిములు ఉంటూ వుంటాయి. అలాంటి సూక్ష్మ క్రిముల బారిన పడకుండా వుండటం కోసం నూతన వస్త్రాలకు పసుపు రాస్తూ వుంటారు. ఇక పసుపు లక్ష్మీదేవి నివాస స్థానంగా చెప్పబడుతున్న కారణంగా, అశుభకార్యాల్లో పెట్టే వస్త్రాలకు మాత్రం పసుపు రాయరు.



ధర్నాలు, ఆందోళనలపై ఇదేం నీతి: లక్ష్మణ్



మన తెలంగాణ/హైదరాబాద్ : కెసిఆర్ రోజుకో డ్రామా, పూటకో మాట మాట్లాడుతున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరోపించారు. ఎస్‌సి,ఎస్‌టి, బిసి రిజర్వేషన్ల అంశంలో కేంద్ర అనుమతి అవసరం లేకపోయినా రాజ్యాంగ వ్యతిరేకమైన మతపరమైన ముస్లిం రిజర్వేషన్లతో టిఆర్‌ఎస్ ప్రభుత్వం ముడిపెట్టిందని వ్యాఖ్యానించారు. తమ సమస్యలపై ప్రజలు నిరసనలు, ధర్నాలు చేసేందుకు హైదరాబాద్‌లో అవకాశం కల్పించని సిఎం కెసిఆర్, ఆయన మాత్రం ఢిల్లీలో ధర్నా చేస్తామనడం ఇదేం నీతి అని, ఇతరుల చేస్తే తప్పు, కెసిఆర్ చేస్తే ఒప్పా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రజలకు లేని నిరసన హక్కు కెసిఆర్‌కు ఎందుకని, ఆయనకు నిరసన తెలియజేసే నైతిక హక్కు కూడా లేదని లక్ష్మణ్ అన్నారు. కెసిఆర్ పెడతామన్న థర్డ్ ఫ్రంట్ ఆదిలోనే అభాసుపాలై తుస్సుమన్నదని ఎద్దేవా చేశారు. ఒక జివో ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే అమలుచేయాల్సిన ఎస్‌టి రిజర్వేషన్‌ను, అమలుకాని ముస్లిం రిజర్వేషన్లతో ముడిపెట్టడంలో ఆంతర్యమేమిటన్నారు. జానాభా ప్రాతిపదికన ఎస్‌సి, ఎస్‌టిల రిజర్వేషన్ల అమలు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, దీనిని రాష్ట్ర ప్రభుత్వమే అమలు చేయవచ్చన్నారు. మతపరమైన రిజర్వేషన్లు చెల్లవని గతంలోనే హైకోర్టు తీర్పు చెప్పిందని, ముస్లింలకు సిఎం కెసిఆర్ భ్రమలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.

15న కేంద్ర కార్మిక సంఘాల నిరసన

మన తెలంగాణ / హైదరాబాద్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 15న రాష్ట్రంలో నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కేంద్ర కార్మిక సంఘాల రాష్ట్ర కమిటీలు ప్రకటించాయి. కేంద్ర కార్మిక సంఘాల దేశవ్యాప్త నిరసన కార్యక్రమంపై ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం సమావేశం జరిగింది. కార్మిక సంఘాల నాయకులు టి.నరసింహన్, ఉజ్జిని రత్నాకర్‌రావు, ఎస్.బాల్‌రాజ్ (ఎఐటియుసి), ఆర్.ప్రకాష్‌గౌడ్ (ఐఎన్‌టియుసి), పాలడుగు భాస్కర్, పి.జయలక్ష్మి (సిఐటియు), వీరేందర్, అనురాధ (ఐఎఫ్‌టియు), శ్రీహరి (డిఫెన్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్), గణేష్ (హెచ్‌ఎంఎస్) పాల్గొన్నారు. టి.నరసింహన్ మాట్లాడుతూ 44 కార్మిక చట్టాలను 5 షెడ్యూల్లుగా కుదిస్తూ కార్మిక హక్కులను తొలగించి యాజమాన్యాలకు అనుకూల వైఖరిని అవలంబిస్తున్నదని విమర్శించారు. గత కొన్నేళ్ళుగా దేశంలోని అన్ని కార్మిక సంఘాలు ఐక్య ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వాలు కార్మిక సంఘాలతో చర్చలు జరపకపోవడం విచారకరమన్నారు.

'క్లిక్స్ ప్రోగ్రాం'కు యునెస్కో అవార్డు

మనతెలంగాణ /హైదరాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న కనెక్టెడ్ లెర్నింగ్ ఇన్షియేటివ్ (క్లిక్స్) ప్రోగ్రాంకు యునెస్కో అవార్డు లభించింది. టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులకు కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించడమే ప్రధాన ఉద్దేశంగా అమలవుతున్న 'క్లిక్స్'కు అంతర్జాతీయ గుర్తింపు లభించడం విశేషం. టాటా ట్రస్ట్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రాష్ట్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. రాష్ట్రంలో 12 జిల్లాల్లో 300 స్కూళ్లలో క్లిక్స్ ప్రోగ్రాం అమలవుతుండగా, ఇప్పటివరకు 1,589 మంది ఉపాధ్యాయులు, 10,080 మంది విద్యార్థులకు దీని ద్వారా శిక్షణ అందించారు.

జిల్లాలలో అరెస్టుల పర్వం

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ జెఎసి, సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై శుక్రవారం జరపతలపెట్టిన 'మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభ'ను భగ్నం చేసేందుకు గురువారం రాత్రి నుంచే జిల్లాలలో పోలీసులు అరెస్టుల పర్వం కొనసాగించారు. అర్ధరాత్రి వరకు సుమారు వెయ్యిమందికిపైగా జెఎసి, సిపిఐ నేతలు, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి ఆయా ఠాణాలకు తరలించినట్లు తెలిసింది. అరెస్టు అయిన వారిలో రాష్ట్ర నేతలు, జిల్లా నేతలు కూడా ఉన్నట్లు సమాచారం. ఇక హైదరాబాద్‌లోని జెఎసి చైర్మన్ కోదండరాం ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించి ఉండడంతో ఉద్రిక్తత నెలకొంది. అలాగే హిమాయత్‌నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ వద్ద కూడా పోలీసులు మోహరించి ఉన్నారు. ఇక ఇందిరాపార్క్, ట్యాంక్‌బండ్, తెలుగుతల్లి విగ్రహం, ఎన్‌టిఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డులపై పోలీసు పికెట్లు కనిపించాయి. ట్యాంక్‌బండ్‌పై ఎట్టి పరిస్థితుల్లోను మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభ జరగనీవ్వకుండా పోలీసులు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. ఇందులో భాగంగానే జిల్లాలలో అరెస్టుల పర్వం కొనసాగించారు. ఒయు, నిజాం హాస్టళ్లలో కూడా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇక హైదరాబాద్‌లోని అన్ని రైల్వే స్టేషన్‌లలో కూడా పోలీసులు నిఘాతో పాటు పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. మహాత్మా గాంధీ బస్ స్టేషన్‌లో కూడా పోలీసు తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద స్థితిలో ఉన్న వ్యక్తులను విచారించి వదిలివేశారు. ఆయా జిల్లాల నుంచి ఆర్టీసి బస్సుల్లో వస్తున్న నేతలు, కార్యకర్తలను కూడా అరెస్టు చేయాలని పోలీసు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి.

రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి

(మొదటిపేజీ తరువాయి)

బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రభుత్వాన్ని నిలదీయాలని తీర్మానించింది. ఎస్‌సి వర్గీకరణకు మద్దతుగా ఈ నెల 13న ఎంఆర్‌పిఎస్ పిలుపునిచ్చిన బంద్‌కు మద్దతు ప్రకటించింది. రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎంపిలు మహ్మద్ అజారుద్దీన్, రవీంద్రనాయక్‌లతో పాటు టిపిసిసి కోశాధికారి గూడూరు నారాయణరెడ్డి పేర్లు సమావేశంలో చర్చకు వచ్చినట్లు సమాచారం. అయితే గూడూరు వైపు మొగ్గు చూపినట్లు తెలిసింది. తమ అభ్యర్థికి మద్దతునివ్వాల్సిందిగా బిజెపి, టిడిపి, సిపిఐ(ఎం), ఎంఐఎం పార్టీలను కూడా కోరాలని సిఎల్‌పి నిర్ణయించింది. శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కాంగ్రెస్ శాసనసభా పక్షం శుక్రవారం సమావేశమైంది. సిఎల్‌పి నాయకులు కుందూరు జానారెడ్డి, షబ్బీర్‌అలీల అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారల ఇంఛార్జ్ ఆర్.సి.కుంటియా, పిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు హాజరయ్యారు. సుమారు మూడు గంటలపాటు సాగిన సమావేశంలో సభలో లేవనెత్తాల్సిన 25 అంశాలపై చర్చ జరిగింది. సిఎల్‌పి భేటీ అనంతరం వివరాలను సిఎల్‌పి విప్, ఆలంపూర్ ఎంఎల్‌ఎ ఎస్.ఎ.సంపత్‌కుమార్ మీడియాకు వివరించారు. ఎంఎల్‌ఎల ఫిరాయింపు వ్యవహారాన్ని ఎండగట్టాలనే ఉద్దేశ్యంతోనే రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థిని నిలుపనున్నట్లు తెలిపారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఇదే చివరి బడ్జెట్ సమావేశాలు కానున్న నేపథ్యంలో ప్రజాసమస్యలపై, హామీలపై తాడోపేడో తేల్చుకోవాలని, దూకుడుగా వ్యవహరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు అవసరమయ్యే నిధులన్నీ చివరి బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేశారు. రైతుల రుణమాఫీ వడ్డీ బకాయిల చెల్లింపు, ఆత్మహత్యలు, గిట్టుబాటు ధరలు,డబుల్ బెడ్ రూమ్ దళితులపై దాడులు, నల్లగొండ మున్సిపల్ చైరపర్సన్ భర్త బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్య, ఖమ్మం, ఆదిలా బాద్‌లో కాంగ్రెస్ నాయకుల హత్యలు, ఎస్‌టి, మైనారిటీల రిజర్వేషన్ పెంపు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు రుణాల మంజూరు, డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాలు తదితర అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. తాను ఇచ్చిన హామీల నుండి ప్రజల దృష్టిని మరల్చే ఉద్దేశ్యంతోనే సిఎం కెసిఆర్ మూడవ ఫ్రంట్ అంటూ కొత్త నాటకానికి తెరదీశారని సంపత్‌కుమార్ ఆరోపించారు. ఇదిలాఉండగా మహబూబ్‌నగర్ జిల్లాలో చేరికలకు వ్యవహారాన్ని ఎంఎల్‌ఎ డి.కె.అరుణ లేవనెత్తినట్లు తెలిసింది.

దేశానికి కొత్త చుక్కాని

(మొదటిపేజీ తరువాయి)

నోచుకోవడంలేదని, ప్రజలకు మంచినీరు, విద్యుత్, సాగునీరు అందడంలేదని, అనేక అవసరాలు తీరడంలేదన్నారు. కేంద్ర రాష్ట్ర సంబంధాల విషయంలో అనేక కమిషనర్లు, నిపుణులు సూచించిన సంస్కరణలు అమలుకావడంలేదని, నిజమైన ఫెడరల్ వ్యవస్థ స్ఫూర్తి పూర్తిస్థాయిలో ప్రతిబింబించడంలేదని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకే శాఖకు సంబంధించి వేర్వేరు పథకాలను అమలుచేస్తున్నాయని, దీనివలన క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, దీన్ని పరిష్కరించాల్సిన అవసరం ఉందని, ఉమ్మడి జాబితా అమలులో ఉండడంవల్లనే ఈ సమస్యలు తలెత్తుతున్నాయని, ఏ శాఖ ఎవరి దగ్గర ఉండాలనేదానిపై స్పష్టమైన నిర్ణయం జరగాలని వ్యాఖ్యానించారు. సంక్షేమం, అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాల్లో తెలంగాణ అనేక మైలురాళ్ళను అధిగమించి ఇతర రాష్ట్రాలకు, కేంద్రానికి ఆదర్శంగా నిలిచిందని వ్యాఖ్యానించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వేర్వేరు సామాజిక పరిస్థితులున్నాయని, వాటికి అనుగుణంగా రిజర్వేషన్లను కల్పించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రాలకు స్వేచ్ఛ, అధికారం కావాలని పేర్కొన్నారు. న్యాయ, పాలనా, శాసన వ్యవస్థల్లో మార్పులు రావాల్సిన అవసరం ఉందని, తీసుకురావాల్సిన మార్పులు, సంస్కరణలు, చట్ట సవరణలు, రాజ్యాంగ సవరణలు తదితర విషయాల్లో స్పష్టమైన ఎజెండా రూపొందాలని పేర్కొన్నారు. దేశంలోని రాజకీయ నాయకులు, అధికారులు, రిటైర్డ్ అధికారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సూచనలివ్వాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధికి కావాల్సిన ఎజెండాను రూపొందించడంతో పాటు ఇప్పుడున్న విధానాల్లోని మంచి చెడులపై ఆయన ఈ సమావేశంలో చర్చించారు.

హెచ్‌ఎంలతో ప్రభుత్వవిద్య పటిష్టం

- మిషన్ భగీరథ కింద స్కూళ్లకు నల్లా నీళ్లు
- విద్యాసదస్సులో డిప్యూటీ సిఎం కడియం శ్రీహరి



మనతెలంగాణ/హైదరాబాద్ : ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులకు సరైన గౌరవం లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, విద్యను పటిష్టం చేయడం ఒక సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్రభారతిలో జరిగిన విద్యాసదస్సులో పాల్గొన్న ఆయన ప్రసంగిస్తూ, ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలని, కొంతమంది ఉపాధ్యాయులు ఆదివారాలు, సెలవు రోజులతో పాటు వేసవి సెలవుల్లోనూ పాఠశాలలకు వెళుతున్నారని ఉదహరించారు. ఇలాంటి వారివల్ల ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని, మిగతా వారు కూడా ఆ విధంగా పనిచేయాలని ఆశిస్తున్నానని చెప్పారు. హెచ్‌ఎంలు నాయకులుగా పని చేసిన చోట ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాలు బాగా వస్తున్నాయన్నారు.
మిషన్ భగీరథ కింద అన్ని స్కూళ్లకు నల్లా కనెక్షన్లు ఇవ్వాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని, వాటి అమలు చేయించుకునే బాధ్యత హెచ్‌ఎంలపైనే ఉందని మంత్రి తెలిపారు. అన్ని స్కూళ్లకు మౌలిక వసతులు పెంచే ప్రయత్నం చేస్తున్నామని, బాలికల టాయిలెట్లు ఇంకా పెంచనున్నట్లు చెప్పారు. 7 నుంచి 10వ తరగతుల విద్యార్థినులకు 'హెల్త్ అండ్ హైజీన్ కిట్స్' ఇచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 23 లక్షల మందికి మధ్యాహ్నం భోజనం పెడుతుండగా, గుడ్ల కోసమే రూ.200 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. గుడ్ల సంఖ్యను వారానికి 3 నుంచి 5 లేదా 6కు పెంచే విషయం పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పెంచే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొన్నారు. జూన్ నాటికి 8,792 మంది కొత్త ఉపాధ్యాయులు పనిచేసే విధంగా ప్రయత్నిస్తామని చెప్పారు. పాఠశాలల విద్యుత్ బిల్లులు మాఫీ చేసే ప్రయత్నం చేస్తామని తెలిపారు. ప్రధానోపాధ్యాయుల సమస్యలే కాకుండా మిగిలిన సమస్యలు కూడా పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని, విద్యార్థుల శ్రేయస్సే లక్ష్యంగా, నాణ్యమైన విద్య అందించడమే ధ్యేయంగా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్, ఛీఫ్ విప్ పాతూరి సుధాకర్ రెడ్డి, ఎంఎల్‌సిలు పూల రవీందర్, కాటేపల్లి జనార్ధర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షులు లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నన్ను చంపేందుకు కుట్ర



మన తెలంగాణ/ హైదరాబాద్: టిఆర్‌ఎస్ ప్రభుత్వం చేతికి అంటకుండా తనను చంపేందుకు కుట్ర పన్నిందని, దీనిని అమలు చేసే బాధ్యతను ఒక మంత్రికి, మరో ఎంఎల్‌ఎకు అప్పగించిందని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ ఆరోపించారు. జైలులో ఉండగానే తనను భౌతికంగా లేకుండా చేసే ప్రయత్నాలు లీక్ కావడంతో, సమయం అనుకూలంగా లేకపోవడంతోనే ఈ కుట్ర తాత్కాలికంగా ఆగిపోయిందని వ్యాఖ్యానించారు. త్వరలోనే ఈ కుట్రలో కీలక పాత్ర పోషించిన మంత్రి పేరును వెల్లడిస్తామన్నారు. రక్షించాల్సిన వారే భక్షకులుగా మారితే తమ గోడును ఎవరికి చెప్పుకోవాలని మంద కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించిన వారికి ఉరి శిక్షలా..? మరణ శిక్షలా..? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని ఎంఆర్‌పిఎస్ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జులైలో సూర్యాపేట నుంచి తనను ఒక కారు వెంబడించిందని, వారి ప్రవర్తన కుట్రపూరితంగా ఉన్నదని, దీనిపై తాను పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు వాటి వివరాలను వెల్లడించలేదన్నారు. తనను హత్యచేసే కుట్రలో రాష్ట్రాన్ని పాలించే ప్రధాన నేతలు ఉన్నారని, ఈ కుట్ర అమలు పర్యవేక్షణను ఒక మంత్రికి బాధ్యతలు అప్పగించగా, ఆయన మరో మంత్రికి, ఒక ఎంఎల్‌ఎకు అమలుచేసే బాధ్యతను అప్పగించారని, ఇందులో కొందరు అధికారుల భాగస్వామ్యం కూడా ఉన్నాదని ఆరోపించారు. తనకు ఏదైనా జరిగితే అందుకు కెసిఆర్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గతంలో ఎన్‌టిఆర్, వైఎస్‌ఆర్, చంద్రబాబు, కెసిఆర్, జగన్‌మోహన్‌రెడ్డి లాంటి నేతలు దీక్షలు చేస్తే వారిని అరెస్టు చేయలేదని, అలాంటిది తనను ఎందుకు అరెస్ట్ చేశారని ప్రశ్నించారు. జైలులోనే కుట్రను అమలు చేయాలని బావించారన్నారు. రాష్ట్రంలో ప్రశ్నించడమే నేరమైతే, జీవించాలంటే ప్రశ్నించొద్దనే ధోరణి మంచిది కాదని, ఇది అప్రజాస్వామికమే అవుతుందన్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా తాను నమ్మిన సిద్ధాంతానికి, వర్గీకరణ లక్ష్య సాధన దిశగానే ప్రయాణం కొనసాగిస్తానని ఆయన స్పష్టం చేశారు. అధికారంలోనికి వస్తే వంద రోజుల్లో వర్గీకరణను అమలు చేస్తామని కేంద్రంలో ఉన్న బిజెపి హామీ ఇచ్చి మోసం చేసిందని, ఆ పార్టీ వైఖరిని పరిశీలిస్తే మొసలి కన్నీరు కనిపిస్తుందని ఆరోపించారు. తాము చేస్తున్న పోరాటాలకు మద్దతు ప్రకటించి, ఉద్యమాల్లో భాగస్వామ్యం అవతున్నప్పటికీ ఆ అంశాన్ని పార్లమెంట్‌లో మాత్రం ప్రస్తావించకుండా మౌనం దాల్చడం ఏమిటని మందా కృష్ణ ప్రశ్నించారు. ప్రత్యేక హోదా కోసం ఆంధ్రప్రదేశ్‌లో అన్ని రాజకీయ పార్టీలు పార్లమెంట్ సమావేశాలను స్తంభింపజేస్తున్నాయని, టిడిపి ఏకంగా కేంద్ర మంత్రి పదవులకు రాజీనామా చేసిందని, తెలంగాణలో రిజర్వేషన్ల కోటా పెంపు, ముస్లిం రిజర్వేషన్ల కోసం టిఆర్‌ఎస్ ఎంపిలు ఉద్యమిస్తున్నారని, కాని 24 ఏళ్లుగా కొనసాగుతున వర్గీకరణ అంశంపై మాత్రం నాలుగు నిమిషాలు కూడా ప్రస్తావించకపోవడం అన్యాయమని తెలిపారు. ఈ నెల 13న జరగనున్న తెలంగాణ బంద్‌ను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

స్వచ్ఛంద మరణహక్కు

(మొదటిపేజీ తరువాయి)

హక్కు ఉంది. కోమాలో ఉన్న వారు, కృత్రిమ శ్వాస ఇతరత్రా జీవనదాన వ్యవస్థలతో చావుబతుకుల మధ్య ఉన్న వారి విషయంపై న్యాయస్థానం రూలింగ్ ఇచ్చింది. సజీవ వీలునామాలను రూపొందించుకోవడం ద్వారా వ్యక్తులు అనాయాస మరణం పొందేందుకు అనుమతిని ఇవ్వాలని న్యాయస్థానం అభిప్రాయపడింది. ఇందుకు వీలుగా వారి అభ్యర్థన మేరకు కృత్రిమ జీవన ఆధారిత వ్యవస్థలను తొలిగించవచ్చునని పేర్కొంది. సుదీర్ఘకాలం చికిత్స పొందుతూ ఇక బతుకుతామనే ఆశ లేని వారు, చనిపోవాలనుకునే వారికి ఈ కారుణ్య మరణాన్ని కల్పించవచ్చునని తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా ఆధ్వర్యంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు వెలువరించింది. 'కొందరి విషయంలో మరణం కూడా వేడుకనే అవుతుంది. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడేవారు కోరుకున్నప్పుడు వారు సంకట జీవన ద్వారం దాటి చావు తీరం చేరేందుకు వీలు కల్పించలేమా? గౌరవప్రదంగా వారు బతుకులు ముగించేందుకు అవకాశం ఇవ్వలేమా' అని ధర్మాసనం ప్రశ్నించింది. సాధారణ ఆరోగ్య , మానసిక స్థితిలో వ్యక్తులు సిద్ధం చేసుకుని ఉన్న సజీవ వీలునామాలను సరైన రీతిలో అమలు పర్చే విషయంలో నిర్ధిష్ట నిబంధనలను పొందుపరుస్తున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. దీనికి సంబంధించి స్పష్టమైన మార్గదర్శక సూత్రాలను జత చేస్తున్నట్లు తెలిపింది. ప్రాణాంతక వ్యాధుల రోగుల వీలునామాలను ఎవరు అమలుపర్చాలి? తక్షణ కారుణ్య మరణాల అమలుకు ప్రత్యేక వైద్య మండళ్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇవి రోగుల పరిస్థితిని బట్టి కారుణ్య మరణ నిర్ణయం తీసుకుని వాటిని అమలు చేయడం జరగుతుందని ధర్మాసనం తెలిపింది. ఒకవేళ పరిస్థితి దారుణంగా ఉండి వైద్య మండలి నుంచి సరైన నిర్ణయంలేకుంటే రోగుల కుటుంబ సభ్యులు లేదా సన్నిహితులు దీనికి సంబంధించి సంబంధిత హైకోర్టులను ఆశ్రయించవచ్చునని, ఆ మేరకు ఈ కారుణ్య మరణాలకు అనుమతి తీసుకోవచ్చునని ధర్మాసనం తెలిపింది. అనాయాస మరణానికి సంబంధించి చట్టం తీసుకువచ్చే వరకూ తాము వెలువరించే ఆదేశాలు , మార్గదర్శక సూత్రాలు అమలులో ఉంటాయని న్యాయమూర్తులు ఎకె సిక్రీ, ఎఎం ఖాన్విల్కర్, డివై చంద్రచూడ్, అశోక్ భూషన్ కూడా సభ్యులుగా ఉన్న ధర్మాసనం పేర్కొంది.

సజీవ వీలునామాలు అంటే ?

ఏదైనా వ్యాధికి గురయినప్పుడు వ్యక్తులు తమ వైద్య చికిత్స విధానం గురించి ముందుగానే రాసి ఇచ్చే అంగీకార పత్రం ఈ లివింగ్ విల్‌గా పేర్కొంటారు. దీని మేరకు ఆ రోగి ఇక ముందు కోలుకోలేని స్థితికి వెళ్లినప్పుడు , ఏ విధమైన చికిత్స అందించాలో తెలియచేయలేని స్థితిలో ఉన్నప్పుడు , సరైన సమ్మతి వెల్లడించలేని దశకు చేరినప్పుడు తీసుకోవల్సిన చర్యలను ఈ వీలునామా ద్వారా అరుదైన రోగాల బారిన పడిన వారు పొందుపర్చవచ్చు.

66 ఏళ్ల నర్సు అరుణ జీవన్మరణ సమస్యనే ఇది

చికిత్సలకు స్పందించలేని స్థితిలో అనాయాస మరణం కల్పించాలనే అంశం 2015లో ప్రస్తావనకు వచ్చింది. 66 సంవత్సరాల నర్సు అరుణా షాన్ బౌగ్ అత్యాచారానికి గురై తీవ్ర అస్వస్థతతో షాక్‌లో 40 ఏళ్ల పాటు కోమాలో ఉన్నారు. ఈ ఉదంతాన్ని తీసుకుని చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడే వారికి కారుణ్య మరణం కల్పించే హక్కు కల్పించాలని స్వచ్ఛంద సేవా సంస్థ కామన్‌కాజ్ వారు సుప్రీంకోర్టులో ప్రజావ్యాజ్యం (పిల్) దాఖలు చేసింది. రోగుల సమ్మతి లేఖల ఆధారంగా వారికి ఈ విధమైన మరణం ప్రసాదించాలని కోరింది. ఈ పిల్‌పై గత ఏడాది అక్టోబర్ 11నే వాదనలు ముగించిన సుప్రీంకోర్టు తీర్పును వాయిదా వేసి ఇప్పుడు వెలువరించింది. సంస్థ తరపున ప్రముఖ న్యాయవాది ప్రశాంత భూషణ్ వాదించారు. ఇది కీలక చారిత్రక తీర్పు అని దీనితో చిక్కుముళ్లు వీడిపోతాయని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పటివరకూ ఈ అనాయాస మరణ అమలుపై ఉన్న సందేహాలు తీరాయి. దీనితో ఈ అంశంపై ఊపిరి పీల్చుకున్నట్లు అయిందని, కృత్రిమ జీవన వ్యవస్థను తొలిగించడం జరిగితే హత్య సమాన నేరంగా విచారణను ఎదుర్కొవల్సి వస్తుందనే భయం ఇంతవరకూ వెన్నంటిదని ఈ లాయర్ తెలిపారు. రాజ్యాంగంలోని 21వ అధికరణ మేరకు ప్రశాంతంగా సునాయాసంగా మరణించే హక్కు వ్యక్తులకు ఉందన్నారు.

వరుడు మృత్యు ఒడికి

(మొదటిపేజీ తరువాయి)

10.26 గంటలకు జరిగింది. మరుసటి రోజు వరుడి ఇంటి వద్ద (వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో) రిసెప్షన్ వేడుక నిర్వహించాలని భావించారు. దీంతో పెళ్లి అయిన వెంటనే అర్ధ రాత్రి వేళ ప్రయాణం తప్పలేదు. తణుకు నుంచి వర్ధన్నపేటకు 400 కిలోమీటర్ల పైచిలుకు దూరం ఉంటుంది. కారు డ్రైవర్ వేణు, పెళ్లి కొడుకు రామకృష్ణ ప్రసాద్‌లు చాలా కాలంగా మంచి స్నేహితులు. రామకృష్ణ ప్రసాద్‌కు కూడా కారు డ్రైవింగ్ రావడంతో చెరి కాసేపు డ్రైవింగ్ చేద్దామని భావించారు. ఈ క్రమంలో తొలుత డ్రైవింగ్ తీసుకున్న వేణు తణుకు నుంచి కారును నడిపాడు. ఇలా వీరి ప్రయాణం తల్లాడ వరకూ సాగింది. తల్లాడలో టీ తరువాత పెళ్లి కొడుకు రామకృష్ణ ప్రసాద్ డ్రైవింగ్ చేస్తున్నాడు. పది కిలీమీటర్ల మేర సజావుగా సాగిన ప్రయాణం అంతలోనే విషాదాంతమైంది. గత కొద్ది రోజులుగా కంటి నిండా నిద్రపోని పెళ్లి కొడుకు రామకృష్ణ ప్రసాద్‌ను ఆ నిద్ర మత్తే కబళించింది. తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో కారు ఒక్కసారిగా అదుపు తప్పింది. బలంగా ఓ పెద్ద చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో పెళ్లి కొడుకు రామకృష్ణ ప్రసాద్(36)తో పాటు ఆయన అక్క శేషం పద్మ(42), చెల్లెలు కోమండూరు శ్రీదేవి(34), బావ కోమండూర్ శరత్(38), డ్రైవర్ వడ్లకుండ వేణు(36) అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. పెళ్లి కుమార్తె దుర్గతో పాటు పెళ్లి కొడుకు బావ శేషం చలపతిరావులకు తీవ్ర గాయాలయ్యాయి. వాహనంలో ప్రయాణిస్తున్న చిన్నారులు రామన్(పద్మ కుమారుడు), మహతి, కృషి (శ్రీదేవి కుమార్తె, కుమారుడు)లకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే వాహనదారులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం చేరవేశారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను తొలుత ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెళ్లి కుమార్తె దుర్గతో పాటు శేషం చలపతిరావుల పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెళ్లి కుమారుడు మేనమామ జనార్ధన్ ఫిర్యాదు మేరకు కొణిజర్ల ఎస్సై వి.సురేష్ కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ప్రమాద స్థలిని ఎమ్మెల్యే మదన్‌లాల్ సందర్శించారు.

మూలాలకు ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

విశ్లేషించారు. దేశంలో ఇప్పుడు ఇంతకు ముందటి స్థితి కాకుండా వేరే వాతావరణం నెలకొందని, తిరోగమన దృక్పథం సాగుతోందని విమర్శించారు. స్వేచ్ఛాయుత సమాజంపై వ్యూహాత్మక దాడి జరుగుతోందన్నారు. జరిగిన దానిని జరగలేదనడం, జరగనిదానికి ప్రచారం కల్పించడం సాగుతోందని, ఈ విధంగా కొత్త చరిత్రకు దారులు తీయడం ఆనవాయితీగా మారిందని తెలిపారు. విచిత్రమైన మార్పు దశలో మనం ఉన్నామని , ఇది పూర్తిగా తిరోమన పథం కావడం ఆందోళనకరం అని విశ్లేషించారు. అబద్ధాలను గొప్పగా ప్రచారంలోకి తీసుకువస్తున్నారని ఇదేం పద్ధతి అని ప్రశ్నించారు. దేశంలో నాలుగేళ్ల క్రితమే ప్రగతి పథంలో అడుగులు పడ్డాయా? అంతకు ముందు భారత్ సాధించింది నిండుసున్నానా? ఈ విధంగా వాదించడం, దీనిని ప్రచారం చేయడం నిజంగా మన ప్రజల మేధోశక్తిని కించపర్చడం కాదా? అని సోనియా ఈ సందర్భంగా ప్రధాని మోడీని ప్రశ్నించారు. ఇది పార్టీలు వ్యక్తుల ప్రతిష్టకు సంబంధించిన విషయం కాదని, దేశ ఘనతను తక్కువ చేయడమే అవుతుందని స్పష్టం చేశారు.

రాజ్యాంగానికి మసిపూస్తున్నారు : కీలకమైన రాజ్యాంగాన్ని కించపరిచేందుకు దురుద్దేశపూరిత వ్యాఖ్యలకు దిగుతున్నారని సోనియా ఆక్షేపించారు. రాజ్యాంగాన్ని మార్చాల్సి ఉందని చెప్పడం కేవలం భారతీయ మౌలికతను దెబ్బతీసే యత్నమే అవుతుందని తెలిపారు. అధికార పక్షాల నుంచి వచ్చే రెచ్చగొట్టే వ్యాఖ్యలు మితిమీరుతున్నాయని, వీటిని యాధృచ్ఛికం అనుకోరాదని, చెదురుమదురు వ్యాఖ్యలు అయితే తేలికగా తీసుకోవచ్చు కానీ అంతకు మించి వీటి వెనుక భారీ స్థాయిలో విధ్వంసక ధోరణులు ఉన్నాయని ఆరోపించారు. ప్రమాదకర చేతలకు ముందస్తు సంకేతాలుగా నిలుస్తున్నాయన్నారు. ప్రత్యామ్నాయ గొంతు నొక్కుతున్నారని, ఆలోచనా స్వేచ్ఛ అంతం అవుతోందని, ఒకరి ఇష్టం ప్రకారం జరిగే వివాహబంధాలకు కూడా ఇతరత్రా బెదిరింపులు ఎదురవుతున్నాయని తెలిపారు. మతపరమైన ఉద్రిక్తతలను ఎగదోస్తున్నారని, నిఘా పేరిట గుంపులు, ప్రైవేటు మూకలు బయలు దేరాయని ఇవి ప్రైవేటు ఆర్మీలుగా వ్యవహరిస్తూ ఆగడాలను సాగిస్తున్నాయని ఆగ్రహించారు. ఏదో విధంగా ఎన్నికలలో గెలవాలనే తలంపుతో సమాజంలో విభజన రేఖలు గీస్తున్నారని , దళితులు, మహిళలపై దాడులు, అత్యాచారాలు సాగుతున్నాయని తెలిపారు. ఇది దేశ సుదీర్ఘ సంవిధాన విచ్ఛిత్తిగా మారుతుందని హెచ్చరించారు.

పార్లమెంటరీ మెజార్టీతో జబర్దస్తీ : పార్లమెంట్‌లో సాధించుకున్న మెజార్టీని లైసెన్సుగా తీసుకుని చర్చలకు ముగింపు పలుకుతున్నారు. ఇష్టారాజ్యంగా చట్టాలను రుద్దుతున్నారు. అధికారపు బలంతో బుల్‌డోజింగ్ జరుగుతోంది. దర్యాప్తు సంస్థలను వినియోగించుకుని రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నారని సోనియా విమర్శించారు. దేశ సామాజిక మూలకణ విచ్ఛిత్తి జరుగుతోందని సోనియా ఈ సందర్భంగా బిజెపిపై విరుచుకుపడ్డారు. న్యాయవ్యవస్థ సంక్షోభంలో పడిందని, విభేధించే స్వేచ్ఛ, వ్యక్తుల తినే అలవాట్లు, ఇష్టపూర్తి పెళ్లిళ్లు ఈ విధంగా అనేకం దాడులకు గురి అవుతున్నాయని, ఇది చివరి భారతీయ సామాజిక జన్యుకణం (డిఎన్‌ఎ) మార్పిడి దిశలో సాగుతున్న ప్రక్రియ అని విమర్శించారు.

గరిష్ట పాలన అంటే కనిష్ట నిజాలా : దేశంలో ఉద్యోగ కల్పన పరిస్థితి దారుణంగా ఉందని అందరికీ తెలుసునని, ఇది యువత అధోగతితోనే తెలుస్తోందని అయితేయ ఉన్నట్లుడి గత ఏడాదే అరకోటి ఉద్యోగాలు ఇచ్చినట్లు ప్రకటించేశారని , ఇది ఏం న్యాయం అని సోనియా ప్రశ్నించారు. వారు ప్రచారం చేసుకుంటున్న గరిష్ట పాలనను ఈ కనిష్ట సత్యంతో బేరీజు వేసుకోవచ్చునని తెలిపారు.అన్ని కోణాలలోనూ అబద్ధాల ప్రచారం జరుగుతోందని తెలిపారు.

మన్ బెటర్ అని నాకు తెలుసు : సోనియా : తన కన్నా దేశ ప్రజలకు మన్మోహన్ సింగ్ ఉత్తమ ప్రధానిగా పాలనను అందిస్తారనే విషయం తనకు తెలుసునని సోనియా అంగీకరించారు. అందుకే 2004లో ఆయనకే ప్రధాని పదవిని అప్పగించామని గుర్తు చేశారు. తన పరిమితులు ఏమిటనేది తెలుసుకుని ఉండటం వల్లనే ప్రధానిగా మన్మోహన్‌ను ఎంపిక చేయడం జరిగిందని ఇండియా టుడే కాన్‌క్లేవ్‌లో తెలిపారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలలో తిరిగి రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తారా? అని అడగ్గా దీనిపై నిర్ణయం పార్టీ తీసుకుంటుందన్నారు. కూతురు ప్రియాంక గాంధీ రాజకీయ పాత్రను ఆమెనే ఖరారు చేసుకుంటుందని అయినా ఇక ముందు ఏమి జరుగుతుందనేది ఇప్పుడే చెప్పలేమన్నారు.

2జి అవినీతిని 3డిలో చూపారు : కాంగ్రెస్ హయాంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని గత లోక్‌సభ ఎన్నికల ముందు ప్రచారం జరిగిందని సోనియా అభిప్రాయపడ్డారు. అవినీతి లేదనడం లేదు కానీ దీనిని గోరంతలు కొండంతలు చేశారని విమర్శించారు. 2014 లోక్‌సభ ఎన్నికలలో అవినీతి ఒక చర్చనీయాంశం అయిందని, 2జి స్పెక్ట్రమ్ స్కామ్‌లో కాగ్ ఇచ్చిన నివేదికలో ప్రభుత్వ ఖజానాకు అత్యధిక స్థాయిలో నష్టం జరిగిందని నివేదించిన విషయాన్ని సోనియా గుర్తు చేశారు.అప్పటి కాగ్ 2జి స్కామ్ ఫలితాన్ని అతిగా చిత్రీకరించారని తరువాత ఇది తప్పని, అంకెలగారడీ అని వెల్లడయిందని సోనియా విమర్శించారు.

అప్పటి కాగ్ వినోద్ రాయ్ గురించి పరోక్షంగా ప్రస్తావించారు. ఆ వ్యక్తికి ఇప్పుడు మంచిపదవి దక్కిందని తెలిపారు. వినోద్ రాయ్ ఇప్పుడు క్రికెట్ కంట్రోలు బోర్డు వ్యవహారాలు చూసే కార్యనిర్వాహక కమిటీ (సిఒఎ) అధినేతగా ఉన్నారని తెలిపారు. అప్పట్లో కాగ్ నివేదికలో ఈ స్కామ్‌లో ఖజానాకు రూ 1.76 లక్షల నష్టం వచ్చిందని తెలిపారని అయితే ఇది తప్పని తేలిందని గుర్తుచేశారు. భవిష్యత్తులో నెహ్రూ గాంధీయేతర కుటుంబాల వ్యక్తి కాంగ్రెస్ పార్టీ బాధ్యతలు తీసుకునే అవకాశం లేకపోలేదని , లేదనడానికి వీల్లేదని, భవిష్యత్తులో జరగవచ్చునని అయితే ఈ ప్రశ్నపై ఇతర కాంగ్రెస్ నేతలు జవాబిస్తే మంచిదని సోనియా తెలిపారు.

సినిమాలూ చూస్తూ.. పుస్తకాలు చదువుతూ



తనకు 19 ఏళ్ల తరువాత ఇప్పుడు బోలెడంత తీరిక దొరికిందని సోనియా తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి బాధ్యతల నుంచి వైదొలిగిన తరువాత తీరిక వేళలో పుస్తకాలు చదువుతున్నానని, సినిమాలు చూస్తున్నానని చెప్పారు. అత్తగారు ఇందిరా గాంధీ, భర్త రాజీవ్‌లకు చెందిన కాగితాలను, లేఖలను వారి రాతలను పొందుపరుస్తున్నట్లు త్వరలోనే వాటిని డిజిటలీకరణం చేస్తామని వెల్లడించారు. రాజీవ్‌కు ఇందిర లేఖలు , వాటికి ఆయన జవాబులు వంటివి ఇందులో ఉన్నాయని వివరించారు. ఇవి తనకు భావోద్వేగపు , సెంటిమెంటల్ ఖజానాలు అని విశ్లేషించారు. కార్తీ చిదంబరం అరెస్టు గురించి ప్రస్తావించగా దీని గురించి తనకు వివరాలు తెలియదని, అయితే రాజకీయ ప్రత్యర్థులపై కేసు లు పెట్టి వారిని ఇరుకున పెట్టడం ఈ ప్రభుత్వ తంతుగా మారిందన్నారు

రాజీవ్ కోసం తల్లడిల్లిన సోనియా

భర్త రాజీవ్ గాంధీని రాజకీయాలలోకి రావద్దని తాను అడ్డుకున్న విషయం నిజమేనని సోనియా గాంధీ తెలిపారు. అత్త ఇందిర హత్యలాగానే తన భర్తకు కూడా ప్రాణగండం ఉండొచ్చుననే భయం తనకు ఉండేదని అందుకే వద్దని చెప్పానని తెలిపారు. స్థానికంగా ఇండియా టుడే సదస్సులో ఆమె ప్రశ్నోత్తరాల దశలో దీనిపై ఉద్వేగభరితంగా స్పందిస్తూ కన్నీరు పెట్టుకున్నారు. రాజకీయాలలోకి భర్త వస్తే ఇబ్బంది అవుతుందని తాను భయపడ్డానని తరువాత అనుకున్నంత అయిందని ఆమె మాటలను దిగమింగుకుంటూ కన్నీరు పెట్టుకున్నారు. స్వార్థం కొద్ది , ఆయన కుటుంబానికి దూరం అవుతారనే ఆందోళనతో ఈ విధంగా చెప్పానని అయితే తప్పనిసరిగా ఆయన రాజకీయాలలోకి వచ్చారని , తరువాత ఏమి జరిగిందనేది తల్చుకుంటే తను అప్పుడు ఆయనకు చెప్పిన మాటలు, రాజకీయాలకు దూరంగా ఉండాలనే వేడుకోళ్లు గుర్తుకు వస్తాయని చెపుతూ సోనియా కన్నీరు పెట్టుకున్నారు.



మహిళలపై వేధింపులు మానవ హక్కుల ఉల్లంఘనే

మన తెలంగాణ / హైదరాబాద్ : మహిళలపై జరుగుతున్న వేధింపులు మానవ హక్కుల కిందకు వస్తాయని మహారాష్ట్ర ఆటవీ సంరక్షణ రిటైర్డ్ ప్రధాన అధికారి అరవింద్ కుమార్ ఝా అన్నారు. ప్రతి మహిళ జీవితంలో ఏదో ఒక సందర్భంలో వేధింపులకు గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పనిచేసే ప్రదేశంలో 78 శాతం మంది మహిళలు వేధింపుల బారిన పడుతున్నట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయని తెలిపారు. 'మహిళలు–చట్టం' అనే అంశంపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం అరణ్యభవన్‌లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అరవింద్ కుమార్ ఝా మాట్లాడుతూ ఉద్యోగాలు చేస్తున్న మహిళలు ప్రస్తుత అవసరాల నేపథ్యంలో ఎక్కువ సమయాన్ని కార్యాలయాల్లోనే గడుపుతున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో లింగ వివక్ష లేని, వేధింపుల్లేని పనికి అనువైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రతీ శాఖపై ఉందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లింగవివక్ష, లైంగిక వేధింపుల నివారణ కోసం కేంద్రం తీసుకు వచ్చిన చట్టంపై దేశవ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో అవగాహన కల్పిస్తున్నారని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో అదనపు ఆటవీ సంరక్షణ ప్రధాన అధికారులు సునీల్‌కుమార్ గుప్తా, ఆర్‌ఎం,డొబ్రియల్, స్వర్గం శ్రీనివాస్, డిప్యూటీ సంరక్షణ అధికారి ఎన్.క్షితిజ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటకు జాతీయ స్వచ్ఛత అవార్డు

మార్చి 23న ఢిల్లీలో అవార్డు ప్రదానం

మన తెలంగాణ/సిద్దిపేట ప్రతినిధి : సిద్దిపేట మున్సిపాల్టీ జాతీయ స్థాయి స్వచ్ఛత ఎక్సెలెన్స్ అవార్డుకు ఎంపికైంది. గత అక్టోబరు నెలలో నామినేషన్లను ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 32 మున్సిపాల్టీలు, నగర పంచాయతీ కేటగిరీల నుంచి నామినేషన్‌లు దాఖల య్యాయి. తెలంగాణ నుంచి అచ్చంపేట, కల్వకుర్తి, సిద్దిపేట, సూర్యాపేట, హుజురాబాద్, హుజూర్‌నగర్, సత్తుపల్లి, మధిర, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, బడంగ్‌పేట, భువనగిరి, భైంసా, నర్సంపేట, సిరిసిల్లా, వేములవాడల నుంచి ఓడిఎఫ్ డిక్లరేషన్‌లో ముఖ్యపాత్ర పోషించిన సమాఖ్యలు నామినేషన్లు సమర్పించాయి. ఈ నేపథ్యంలో ఇటీవల క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా సిద్దిపేట పట్టణాన్ని సందర్శించి కేంద్రానికి నివేదిక అందించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ పట్టాణాభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రటరీ వైఎస్ ఆవాన నుంచి సిద్దిపేట మునిసిపాల్టీకి అవార్డుకు ఎంపికైనట్టు కమిషనర్ శ్రీనివాసరెడ్డికి సమాచారం అందించారు.

వచ్చే ఎన్నికల్లో 50 శాతం సీట్లు బిసిలకు కేటాయిస్తాం : తమ్మినేని



మన తెలంగాణ/నల్లగొండ ప్రతినిధి : కాంగ్రెస్, బిజెపిలకు వ్యతిరేకంగా పనిచేస్తానని కెసిఆర్ చెప్పడాన్ని స్వాగతిస్తున్నా బిజెపి అనుకూల విధానాలనే రాష్ట్రంలో అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. శుక్రవారం సిపిఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బిజెపిలు ఒకే విధానాలని అన్నారు. బిజెపి మతోన్మాదంతో విధ్వంసాలు సృష్టిస్తుందన్నారు. త్రిపురలో గెలవగానే దాడులు చేస్తుందని మండిపడ్డారు. భవిష్యత్‌లో బిజెపికి వ్యతిరేకంగా కేసిఆర్ నిలబడతారా అని ప్రశ్నించారు. మైనార్టీలకు, ఎస్టిలకు రిజర్వేషన్లు కోరుతున్న కేసిఆర్ 119 ఎమ్మెల్యే సీట్లలో 50శాతం బిసిలకు ఇస్తానని ప్రకటించగలరా అని సవాల్ విసిరారు. సగం సీట్లను బిసిలకు కేటాయిస్తామని, ఉమ్మడి నల్లగొండలోని 12 ఎమ్మెల్యే, రెండు ఎంపి సీట్లలో బహుజన దళిత ఫ్రంట్ పోటీ చేస్తుందని చెప్పారు. సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జహంగీర్, తుమ్మల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రష్యన్ ఎంబసీని మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

మనతెలంగాణ–/హైదరాబాద్ / గచ్చిబౌలి : రష్యన్ ఎంబసీని మోసం చేసి తప్పించుకొని తిరుగుతున్న మోసగాణ్ణి అరెస్ట్ చేసిన సంఘటన రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగింది. శుక్రవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాచకొండ కమిషనర్ మహేష్ భగవత్ మాట్లాడుతూ దిల్లీలోని రష్యన్ ఎంబసీ కార్యాలయానికి రాడర్ ఎల్రక్టానిక్ పరికరాల టెండర్లు పిల్చినట్టు తెలిపారు. గుంటూరుకు చెందిన రంగాబాబు ఈ కాంట్రాక్ట్ దక్కించుకున్నాడు, ఆన్ లైన్‌లో 42వేల 500 వందల యుఎస్ డాలర్‌లు సుమారు 29 లక్షల రూపాయలను అకౌంట్‌లో వేయించుకొని ఇక్కడ నుంచి మకాం మార్చేశాడు. రష్యన్ ఎంబసీ మోసపోయినట్లు గ్రహించి రాచకొండ పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు అన్ని రీతుల్లో దర్యాప్తు చేసి మొత్తానికి నిందితుడు రంగాబాబుని అరెస్ట్ చేశారు.

వంటిమామిడి రోడ్‌కు రూ.9 కోట్లు

మన తెలంగాణ/హైదరాబాద్ : గజ్వేల్ నియోజకవర్గంలో వంటిమామిడికి కొత్తగా వేయనున్న రహదారికి ప్రభుత్వం రూ.9 కోట్లకు పరిపాలన అనుమతులు ఇచ్చింది. రాజీవ్‌రహదారి నుంచి లక్ష్మారెడ్డిపల్లి, తునికిబొల్లారం మీదుగా వంటిమామిడికి రెండు లేన్ల తారు రోడ్ నిర్మాణం మంజూరు చేశారు. తొలుత దీని అంచనా వ్యయం రెండు కోట్ల రూపాయలకు అనుమతులు లభించగా, పంచాయత్‌రాజ్ చీఫ్ ఇంజనీర్ రూ.9 కోట్లతో సవరించిన అంచనాలను ప్రభుత్వానికి పంపించారు. పరిశీలించి పరిపాలన అనుమతులను శుక్రవారం ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ మంజూరు చేశారు.

గంజాయి విక్రయిస్తున్న విద్యార్థుల అరెస్ట్

మన తెలంగాణ/ ఇబ్రహీంపట్నం : అక్రమంగా గంజాయిని విక్రయిస్తున్న ఇద్దరు విద్యార్థులను అరెస్ట్ చేసిన సంఘటన రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. బాలాపూర్ మండలం నాదర్‌గుల్ ఎంవిఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో లిబ్రా కాలనీలో రహస్యం గా గంజాయిని విక్రయిస్తున్న బి నవీన్ కుమార్ (20), అబ్దుల్లాపూర్‌మెట్ మండలం రాగన్న గూడకు చెందిన బి విక్రమ్ (20) అనే ఇద్దరు విద్యార్థులు గంజాయి, హుక్కాను విక్రయిస్తుండగా ఎల్బినగర్ ఎస్‌ఓటి పోలీసులుయ పట్టుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సిఐ గోవిందారెడ్డి తెలిపారు.

ఎక్సైజ్ అధికారులతో ఎంఎల్‌ఏ వాగ్వాదం

మన తెలంగాణ/మంచిర్యాల ప్రతినిధి : కొమ్రం భీం జిల్లాలో ఓ లారీని అడ్డుకున్నందుకు ఎక్సైజ్ అధికారులతో సిర్పూర్ ఎంఎల్‌ఏ కోనేరు కోనప్ప వాగ్వాదానికి దిగారు. బెల్లం లారీని ఎక్సైజ్ శాఖ అధికారులు తనిఖీ చేస్తుండగా లారీని ఎందుకు ఆపారని అధికారులతో ఎంఎల్‌ఏ వాగ్వాదానికి దిగారు. అంతేకాకుండా ఎంఎల్‌ఏ కోనప్ప అధికారులను దుర్భాలాషడినట్టు బాధిత అధికారులు తెలిపారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులకు బాధిత అధికారులు ఫిర్యాదు చేశారు.

కెసిఆర్ ధర్నాకు ఎంఆర్‌పిఎస్ మద్దతు



మన తెలంగాణ / హైదరాబాద్/ ముషీరాబాద్: సిఎం కెసిఆర్ ఎస్‌సి వర్గీకరణ కోసం ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద చేసే ధర్నాకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (టిఎస్) రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతు ఉంటుందని సమితి రాష్ట్ర అధ్యక్షులు యాతాకుల భాస్కర్ మాదిగ, వర్కింగ్ ప్రసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాదిగలు అన్నారు. శుక్రవారం హైదరాబాద్ విద్యానగర్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ 24 ఏళ్ల నుంచి వర్గీకరణ కోసం పోరాడుతున్నా కూడా ఏ సీఎం ముందుకు రాలేదన్నారు. వర్గీకరణ లక్ష్యంగా ఈ నెల ఎమ్మార్పీఎస్ (టిఎస్) ఈ నెల 11న చేపట్టి రాష్ట్ర ప్రతినిధుల సభ ఉన్న నేపథ్యంలో సిఎం కెసిఆర్ స్పందించి ఉంటారని అభిప్రాయపడ్డారు. రాజ్యసభ స్థానాల్లో ఒకటి మాదిగలకు అవకాశం ఇవ్వాలని కోరారు. సమావేశంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మేడి పాపయ్య, మేధావుల ఫోరం అధ్యక్షులు బుగ్గ మైసయ్య, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.మల్లేష్, శ్యామ్‌రావు, అల్లెగొండ పాల్గొన్నారు.

'మిలియన్ మార్చ్ స్ఫూర్తి సభ'కు చెక్‌పోస్టులు



మన తెలంగాణ/హైదరాబాద్ : మిలియన్ మార్చ్ 'స్ఫూర్తి సభ'ను అడ్డుకునేందుకు పోలీసులు జిల్లాల సరిహద్దులలో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. తెలంగాణ జెఎసి, సిపిఐ నేతలు, కార్యకర్తలు నగరంలోకి రాకుండా అడ్డుకునేందుకు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధిలో రహదారులపై 75 పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. స్ఫూర్తి సభను ట్యాంక్‌బండ్‌పై నిర్వహించేందుకు అనుమతి కోరుతూ జెఎసి, సిపిఐ నేతలు చేసిన దరఖాస్తును పోలీసులు తిరస్కరించడంతో అనుమతి లేకున్నా సభ జరిపి తీరుతామని వ్యాఖ్యానించడంతో భారీ స్థాయి పోలీసు బందోబస్తు ఏర్పా టైంది. అనుమతి లేని సభను ఎలా జరుపు తారంటూ పోలీసులు కూడా పట్టుదలతో ఉన్నారు. ఇప్పటికే విద్యార్థి సంఘాల నాయకులను, జెఎసి కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. నగరంలో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసు కుంటున్నాయి. ముందు జాగ్రత్త చర్యగా ట్యాంక్ బండ్ చుట్టుపక్క ప్రాంతాలలో శుక్ర వారం నుంచే పోలీసులు బారికేడ్లు పెట్టి, భారీగా పోలీసులను మోహరించారు. ఇక జాక్, సిపిఐ నేతల ఇండ్ల వద్ద పోలీసు నిఘా కొనసాగుతోంది. సభకు రాకుండా అడ్డుకునేందుకు పోలీసులు వాహనాలన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఆర్‌టిసి బస్సులను కూడా తనిఖీ చేస్తున్నారు. సరూర్ నగర్ స్టేడియంలో జరి గిన సభకు సైతం పోలీసులు అడ్డంకులు సృష్టిం చినా కార్యకర్తలు తరలివచ్చారు.

వాహనాల రాకపోకల నిషేధం

కాగా, నగరంలోని ట్యాంక్‌బండ్‌పై వాహనాల రాకపోకలను నిషేధిస్తూ నగర పోలీసు కమిషనర్ శ్రీనివాస్‌రావు శుక్రవారం నాడు ఆదేశాలు జారీ చేశారు.

నిర్వహించి తీరుతాం : కోదండరాం



మన తెలంగాణ/తాండూరు (వికారాబాద్ జిల్లా) : రానున్న 15 రోజులలో పార్టీ ఏర్పాటును ప్రకటిస్తామని రాష్ట్ర జెఎసి ఛైర్మన్ కోదండరాం వెల్లడించారు. శుక్రవారం తాండూరు పట్టణంలో ఏర్పాటు చేసిన 'సంక్షోభంలో కంది రైతులు చర్చా వేదిక'లో పాల్గొన్న కోదండరాం మీడియాతో మాట్లాడుతూ, కొత్త పార్టీ ఏర్పాటు విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదని మరో 15 రోజులలో పార్టీ ఏర్పాటుపై ప్రకటన చేస్తామన్నారు. అదే విధంగా ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు కల్పించినా ఎంతమందిని ముందస్తు అరెస్టులు చేసినా శనివారం నిర్వహించే మిలియన్ మార్చ్‌ను నిర్వహిస్తామన్నారు. అనుమతుల కోసం డిజిపి నికలుస్తామని చెప్పారు. అనుమతులు ఇవ్వకున్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం చచ్చిపోయిందని నియంత పాలన కొనసాగుతుందన్నారు. రానున్న 2019 ఎన్నికలలో తెలంగాణ ప్రజలు ప్రజాస్వామ్య పార్టీలను ఎన్నుకుంటారని చెప్పారు.

బెదిరింపులు, ఒత్తిళ్లకు భయపడేది లేదు


▶▶ అరెస్టులను ఖండించిన మిలియన్ మార్చ్ స్ఫూర్తి కమిటీ

మన తెలంగాణ / హైదరాబాద్ : ఈ నెల 10న ట్యాంక్‌బండ్‌పై మిలియన్ మార్చ్ 'స్ఫూర్తి' కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టిన టిజెఎసి, వామపక్షాల నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని 'మిలియన్ మార్చ్ స్ఫూర్తి కమిటీ తీవ్రంగా ఖండించింది. అరెస్ట్ చేసిన నాయకులను, కార్యకర్తలను పోలీసులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. పోలీసుల బెదిరింపులకు, ప్రభుత్వ ఒత్తిళ్లకు భయపడబోమని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా మిలియన్ మార్చ్ స్ఫూర్తి కార్యక్రమాన్ని జరిపి తీరుతామని కమిటీ స్పష్టం చేసింది. మఖ్దూంభవన్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో కమిటీ నాయకులు జి.వెంకట్‌రెడ్డి, ఎస్.ప్రభాకర్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, మల్లేపల్లి ఆదిరెడ్డి (సిపిఐ), కె.గోవర్ధన్ (సిపిఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ), రవి చంద్ర (తెలంగాణ ప్రజా ఫ్రంట్), వి.సంధ్య (పిఓడబ్ల్యు) మాట్లాడారు. స్ఫూర్తిలో తెలంగాణవాదులంతా పాల్గొనాలని, ట్యాంక్‌బండ్‌కు వచ్చే కార్యకర్తలను పోలీసు లు అడ్డుకుంటే జిల్లాల్లో ఎక్కడికక్కడ తెలంగాణ అమరుల స్థూపాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

అనుమతిప్పించండి: సిఎంకు చాడ లేఖ

మిలియన్ మార్చ్ స్ఫూర్తి కార్యక్రమానికి పోలీసులు అనుమతిని నిరాకరించడం అత్యంత విచారకరమని, ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు జోక్యం చేసుకుని అనుమతి ఇప్పించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన సిఎం కెసిఆర్‌కు శుక్రవారం ఒక లేఖ రాశారు.

ఆత్మవిశ్వాసంతో శ్రమిస్తేనే లక్ష్య సాధన



మన తెలంగాణ/మేడ్చల్ : విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో నిరంతరం శ్రమించి కోరుకున్న ఆశయాన్ని సాధించాలని సాంకేతిక విద్యాశాఖ సంచాలకులు నవీన్‌మిట్టల్ అన్నారు. మేడ్చల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 5వ వార్షికోత్సవం శుక్రవారం మండలంలోని కండ్లకోయ గ్రామ పరిధిలో గల నిమ్మల గార్డెన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యతోపాటు ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యాలను, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ ఇవ్వడం ఎంతో అవసరమని సూచించారు. డిజిటల్ టీచింగ్, ఇక్లాస్‌రూమ్స్ లాంటి సాధనాలను అధ్యాపకులు తమ బోధనలో ఉపయోగించాలని కోరారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే గురుతర బాధ్యత గురువులపై ఉందని ఆ దిశగా ముందుకు సాగాలని కోరారు. ప్రొఫెసర్ సుదర్శనాచారి మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ, మేడ్చల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూనే ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే నూతన భవనంలోకి ప్రవేశిస్తామని, ఎంతో మంది విద్యార్థులు మేడ్చల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఎంచుకుంటున్నారని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి.

పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం

▶▶ మహా సాయి లేబొరేటరీస్ పూర్తిగా దగ్ధం : కోట్లల్లో ఆస్తి నష్టం



మన తెలంగాణ /గుమ్మడిదల : సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన గుమ్మడిదలలో శుక్రవారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ భారీ అగ్ని ప్రమాదం వల్ల సంస్థకు కోట్లల్లో ఆస్తి నష్టం సంభవించినట్లు పరిశ్రమ యాజమాన్యం వెల్లడించారు. కానుకుంట ప్రధాన రహదారిలో గల ఈ పరిశ్రమలో సాయంత్రం 3.40 సమయంలో అకస్మాత్తుగా అగ్ని కీలలు ఎగిసి పడడంతో పని చేస్తున్న కార్మికులు భయంతో పరుగులు తీసారు. ఈ ప్రమాదంలో ముగ్గిరికి స్వల్ప గాయాలయ్యాయి. పరిశ్రమలో సంభవించిన మంటలను ఆర్పడానికి సమీపంలో గల హెటిరో డ్రగ్స్ పరిశ్రమ నుండి అగ్నిమాపక శకటం, డిఆర్‌డిఒ నుండి రెండు అగ్నిమాపక శకటాలు, పటాన్‌చెరు మరియు నర్సాపూర్ నుండి ఒక్కొక్కటి అగ్ని మాపక శకటాలు వచ్చి ఆర్పే ప్రయత్నం చేసాయి. దాదాపు 30 నీటి టాంకర్లు నిరంతరం నీటిని అగ్నిమాపక శకటాలకు నీటిని అందించినా ఒకపట్టాన మంటలు అదపులోకి రాలేదు.

డిఎస్‌పి సీతారాం వివరణ :

పరిశ్రమలో అగ్నిప్రమాద విషయాన్ని తెలుసుకున్న డిఎస్‌పి సీతారాం ప్రమాద స్థలానికి చేరుకున్నారు. ఎస్‌ఐ ప్రశాంత్ తో సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎలాటి ప్రాణ నష్టం జరగలేదని, ప్రమాద సమయంలో ముగ్గిరికి మాత్రం గాయాలు అయినాయని తెలిపారు. ఆస్తి నష్టం పూర్తి వివరాలు ఇప్పుడే చెప్పలేమని అన్నారు.


మూడు జిల్లాల్లో వృద్ధాశ్రమాలు

మన తెలంగాణ / హైదరాబాద్ : నిజామాబాద్, కామారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేస్తూ మహిళా శిశు సంక్షేమం, వయోవృద్ధుల శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం రాంపూర్ గ్రామం, కామారెడ్డి, ఖమ్మం లలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆయా జిల్లా శాఖలతో కలిసి వీటిని ఏర్పాటు చేయనున్నారు. వీటి నిర్మాణానికి సంబంధించి ఒక్కో వృద్ధాశ్రమానికి రూ.50 లక్షలు, లేదా మొత్తం నిర్మాణ వ్యవయంలో 50 శాతం నిధులు (ఏదితక్కువైతే ఆ మొత్తం) విడుదల చేయడానికి ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆయా జిల్లాల బ్రాంచీల నిర్వహణలో ఈ వృద్ధాశ్రమాలు కొనసాగుతాయి.వృద్ధాశ్రమాల నిర్మాణ ఖర్చులో 50 శాతం ప్రభుత్వం భరిస్తుండగా 50 శాతం రెడ్‌క్రాస్ సొసైటీ భరిస్తుంది. వీటి పనితీరును జిల్లా కలెక్టర్లు పర్యవేక్షిస్తారు. నిర్వహణ ఖర్చులను రెడ్‌క్రాస్ సొసైటీ భరిస్తుంది.

గుర్తుతెలియని తల లభ్యం

మన తెలం గాణ / భైంసా : నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో శుక్రవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి తల లభ్యమవడం సంచలనం సృష్టించింది. పట్టణ ప్రధాన రోడ్డు ప్రక్కన నర్సింహ మందిరానికి వెళ్ళే మార్గంలో ఏరియా ఆసుపత్రి ప్రహరీగోడను ఆనుకొని గోనె సంచిలో గుర్తుతెలియని వ్యక్తి తల ఉండడం కలకలం రేపింది. ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్యచేసి రాత్రివేళ ఇక్కడ పడేసి వెళ్ళిపోయారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉదయం వేళ మున్సిపల్ సిబ్బంది రోడ్లను శుభ్రపరుస్తుండగా గోనె సంచి ఉండడంతో వారు చూడగా అందులో తల కనిపించడంతో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పట్టణ సిఐ శ్రీనివాస్, ఎస్ఐలు పులి పున్నంచందర్, తిరుపతిలు హుటాహుటిన సంఘటనాస్థలానికి వచ్చారు. అక్కడ పరిశీలించగా గుర్తుతెలియని వ్యక్తి తల ఉంది. దారుణంగా హత్యచేసి తలను వదిలి వెళ్ళారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మావోయిస్టుల బంద్ ప్రశాంతం



మన తెలంగాణ/భద్రాచలం : ఈనెల 2న పూజారా కాంకేర్ జిలాలో చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్‌కు నిరసనగా శుక్రవారం మావోయిస్టులు పిలుపునిచ్చిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఎన్‌కౌంటర్‌కు నిరసగా బంద్ పాటించాలంటూ మావోయిస్టులు ముందస్తుగానే ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు ఛత్తీస్‌గఢ్‌లో చోటు చేసుకున్న చెదురుమదురు సంఘటనలు మినహా బంద్ ప్రభావం పెద్దగా కనిపించలేదు. ఎన్‌కౌంటర్ సందర్భంగా చోటు చేసుకున్న అనేక పరిణామాల, పుకార్ల నేపథ్యంలో మావోయిస్టు అగ్రనేత హరిభూషణ్, అలియాస్ జగన్ విడుదల చేసిన ఆడియో విడియో తీవ్ర సంచలనాన్ని రేకెత్తించాయి. అధికార పార్టీ నేతలపై దాడులు ముమ్మరం చేస్తామని హెచ్చరించడంతో టిఆర్‌ఎస్ శ్రేణుల్లో భయాందోళన నెలకొంది. కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని జిజాపూర్ జిల్లా గంగుళూర్ అటవీప్రాంతంలో పోలీసులకు, మావోయిస్టులు ఎదురు కాల్పులు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. జవాన్‌కు తీవ్ర గాయాలు కావడంతో రాయ్‌పూర్‌లోని ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

మోడీని ప్రశ్నించడం ఓ ఎన్నికల స్టంట్

వి.హనుమంతరావు

మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో రైతులకు సంకేళ్లు వేసిన సిఎం కెసిఆర్, ఇప్పుడు రైతుల విషయంలో ప్రధానిమోడిని ప్రశ్నించడం ఒక ఎన్నికల స్టంట్ అని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ఆరోపించారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రిజర్వేషన్ల అంశంలో కెసిఆర్ ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తానని అనడం ఒక బూటకమన్నారు. రాష్ట్రంలో ధర్నాచౌక్‌ను రద్దు చేసి, ఆయన మాత్రం ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నాలు చేస్తారా అని హనుమంతరావు ప్రశ్నించారు. కెసిఆర్ మాయమాటలు నమ్మేందుకు ప్రజలకు సిద్ధంగా లేరన్నారు. నాలుగేళ్ల కాలంలో ప్రజలకు కెసిఆర్ ఏం చేశారని ప్రశ్నించారు. క్రీమీలేయర్‌పై కెసిఆర్ ఎందుకు స్పందించడం లేదన్నారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు

విస్తృత ప్రచారం కల్పించాలి

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ జరిపే ప్రచారానికి సోషల్ మీడియాను కూడా విస్తృతంగా వినియోగించుకోవాలని సిబ్బందికి ఆ శాఖ కమిషనర్ అరవింద్ కుమార్ సూచించారు. డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవవనరుల కేంద్రంలో సోషల్‌మీడియా, డిజిటల్ మీడియా వినియోగంపై సమాచార,పౌర సంబంధాల శాఖ అధికారులకు శుక్రవారం నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడుతూ, సంక్షేమ కార్యక్రమాల ప్రచారంలో సోష ల్ మీడియాను విస్తృతంగా వాడాలన్నారు. సమాచారశాఖ అదనపు సంచాలకులు నాగయ్య కాంబ్లే, చీఫ్ ఇన్ఫర్‌మేషన్ ఇంజనీర్ కిషోర్‌బాబు, పబ్లిసిటి సెల్ డిప్యూటి డైరెక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు.

బిసిల జోలికొస్తే ఊరుకోం

రేవంత్‌రెడ్డికి జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరిక

మన తెలంగాణ / ముషీరాబాద్ : బిసిలను అణిచి వేసి అగ్రకులాలను అసెంబ్లీకి పంపించాలని రేవంత్‌రెడ్డి తహ తహలాడుతున్నారని, బిసిల జోలికొస్తే తాట తీస్తామని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. మంత్రి ఈటల పై చేసిన దాడి యావత్ బిసిలందరిపై చేసిన దాడిగా భావిస్తామని, వెంటనే భేషరతుగా మంత్రి ఈటలకు క్షమాపణ చెప్పాలని రేవంత్‌రెడ్డిని జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు.

ప్రభుదేవాకు లక్కీ ఆఫర్



బాలీవుడ్‌లో కలెక్షన్ల సునామీ సృష్టించిన సినిమా 'దబాంగ్'. సల్మాన్‌ఖాన్ కథానాయకుడిగా తెరకెక్కిన ఈ చిత్రం సీక్వెల్ 'దబాంగ్ 2' కూడా బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. ఇప్పుడు దబాంగ్ 3 చిత్రాన్ని తెరకెక్కించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రభుదేవా దర్శకత్వంలో ఈ చిత్రంలో నటించేందుకు సల్మాన్ కూడా ఒప్పుకున్నాడట. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'వాంటెడ్' సూపర్‌హిట్‌గా నిలిచింది. తెలుగులో వచ్చిన మహేష్ 'పోకిరి'ని బాలీవుడ్‌లో 'వాంటెడ్' పేరుతో రీమేక్ చేశారు. ఈ చిత్రం కాసుల వర్షం కురిపించింది. అప్పటివరకు ఫ్లాపులతో సతమతమైన సల్మాన్ ఈ చిత్రంతో హిట్ బాట పట్టాడు. ఆతర్వాత ప్రభుదేవా బాలీవుడ్‌లో కొన్ని సినిమాలు చేసినా పెద్దగా సక్సెస్‌ను అందుకోలేకపోయాడు. ఇప్పుడు సల్మాన్‌తో 'దబాంగ్ 3'ని రూపొందించే లక్కీ ఆఫర్‌ను ప్రభుదేవా అందుకున్నాడు. ఇక దబాంగ్ మొదటి పార్టుకు అభినవ్‌కశ్యప్ దర్శకత్వం వహించాడు. రెండు పార్టుకు సల్మాన్ తమ్ముడు అర్భాజ్ ఖాన్ దర్శకత్వం వహించాడు.



చిరంజీవి

చైనాకు వెళ్తున్న 'సైరా..'

ఓ సినిమాను మార్కెట్ చేసుకునేందుకు చాలానే టెక్నిక్స్ పాటించాలి. అందులో భాగమే ఇతర భాషల్లో కూడా సినిమాను రిలీజ్ చేయడం. ఇప్పటికే మెగాస్టార్ చిరంజీవి 151వ సినిమా 'సైరా.. నరసింహారెడ్డి'ని దక్షిణాదిలోని అన్ని భాషలతో పాటు హిందీలో కూడా విడుదల చేసేలా పనులు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు 'సైరా...'ను చైనాకు కూడా తీసుకెళ్లాలని ఫిల్మ్‌మేకర్స్ నిర్ణయించారు. అందుకు తగినట్లుగానే షూటింగ్ పనులు కూడా ప్లాన్ చేయడం విశేషం. ఇతర దేశాల భాషలకు చెందిన సినిమాను చైనాలో విడుదల చేయాలంటే అక్కడ ఎక్కువ ఖర్చవుతుంది. కానీ ఆ సినిమాలోని కొంత భాగాన్ని చైనాలో షూట్ చేస్తే ట్యాక్స్ రిబేట్స్ కూడా ఉంటాయి. అందుకే సైరా మూవీకి చెందిన ఓ షెడ్యూల్‌ను చైనాలో చిత్రీకరించబోతున్నారట. ఇక మరికొన్ని రోజుల్లో అమితాబ్‌బచ్చన్ ఈ సినిమా షూటింగ్‌లో పాల్గొనబోతున్నారు. ఆయన షెడ్యూల్ తర్వాత పొల్లాచ్చిలో షూటింగ్ జరుగుతుంది. ఆతర్వాత షెడ్యూల్‌ను మాత్రం పూర్తిగా చైనాకే కేటాయించారట. చైనీయుల సినిమా, అక్కడ ఉన్న వేల థియేటర్లు... ఈమధ్య కాలంలో ఇండియన్ సినిమాలకు అక్కడ పెరుగుతున్న ఆదరణ... ఇవన్నీ గమనించి సైరా చిత్రాన్ని చైనాకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. రూ.200 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రం కమర్షియల్ హిట్‌గా నిలిచేందుకు ఫిల్మ్‌మేకర్స్ అన్నివిధాలా ప్లాన్ చేస్తున్నారు.



అలీ, డా.బ్రహ్మానందం, టి.సుబ్బరామిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్

కళల్లో ఈశ్వరత్వం ఉంటుంది

పద్మశ్రీ అవార్డు గ్రహీత డా.బ్రహ్మానందం 1100 చిత్రాల్లో కమేడియన్‌గా నటించి ప్రేక్షకులను మెప్పించారు. పలువురు స్టార్ హీరోలతో కలిసి ఎన్నో హిట్ సినిమాల్లో నటించి అలరించారు. ఈ నేపథ్యంలో బ్రహ్మానందంకు 'హాస్య నటబ్రహ్మ' అనే బిరుదును కాకతీయ కళా వైభవ మహోత్సవంలో ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ " కాకతీయుల ఖ్యాతిని తెలియజేయాలనే ఉద్దేశ్యంతో కాకతీయ లలిత కళాపరిషత్తు ఆధ్వర్యంలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో వైభవంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ఈనెల 11న మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించే కాకతీయ కళావైభవ మహోత్సవంలో స్టార్ కమేడియన్ డా.బ్రహ్మానందంను 'హాస్య నటబ్రహ్మ' బిరుదుతో ఘనంగా సత్కరిస్తున్నాము. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి, మాజీ కేంద్ర మంత్రి ఎస్.జైపాల్ రెడ్డి, గౌరవ అతిథులుగా జూపల్లి కృష్ణారావు, డా.సి.లక్ష్మారెడ్డి పాల్గొంటారు. ఈ వేడుకకు పార్లమెంట్ సభ్యులు ఎ.పి.జితేందర్ రెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ హాజరవుతారు"అని అన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ "బ్రహ్మానందం గొప్ప నటుడు. తెలుగు ప్రేక్షకులు ఆయనను ఎప్పటికీ మరచిపోలేరు. కళాకారులు, కవులు, నటులకు కుల, మత, ప్రాంతీయ బేధాలుండవు. మహబూబ్‌నగర్‌లో జరిగే కార్యక్రమాన్ని కనివినీ ఎరుగని రీతిలో సక్సెస్ చేస్తాం"అని తెలిపారు. అలీ మాట్లాడుతూ "కళాకారులంటే నటరాజుకు చాలా ఇష్టం. ఆ నటరాజు సుబ్బరామిరెడ్డి రూపంలో వచ్చారు. 1100 సినిమాలు పూర్తిచేసుకున్న మా అన్న బ్రహ్మాందంను మంచి బిరుదుతో సత్కరించడం గొప్ప విషయం"అని చెప్పారు. డా.బ్రహ్మానందం మాట్లాడుతూ "కళలకు ఎల్లలు లేవు. కళల్లో ఈశ్వరత్వం ఉంటుంది. అలాంటి ఈశ్వరుడిని పూజించే సుబ్బరామిరెడ్డి ఈ అవార్డుల వేడుకను నిర్వహిస్తుండడం గొప్ప విషయం"అని అన్నారు.

23న వస్తున్న 'ఆనందం'

ప్రతి క్షణాన్ని ఆనందంగా గడపాలని ప్రతి ఒక్కరి మనస్సులోనూ ఉంటుంది. జీవితంలో మిగిలిన రోజుల సంగతి ఎలా ఉన్నా... కాలేజీలో, క్యాంపస్‌లో సరదాగా గడిపే క్షణాలు మాత్రం ఆనందానికి కేరాఫ్ అడ్రస్‌లు. ప్రతి ఒక్కరూ తమ కాలేజ్ డేస్‌లో ఆస్వాదించిన ఆనందాన్ని మరలా ఓసారి తెరమీద చూపించడానికి సన్నాహాలు చేస్తున్నారు సుఖీభవ మూవీస్ అధినేత ఎత్తరి గురురాజ్. మలయాళంలో సూపర్‌డూపర్ హిట్ అయిన 'ఆనందం' చిత్రాన్ని అదే పేరుతో ఆయన తెలుగు ప్రేక్షకులకు ఈనెల 23న అందించనున్నారు. మలయాళ ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టిన ఈ చిత్రానికి గణేశ్‌రాజ్ దర్శకత్వం వహించారు. కేరళ స్టార్ హీరో నివిన్ పాల్ ఇందులో గెస్ట్ రోల్ చేశారు. మిగిలిన నటీనటులందరూ దాదాపుగా కొత్తవారే. తెలుగులో అనువాదమవుతున్న 'ఆనందం' చిత్రానికి వీరా వెంకటేశ్వరరావు, విఆర్‌బి రాజు, రవివర్మ చిలువూరి సహ నిర్మాతలు. సీనియర్ నిర్మాత ఆర్.సీతారామరాజు సమర్పిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత ఎత్తరి గురురాజ్ మాట్లాడుతూ "ఈ చిత్రం అనువాద పనులు దాదాపుగా పూర్తయ్యాయి. సినిమా తుది మెరుగులు దిద్దుకుంటోంది. ఈనెల 17న పాటల వేడుకను గ్రాండ్‌గా నిర్వహిస్తాం. కేరళలో టాప్ మ్యూజిక్ డైరెక్టర్లలో ఒకరైన సచిన్ వారియర్ స్వరాలకు వనమాలి అద్భుతమైన సాహిత్యాన్ని అందించారు. ఈనెల 23న సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. నాలుగు రోజుల ఇండస్ట్రియల్ టూర్‌లో జరిగే మూడు ప్రేమ జంటల కథే మా సినిమా "అని అన్నారు. అరుణ్ కురియన్, థామస్ మాథ్యూ, రోషన్ మాథ్యూ, విశాక్ నాయర్, సిద్ధి మహాజనకుట్టి, అన్ను ఆంటోని, అనార్కళి మరికర్, నివిన్ పాల్, రెంజి ఫణిక్కర్ నటించిన ఈ చిత్రానికి కెమెరాః ఆనంద్, ఇ.చంద్రన్, సంగీతంః సచిన్ వారియర్, పాటలుః వనమాలి, మాటలుః ఎం.రాజశేఖర రెడ్డి.



సిద్ధి మహాజనకుట్టి, అరుణ్ కురియన్

సైబర్ క్రైమ్ నేపథ్యంలో...

ఇంద్రనీల్ సేన్ గుప్తా, జారాషా, అభిషేక్, కర్తవ్య శర్మ, నీరజ్, మృణాల్, మృదాంజలి కీలక పాత్రధారులుగా రాజ్ మాదిరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఐతే 2.ఓ'. ఫర్మ్ 9 పతాకంపై కె.విజయరామరాజు, హేమంత్ వల్లపురెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈనెల 16న ఈ సినిమా విడుదలకానుంది. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ "పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో నేడు సైబర్ క్రైమ్ ఎలా చేస్తున్నారనే విషయాలను చూస్తూనే ఉన్నాం. ఈ కథాంశంతో 'ఐతే 2.ఓ' చిత్రాన్ని రూపొందించారు. ఈ సినిమా పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను"అని తెలిపారు. దర్శకుడు రాజ్ మాదిరాజు మాట్లాడుతూ "ఈ సినిమాకు సంబంధించిన యుఎస్ రైట్స్‌ను ఫ్యాన్సీ రేటుకు దక్కించుకున్నారు. ఈ సమయంలో మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ చేతుల మీదుగా మా సినిమా థియేట్రికల్ ట్రైలర్ విడుదల కావడం ఆనందంగా ఉంది. ఈనెల 16న సినిమాను విడుదల చేస్తున్నాం"అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్మాతల్లో ఒకరైన కె.విజయరామరాజుతో పాటు చిత్ర బృందం పాల్గొంది. ఈ చిత్రానికి కెమెరాః కౌశిక్ అభిమన్యు, ఎడిటింగ్ః కార్తీక్ పల్లె, మాటలు, పాటలుః కిట్టు విస్సాప్రగడ, సంగీతంః అరుణ్ చిలువేరు.



'ఐతే 2.ఓ' థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్. చిత్రంలో రాజ్ మాదిరాజ్, కె.విజయరామరాజు.




వధూవరులు సి.తేజ, నాగశ్రీ విద్యలతో బాలకృష్ణ, సి.కళ్యాణ్

కన్నులపండువగా వివాహ మహోత్సవం

ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్ కుమారుడు సి.తేజ వివాహం నాగశ్రీ విద్యతో అంగరంగ వైభవంగా జరిగింది. హైదరాబాద్ మాదాపూర్‌లోని ఇమేజ్ గార్డెన్స్‌లో గురువారం రాత్రి జరిగిన ఈ వివాహ వేడుకలో సినీ ప్రముఖులు చిరంజీవి దంపతులు, బాలకృష్ణ, గోపీచంద్, మంచు విష్ణు, మంచులక్ష్మి, డి.సురేష్‌బాబు, రాజశేఖర్, జీవిత, కోడిరామకృష్ణ, సప్తగిరి, ఆర్.నారాయణమూర్తి, సాయి కుమార్, ఎ.రమేష్ ప్రసాద్, శ్రీనువైట్ల, జయసుధ తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

'చల్ చల్ గుర్రం' అంటున్న రవిశంకర్



రవిశంకర్

'రాజరథం' నుండి ముచ్చటగా మూడో పాట 'చల్ చల్ గుర్రం' నేడు విడుదలైంది. పలు విశేషాలతో ఆకర్షిస్తున్న ఈ చిత్రం ఇప్పుడు ఈ పాటతో సినిమాపై అంచనాలను పెంచేసింది. పలు సినిమాల్లో ఎంతో మందికి డబ్బింగ్ చెప్పిన ప్రముఖ నటుడు రవిశంకర్ తొలిసారి 'రాజరథం'లో తాను పోషిస్తున్న అంకుల్ పాత్ర కోసం 'చల్ చల్ గుర్రం' పాట పాడారు. ఈ పాటను మహాబలేశ్వర్, పూణేలోని మాల్షెజ్ ఘాట్ వంటి అందమైన ప్రదేశాలలో అందంగా చిత్రీకరించారు. దర్శకుడు అనూప్‌భండారి సహజమైన మంచు కోసం మాల్షెజ్ ఘాట్‌ను ఎంచుకున్నారు. దిలీప్‌రాజ్ ప్రత్యేకంగా డిజైన్ చేసిన పాతకాలపు సైడ్ కార్ ఉండే స్కూటర్ ఈ పాటకు అదనపు ఆకర్షణ. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాట అనూప్ భండారీ వీనులవిందైన సంగీతంతో శ్రోతలను అలరిస్తోంది. బోస్కోసీజర్ నృత్య దర్శకత్వంలో ఈ పాట తెరకెక్కింది. జాలీహిట్స్ నిర్మాణంలో తెరకెక్కిన 'రాజరథం' ఈనెల 23న విడుదలకానుంది.

కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేదు



ఆర్.కె.గౌడ్, ఆర్.నారాయణమూర్తి

"చిత్ర పరిశ్రమలో బంద్ అనేది బ్రహ్మాస్త్రంవంటిది. అలాంటి బ్రహ్మాస్త్రాన్ని ఉపయోగించి తెలుగు ఫిలిం ఛాంబర్ వారు ఏం సాధించారో అర్థం కావడం లేదు. కొండను తవ్వి కనీసం ఎలుకను కూడా పట్టలేదు" అంటూ తెలుగు ఫిలిం ఛాంబర్‌పై విరుచుకుపడ్డారు ఆర్.నారాయణమూర్తి. డిజిటల్ సర్వీస్ ఛార్జీలు తగ్గించాలంటూ సౌతిండియన్ ఫిలిం ఇండస్ట్రీ అంతా ఒక్క తాటిమీదకొచ్చి ఈనెల 2వ తేదీ నుండి సినిమా థియేటర్లు బంద్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లతో తెలుగు ఫిలిం ఛాంబర్ వారు సుదీర్ఘ చర్చలు జరిపిన అనంతరం థియేటర్ల బంద్‌ను విరమింపచేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఏర్పాటైన విలేకరుల సమా వేశంలో నటుడు, నిర్మాత, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ "తమిళం, మలయాళం, కన్నడ భాషల చిత్ర పరిశ్రమల్లో ఇంకా థియేటర్ల బంద్ కొనసాగుతుంటే మన తెలుగు ఫిలిం ఛాంబర్ వారు అప్పుడే బంద్‌ను ఎందుకు ఆపాల్సి వచ్చింది. ఐదేళ్ల తర్వాత ఫ్రీగా సర్వీస్ చేస్తామంటూ డిజిటల్ ప్రొవైడర్లు ఇచ్చిన హామీ అమలు కాకముందే హఠాత్తుగా బంద్ విరమించుకున్నారు. ఈ బంద్ వల్ల సినీ కార్మికులు ఇబ్బంది పడ్డారు తప్ప ఒరిగిందేమీ లేదు. అయినా కూడా నిర్మాతలకు మంచి జరుగుతుందనే ఉద్దేశంతో అందరూ సహకరించారు. అలాగే ప్రజలు కూడా ఈ బంద్‌కు ఎంతగానో సహకరించడం జరిగింది. కానీ కొందరి స్వార్థం, ప్రయోజనాల కోసం బంద్‌ని హఠాత్తుగా నిలిపివేశారు. ఈ బంద్ వల్ల సాధించింది ఏమిటి? దీనికోసమైతే సురేష్‌బాబు, జెమిని కిరణ్, అల్లు అరవింద్ వంటి పెద్దలు బంద్ వరకు వెళ్లకుండా ముందే మాట్లాడి సెటిల్ చేస్తే సరిపోయేది కదా. థియేటర్ల బంద్ వరకు వెళ్లాల్సిన పనేంటి. గతంలో కూడా థియేటర్ల లీజులు, డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల మీద ఎన్నో పోరాటాలు, నిరాహార దీక్షలు చేశాం. కానీ ఐక్యత లేకపోవడం వల్ల ఏమీ సాధించలేకపోయాం. ఇప్పుడు కూడా సక్సెస్ కాలేకపోయాం. ఇకనైనా రెండు తెలుగు రాష్ట్రాల సినిమాటోగ్రఫీ మంత్రులు ఈ విషయంలో జోక్యం చేసుకొని చిన్న చిత్రాల నిర్మాతలకు న్యా యం చేయాలని కోరుకుంటున్నాం. రూ.2000, రూ.2500కు డిజిటల్ సర్వీస్‌లు అందజేస్తామంటూ నూతన కంపెనీలు వస్తున్నా వారిని ఎందు కు రానీయడం లేదు. కొత్తవారికి అవకాశం ఇస్తే ఖచ్చితంగా క్యూబ్, యుఎఫ్‌ఓ వాళ్లు దిగిరాక మానరు" అని అన్నారు. తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ "పదేళ్లుగా డిజిటల్ వ్యవస్థ మీద పోరాడుతున్నాం. పెద్దల సహకారం లేక మేము సక్సెస్ కాలేకపోయాం. డిజిటల్ సర్వీస్‌లను ఫ్రీగా ఇచ్చే వరకు థియేటర్ల బంద్‌ను ఆపబోమని చెప్పి ఇప్పుడు రెండు వేల రూపాయలు తగ్గించగానే బంద్‌ను ఆపేశారు. ఇది కాదు మేము కోరుకున్నది. మొత్తం ఫ్రీగా ఇవ్వాలి లేదా ఇప్పుడున్న కంపెనీలు తప్పుకుంటే కొత్త కంపెనీలతో ముందుకెళ్తాం. చాలా కంపెనీలు తక్కువ రేటుకే డిజిటల్ సర్వీస్‌లను అందజేస్తామంటూ ముందుకొస్తున్నాయి. వారిని ప్రోత్సహించాలి. దీనిపై తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు జోక్యం చేసుకొని అందరికీ మంచి జరిగేలా చూడాలని కోరుకుంటున్నాం"అని తెలిపారు.

తన మొదటి సినిమా షూటింగ్‌లో...



'ధడక్' షూటింగ్‌లో జాన్వీకపూర్

తల్లి శ్రీదేవి మరణించిన శోకాన్ని దిగమింగుకొని రెండు రోజుల క్రితం తన పుట్టిన రోజును జరుపుకుంది జాన్వీ కపూర్. ఇప్పుడు ఆమె తాను హీరోయిన్‌గా పరిచయమవుతున్న బాలీవుడ్ మూవీ 'ధడక్' సినిమా షూటింగ్‌లో శుక్రవారం నుంచి పాల్గొంటోంది. ముంబయ్ బాం ద్రా కార్డర్ రోడ్డులోని ఒక ఇంట్లో జరిగిన షూటింగ్‌లో హీరో ఇషాన్ కట్టర్‌తో కలిసి ఆమె పాల్గొంది. శశాంక్ ఖైతాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ ఇప్పటికే 75 శాతం షూటింగ్ పూర్తిచేసుకుంది. ముం దుగా ప్లాన్ చేసిన ప్రకారం జూన్ నెలలో 'ధడక్' విడుదలకానుంది. కరణ్ జోహార్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ మూవీపై శ్రీదేవి మరణం తర్వాత అంచనాలు మరింతగా పెరిగిపోయా యి. ఇక తన కూతురు మొదటి సినిమా విడుదలను చూడకుండానే శ్రీదేవి కన్నుమూయడంతో ఈ చిత్రం కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే తన మొదటి చిత్రం విడుదల తర్వాతే రెండవ సినిమా గురించి జాన్వీకపూర్ ఆలోచిస్తుందట.



ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్‌కు ఆర్‌బిఐ రూ.5 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ: ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్‌పై ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) రూ.5 కోట్ల జరిమానా విధించింది. కెవైసి(నో యువర్ కస్టమర్) నిబంధనలు, నిర్వహణా మార్గదర్శకాలను ఉల్లంఘించినందుకు గాను రిజర్వు బ్యాంక్ ఈ చర్యలు చేపట్టింది. కస్టమర్ల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా, సమాచారం ఇవ్వకుండా పేమెంట్ ఖాతాలను తెరించిందని ఆర్‌బిఐ పరిశీలనతో తేలింది. దీంతో ఆర్‌బిఐ జరిమానా నిర్ణయం తీసుకుంది. ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ వినియోగదారుల అనుమతి లేకుండానే ఖాతాలు తెరిచిందనే ఆరోపణలతో మీడియా కథనాలు, పలువురి ఫిర్యాదులు చేయడంతో గతేడాది నవంబర్‌లో ఆర్‌బిఐ విచారణ చేపట్టింది. అందిన సమాచారం ప్రకారం, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ దాదాపు 23 లక్షలకు పైగానే కస్టమర్లను చేర్చుకుని.. వారి ఖాతాల్లో రూ.47 కోట్లను బదిలీ చేసింది. బ్యాంకు ప్రత్యుత్తరం, వ్యక్తిగత విచారణలు పరిశీలించిన తరువాత బ్యాంకుపై వచ్చిన ఆరోపణలు వాస్తవమని తేలిందని రిజర్వు బ్యాంక్ తెలిపింది. జనవరి 15న బ్యాంకుకు దీనిపై ఆర్‌బిఐ షోకాజ్ నోటీసులను జారీ చేసింది. తమకు తెలియకుండా ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకు ఖాతాలు తెరవడంపై 23 లక్షల మంది కస్టమర్ల ఆందోళనకు దారి తీసింది.

మళ్లీ నష్టాల్లో మార్కెట్లు



ముంబై: మళ్లీ దేశీయ స్టాక్‌మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. క్రితం రోజు వారం రోజుల నష్టాలకు బ్రేక్ పడిన తర్వాత మరుసటి రోజు మళ్లీ సూచీలు నేలచూపులు చూశాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 44 పాయింట్లు క్షీణించి 33,307 వద్ద ముగిసింది. నిఫ్టీ 16 పాయింట్లు తక్కువగా 10,227 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 33,519 నుంచి 33,256 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. ఎన్‌ఎస్‌ఇలో మెటల్, పిఎస్‌యు బ్యాంక్ సూచీలు 2 శాతం చొప్పున పతనమయ్యాయి. ఫార్మా, ప్రైవేట్ బ్యాంక్స్ 1 శాతం నీరసించగా, ఐటి 0.5 శా తం, ఎఫ్‌ఎంసిజి 0.25 శాతం పుంజుకున్నాయి. ప్రధానంగా టెక్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, టిసిఎస్, ఐషర్, జి, హెచ్‌డిఎఫ్‌సి, ఐటిసి, హెచ్‌యుఎల్, అరబిందో, ఇన్ఫోసిస్‌లు లాభపడ్డాయి. అయితే టాటా స్టీల్, యాక్సిస్, అదానీ పోర్ట్స్, యస్‌బ్యాంక్, సన్ ఫార్మా, పవర్‌గ్రిడ్, అల్ట్రాటెక్, ఎస్‌బిఐ, హెచ్‌పిసిఎల్, ఐసిఐసిఐ నష్టపోయాయి. బిఎస్‌ఇలో మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.3 శాతం బలహీనపడ్డాయి. ట్రేడైన మొత్తం షేర్లలో 1585 లాభపడగా.. 1136 షేర్లు నష్టపోయాయి. అమెరికాలో వడ్డీ రేట్ల పెంపు అంచనాలతో దేశీ స్టాక్స్‌లో అమ్మకాలకే ప్రాధాన్యమిస్తున్న ఎఫ్‌పిఐ(విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు) నగదు విభాగంలో గురువారం రూ.365 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకు న్నారు. దేశీ ఫండ్స్(డిఐఐలు) రూ.675 కోట్లకుపైగా ఇన్వెస్ట్ చేశాయి.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	33307.14	–44.43	–0.13%
నిఫ్టీ	10226.85	–15.80	–0.15%



కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	63.28
యూరో	76.12
బ్రిటిష్ పౌండ్	85.87
ఆస్ట్రేలియన్ డాలర్	49.75
కెనెడియన్ డాలర్	50.98
ఎమిరైట్ దిర్హామ్	17.23
స్విస్ ఫ్రాంక్	64.89
చైనీస్ యువాన్	9.75
మలేషియన్ రింగిట్	15.83
న్యూజిలాండ్ డాలర్	45.36
హాంగ్‌కాంగ్ డాలర్	8.09
జపనీస్ యెన్	0.56
కువైట్ దినార్	209.96
సౌతాఫ్రికన్ రాండ్	5.14

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	29050	31069.52	0.1%
ముంబై	29940	32021.39	0%
ఢిల్లీ	29800	31871.66	0%
కోల్‌కతా	30060	32149.73	0%
కేరళ	28200	30160.43	–0.35%
బెంగళూరు	28600	30588.24	0%
హైదరాబాద్	29020	31037.43	–0.45%
గల్ఫ్	1402.73	1500.25	–0.65%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	41500.00	41800.00	–0.72
ముంబై	41500.00	41800.00	–0.72
ఢిల్లీ	41500.00	41800.00	–0.72
కోల్‌కతా	41500.00	41800.00	–0.72
హైదరాబాద్	41500.00	41800.00	–0.72



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	345	విశాఖపట్నం	335
వరంగల్	347	చిత్తూరు	378
విజయవాడ	328	చెన్నై	385
గోదావరి	328	బెంగళూరు	375

పెరిగిన ఎగవేతదారులు

- డిసెంబర్ ముగింపునాటికి 1.7 శాతం పెరిగిన సంఖ్య
- పిఎస్‌యు బ్యాంకుల్లో రూ. లక్ష కోట్లకు పైనే మొండిబకాయిలు: కేంద్రం

న్యూఢిల్లీ: రుణాలను చెల్లించకుండా తప్పించుకుని తిరుగుతున్న ఉద్దేశపూర్వక ఎగవేతదారుల సంఖ్య పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2017–18) ఏప్రిల్ నుంచి డిసెంబర్ నాటికి ఎగవేతదారుల సంఖ్య 9,063 మందితో 1.66 శాతం పెరిగిందని ప్రభుత్వం వెల్లడించింది. వీరు ఎగవేసిన రుణాల మొత్తం రూ.1,10,050 కోట్లు(1.1 ట్రిలియన్లు) ఉంటుందని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి ప్రతాప్ శుక్లా లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు. తొమ్మిది నెలల వ్యవధిలో ఉద్దేశపూర్వక ఎగవేతదారుల సంఖ్య 9,063 మందితో 1.66 శాతం పెరిగిందని ఆయన చెప్పారు. ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) మార్గదర్శకాల మేరకు ఎగవేతదారులపై క్రిమినల్ చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఉద్దేశపూర్వక ఎగవేతదారుల కంపెనీలపై మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ కూడా ఆంక్షలు విధించిందని, క్యాపిటల్ మార్కెట్ల నుంచి నిధుల సేకరణలో ప్రమోటర్లపై నిబంధనలు విధించిందని అన్నారు. 2017 డిసెంబర్ 31 నాటికి ప్రభుత్వరంగ బ్యాంకులు దాదాపు 2,108 మంది మొండి బకాయిదారులపై ఎఫ్ఐఆర్, 8,462 మందిపై దావా వేసిందని శుక్లా వెల్లడించారు. 2016 మార్చి ముగింపునాటికి ప్రభుత్వరంగ బ్యాంకులు రూ. 2,30,287 కోట్ల రుణాలను రద్దు చేశాయని మరో ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు.



అచేతన స్థితిలో బ్యాంకింగ్ వ్యవస్థ : కోటక్ మహీంద్ర ఎండి ఉదయ్ కోటక్

భారత్ బ్యాంకింగ్ వ్యవస్థ అచేతన స్థితిలో ఉందని, దేశానికి సమర్థవంతమైన ఆర్థిక వ్యవస్థ అవసరమని కోటక్ మహీంద్రా ఎండి ఉదయ్ కోటక్ పేర్కొన్నారు. ప్రస్తుత బ్యాంకింగ్ వ్యవస్థ సరిదిద్దాల్సి ఉందని, ఇలాంటి సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. దేశ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణం.. రూ.13 వేల కోట్ల పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం వెలుగు చూసిన నేపథ్యంలో ఈయన ఈ వ్యాఖ్యలు చేశారు. అదే సమయంలో ప్రభుత్వరంగ బ్యాంకులను తగ్గించాల్సిన అవసరం ఉందని అన్నారు.





దిగివస్తోన్న బంగారం ధర

న్యూఢిల్లీ : డిమాండ్ మందగించడంతో బంగారం ధర దిగివస్తోంది. శుక్రవారం నాడు పది గ్రా ముల పసిడి ధర రూ.100 తగ్గి రూ.31,350కి చేరింది. అంతర్జాతీయంగా బలహీన సంకేతాలు, దేశీయంగా నగల వ్యాపారుల నుంచి కొనుగోళ్లు ఆశించినంతగా లేకపోవడంతో బంగారం స్వ ల్పంగా తగ్గింది. అయితే బంగారం బాటలోనే వెండి ధర కూడా పయనిస్తోంది. కిలో వెండి ధర రూ.115 తగ్గి రూ.39,385కు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 0.27 శాతం తగ్గి 1,318 డాలర్లకు చేరింది. ఔన్సు వెండి ధర 0.21శాతం తగ్గి 16.43 డాలర్లుగా ఉంది. నాణేల తయారీదారులు, పారిశ్రామిక వర్గాల నుంచి డిమాండ్ తగ్గడంతో వెండి ధర కూడా స్వల్పంగా పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లోనూ పసిడి, వెండి ధరలు తగ్గాయి.

మరింత బాధ్యతతో ప్రజలకు చేరువ కావాలి

- బ్యాంకులు సామర్థ్యం పెంచుకోవడంపై దృష్టి పెట్టాలి
- బంధన్ బ్యాంక్ చీఫ్ చంద్రశేఖర్ ఘోష్



న్యూఢిల్లీ: వచ్చే వారంలో ప్రైవేటు సంస్థ బంధన్ బ్యాంక్ ఐపిఒ(ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్)కు రానుంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)లో రూ.13 వేల కోట్ల కుంభకోణం, ఇతర కార్పొరేట్ రుణ ఎగవేతదాలు వంటి ఉదంతాలు ఈ ఐపిఒకు సవాల్‌గా మారాయి. ఇలాంటి పరిస్థితుల్లో బంధన్ బ్యాంక్ చీఫ్ చంద్రశేఖర్ ఘోష్ మాట్లాడుతూ, బ్యాంకులు సామర్థ్యం పెంపొందించుకోవడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. డబ్బు కంటే ప్రజలకు బాధ్యతాయుతమైన సేవలను అందించడంపై దృష్టి పెట్టాలని అన్నారు. కోల్‌కతాకు బంధన్ బ్యాంక్ ఐపిఒ ఈ నెల 15న ప్రారంభమై 19న ముగియనుంది. ఇటువంటి సమయంలో ఐపిఒ ప్రకటన చేసిన బ్యాంక్ ఎండి చంద్రశేఖర్ ఘోష్‌కు క్లిష్టమైన పరిస్థితి అని అంతా భావిస్తున్నారు. అయితే పిఎన్‌బి స్కామ్‌ను మొత్తం బ్యాంకింగ్ రంగానికి ఆపాదించి చూడాల్సిన అవసరం లేదని ఘోష్ అన్నారు. ఈ కుంభకోణం కేవలం ఆ బ్యాంకుకు మాత్రమే పరిమితమని అన్నారు. ఇక్కడ ప్రైవేట్, ప్రభుత్వ బ్యాంక్ అన్న అంశం ముఖ్యం కాదని, ఈ రంగంలో పాలన మరింత పటిష్టంగా ఉండాల్సిన అవసరం ఉందని ఓ వార్తా చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన అన్నారు. అన్ని బ్యాంకులు ఇదే తీరుగా ఉంటాయని తాను భావించడం లేదని, ప్రైవేటు బ్యాంకుల కంటే ప్రభుత్వ బ్యాంకులే మెరుగనే విషయం అనేక సందర్భాలలో వెల్లడయ్యిందని పేర్కొన్నారు. వ్యవస్థను సరిచేయడం, జరిగిన నష్టం నుంచి ఎంత త్వరగా కోలుకవడమే ఇప్పుడు ప్రధానమని అన్నారు. బ్యాంకులు కేవలం లాభాలపైన మాత్రమే కాకుండా సామర్థ్యాన్ని పెంపొందించడంపై దృష్టిసారించాల్సి ఉంటుందని అన్నారు. తమ ఐపిఒతో సమీకరించిన మొత్తం ద్వారా బ్యాంక్ వ్యాపారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు వివరించారు. ఈ ఐపిఒకు ధరల శ్రేణిని రూ.370–375గా నిర్ణయించారు. ఐపిఒ విలువ రూ.4,473 కోట్లు ఉండవచ్చని భావిస్తున్నారు. ఇటీవల ఐపిఒలకు వచ్చిన స్థానిక బ్యాంకుల్లో బంధన్ బ్యాంక్‌దే అత్యధికం కావడం విశేషం. కోటక్ మహీంద్రా క్యాపిటల్, యాక్సిస్ క్యాపిటల్, గోల్డ్‌న్ సాచస్, జేఎం ఫైనాన్షియల్స్, జేపీ మోర్గాన్‌లు ఐపిఒ మేనేజర్లుగా వ్యవహరించనున్నాయి. 2015లో వ్యాపారాన్ని ప్రారంభించిన బంధన్ బ్యాంక్.. చిన్నమొత్తాలను రైతులకు రుణాలుగా అందజేస్తుంది.

స్టీలుపై దిగుమతి సుంకం పెంపు

ప్రతిపాదనలపై సంతకం చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్



వాషింగ్టన్ : వివాదాస్పద నిర్ణయాలతో ఇతర దేశాలను భయపెడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ తాజాగా స్టీలు, అల్యూమినియంపై దిగుమతి సుంకం పెంచే ప్రతిపాదనలపై సంతకం చేశారు. దీంతో ప్రపంచ వాణిజ్య యుద్ధానికి తెర లేచినట్టయింది. కెనడా, మెక్సికో మినహా ఇతర దేశాల నుంచి దిగుమతి అయ్యే స్టీలుపై 25 శాతం సుంకం, అల్యూమినియంపై 10 శాతం సుంకం విధించారు. ఈమేరకు రెండు ప్లొక్లేమేషన్‌పై ట్రంప్ సంతకం చేశారు. సరికాని వ్యాపార విధానాల వల్ల అమెరికా పరిశ్రమ మందగిస్తోందని, దిగుమతి సుంకం అమెరికా పరిశ్రమకు ఎంతో అవసరమని ఆయన అన్నారు. ఈ వివాదాస్పద సుంకం 15 రోజుల్లో అమల్లోకి రానుంది. ఇది ఎంతో కీలకమైంది.. స్టీలు లేకపోతే దేశంలో మనుగడ లేదు, చాలా ఏళ్లుగా అమెరికా పరిశ్రమలు అవస్థలు పడుతున్నాయని, దీనికి సరైన వ్యాపార విధానాలను అవలంభించకపోవడమే కారణమని ట్రంప్ అన్నారు. తగిన విధానాలు చేపట్టకపోవడం కారణంగానే ప్లాంట్లు, మిల్లులు మూతపడ్డాయని, తమ దేశంలో లక్షలాది ఉద్యోగాలు పోయాయని, దీనిని ఆపాల్సి ఉందని ఆయన అన్నారు. 'గత పాలకుల తప్పుడు విదేశీ విధానాలతో ఆర్థిక వ్యవస్థ కుంటుపడడమే కాదు.. ఇది ఆర్థిక భద్రతకు ముప్పుగా మారింది. అమెరికా ఆర్థిక భద్రతను కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ట్రంప్ అన్నారు. 'మా నౌకలు, విమానాలు మా స్టీలు, అల్యూమినియంతోనే తయారు చేస్తాం. మా మిలిటరీ పరికరాలను మేం తయారుచేసుకుంటాం. చాలా ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నాం' అని అన్నారు. స్టీలు, అల్యూమినియం దిగుమతి సుంకం నుంచి మినహాయింపు ఇవ్వనట్లయితే అమెరికా వాణిజ్య ప్రతినిధులతో చర్చలు నిర్వహించాలని ఇతర దేశాలు భావిస్తున్నాయి.

వాణిజ్య సంబంధాలు దెబ్బతింటాయి: ప్రపంచ దేశాలు స్టీల్, అల్యూమినియం దిగుమతులపై అమెరికా సుంకాలను పెంచడం పట్ల ప్రపంచ దేశాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఇది ఎంతో విచారకరమని, ఈ నిర్ణయంతో అమెరికాతో ఉన్న వాణిజ్య సంబంధాలు దెబ్బతినే అవకాశమున్నాయని పలు దేశాలు పేర్కొన్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ఇది ప్రభావం చూపుతుందని జపాన్, ఫ్రాన్స్ వంటి దేశాలు అభిప్రాయపడ్డాయి. వాణిజ్య సమస్యల పరిష్కారానికి ఇది సరైన మార్గం కాదని బ్రిటన్ పేర్కొంది. అమెరికా సుంకాల నుంచి యూరోపియన్ యూనియన్‌కు మినహాయింపు కల్పించాలని అభిప్రాయపడింది. అయితే ట్రంప్ మరో ఆఫర్ కూడా ఇచ్చారు. దిగుమతి సుంకాల నుంచి మినహాయింపు కోరుకునే దేశాలు చర్చలకు రావాలని ఆహ్వానించారు. దేశాలతో చర్చలు జరిపి సుంకం రేట్లలో మార్పులు చేయడానికి మేం సిద్ధంగా ఉన్నామని, అయితే తమ దేశ భద్రతకు ముప్పు కాదని నమ్మకం కలిగినప్పుడు మాత్రమేనని ట్రంప్ అన్నారు.

భారత్, చైనాపై పరస్పర పన్ను విధిస్తాం



స్టీలు, అల్యూమినియంపై దిగుమతి సుంకం విధించిన ట్రంప్ ఈ సందర్భంగా భారత్, చైనాలను ఉద్దేశించిన హెచ్చరికలు చేశారు. అమెరికా దిగుమతి సుంకాన్ని వ్యతిరేకించినట్లయితే చైనా, భారత్ వంటి దేశాలపై పరస్పర పన్ను(రెసిప్రోకల్ టాక్స్) విధిస్తామని అన్నారు. ఇటీవల అమెరికా కంపెనీ హర్లే డేవిడ్సన్ బైక్‌లపై భారత్‌లో విక్రయాలపై సుంకం పెంచడం పట్ల ట్రంప్ పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత్ నుంచి దిగుమతి చేసుకునే ద్విచక్ర వాహనాలపై అమెరికా ఎలాంటి పన్ను విధించడం లేదని ఆయన గుర్తుచేశారు. ఇంతలోనే స్టీలుపై పన్ను పెంపు నిర్ణయం తీసుకున్నారు. భారత్, చైనా దేశాలు తమ ఉత్పత్తులపై 75 శాతం, 25 శాతం పన్ను విధిస్తే తాము అంతే మొత్తంలో పన్ను విధిస్తామని, ఇదే పరస్పర పన్ను అని అన్నారు.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
టెక్ మహీంద్ర	623.10	606.50	619.20	607.20	12.00	1.98
బజాజ్ ఫైనాన్స్	1,667.20	1,616.45	1,654.20	1,628.05	26.15	1.61
హెచ్‌డిఎఫ్‌సి	1,834.30	1,801.00	1,818.60	1,798.75	19.85	1.10
టిసిఎస్	3,063.20	2,977.20	3,034.10	3,003.95	30.15	1.00
ఐచర్ మోటార్స్	28,065.00	27,660.45	27,963.85	27,711.85	252.00	0.91
ఐటిసి	386.50	380.60	385.50	382.10	3.40	0.89
జీ ఎంటర్‌టైన్	572.50	564.90	568.50	563.50	5.00	0.89
బోస్క్	18,255.00	18,040.20	18,203.55	18,094.80	108.75	0.60
భారతి ఎయిర్‌టెల్	338.10	328.85	333.15	331.20	1.95	0.59
హెచ్‌యుఎల్	1,303.00	1,286.10	1,300.75	1,293.15	7.60	0.59

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
టాటాస్టీల్	646.75	601.50	606.75	635.90	29.15	4.58
యాక్సిస్ బ్యాంక్	522.55	503.00	505.35	520.55	15.20	2.92
అదానీ పోర్ట్స్	393.65	373.80	377.90	387.95	10.05	2.59
ఎస్ బ్యాంకు	310.95	301.30	303.25	308.55	5.30	1.72
సన్‌ఫార్మా	519.90	505.00	506.80	514.60	7.80	1.52
ఐసిఐసిఐ బ్యాంకు	299.50	290.70	292.70	296.95	4.25	1.43
ఎస్‌బిఐ	257.40	251.65	253.25	256.80	3.55	1.38
వేదాంత	316.40	302.55	304.15	308.40	4.25	1.38
పవర్‌గ్రిడ్‌క కార్ప్	195.65	191.80	192.90	195.40	2.50	1.28
సిప్లా	585.20	568.05	571.05	578.00	6.95	1.20

బాలికలపై లైంగిక దాడికి మరణశిక్ష



జైపూర్: బాలికలపై అత్యాచారాలను అరికట్టేందుకు రాజస్థాన్ ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తెచ్చింది. 12 ఏళ్లు, అంతకన్నా తక్కువ వయస్సున్న బాలికలపై అత్యాచారం లేదా సామూహిక అత్యాచారానికి పాల్పడితే మరణశిక్ష విధించే బిల్లును శుక్రవారం శాసనసభ ఆమోదించింది. రాష్ట్ర హోంశాఖ మంత్రి గులాబ్ చాంద్ కటారియా క్రిమినల్ లా (రాజస్థాన్ సవరణ) బిల్లు2018ని ప్రవేశపెట్టగా, చర్చ అనంతరం బిల్లును మూజువాణి ఓటుతో శాసన సభ ఆమోదం తెలిపింది. భారత శిక్షాస్మృతి1860కి 376ఎఎ,376 డిడి సెక్షన్లను రాష్ట్రప్రభుత్వం జోడించింది. ఈ చట్టం ప్రకారం అత్యాచారం, సామూహిక అత్యాచారానికి పాల్పడితే 14 ఏళ్లు, 20ఏళ్ల తగ్గకుండా శిక్ష, అపరాధ రుసుముతోపాటు జీవిత ఖైదును విధించవచ్చు. రాజస్థాన్‌లో పిల్లలపై లైంగిక దాడులు పెరిగిపోవడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పిల్లలపై అత్యాచారానికి పాల్పడిన వారికి మరణ శిక్ష విధించేందుకు చట్టం చేసిన మొదటి రాష్ట్రం మధ్యప్రదేశ్ కాగా, రెండో రాష్ట్రం రాజస్థాన్ కావడం గమనార్హం.

అత్యంత సంపన్నం సమాజ్‌వాదీ

● ప్రాంతీయ పార్టీల్లో ఎస్‌పి అగ్రస్థానం ● రెండు, మూడు స్థానాల్లో డిఎంకె, ఎఐఎడిఎంకె ● అప్పుల్లో టిఆర్‌ఎస్, టిడిపి





న్యూఢిల్లీ : దేశంలోని 20 ప్రాంతీయ రాజకీయ పార్టీల్లో అత్యధిక ధనిక పార్టీగా సమాజ్‌వాది (ఎస్‌పి) అగ్రస్థానంలో నిలిచింది.ఆ తరువాత స్థానాల్లో వరుసగా డిఎంకె, ఎఐఎడిఎంకెలు ఉన్నాయి. ఈ మేరకు ఢిల్లీకి చెందిన అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రీఫార్మ్స్ (ఎడిఆర్) నివేదికను వెల్లడించింది. ప్రాంతీయ రాజకీయ పార్టీలు వెల్లడించిన ఆస్తుల వివరాలతో ఎడిఆర్ ఈ నివేదికను రూపొందించింది. దీని ప్రకారం...అఖిలేష్ యాదవ్‌కు చెందిన సమాజ్ వాది పార్టీ 2015–16 ఆర్థిక సంవత్సరంలో రూ.634.96 కోట్లతో అగ్రభాగాన ఉండగా, రూ.257.18 కోట్లతో డిఎంకె రెండవ స్థానంలోను, రూ.224.84 కోట్లతో మూడవ స్థానంలోను నిలిచాయి. ‘2011–12 ఆర్థిక సంవత్సరంలో ఎస్‌పి రూ.212.86 కోట్ల ఆస్తులుండగా, అవి 198 శాతం వృద్ధి చెంది 2015–16 సంవత్సరానికి రూ.రూ.634.96 కోట్లకు చేరాయి. అలాగే, 2011–12లో ఎఐఎడిఎంకె ఆస్తులు మొత్తం రూ.88.21 కోట్లు కాగా, అవి 2015–16 నాటికి 224.84 కోట్లు (68.77శాతం వృద్ధి) అయ్యాయి’ అని ఎడిఆర్ వెల్లడించింది. చరాస్తులు, రుణాలు, అడ్వాన్స్‌లు, డిపాజిట్‌లు, టిడిఎస్, పెట్టుబడులు, ఇతర ఆస్తులు వంటి ఆరు విభాగాల కింద ప్రాంతీయ పార్టీలు తమ ఆస్తులను వెల్లడించాయి. 2011–12 ఆర్థిక సంవత్సరంలో ప్రాంతీయ పార్టీలు డిపాజిట్లు కింద ఆస్తులను రూ.331.54 కోట్లు (మొత్తం ఆస్తుల్లో 68.77 శాతం)గా తెలియజేయగా, అవి 2015–16లోరూ.1054.80 కోట్ల (80.19 శాతం)కు చేరాయి, ‘అయితే ఆస్తుల విభాగంలో రుణాలు, అడ్వాన్సులతో తగ్గుదల కనిపించింది. 2011–12లో పార్టీలు రూ.19.75 కోట్లు పెట్టుబడులు పెట్టాయి’ అని ఎడిఆర్ పేర్కొంది. ఈ జాబితాలో చేరిన కొత్తగా చేరిన పార్టీల్లో 2011 మార్చిలో రిజిస్టర్ అయిన వైఎస్‌ఆర్ కాంగ్రెస్, 2012 నవంబర్‌లో ఏర్పడిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లు ఉన్నాయి. ఈ రెండు పార్టీ సగటు ఆస్తులు 2012–13లో 1.165 కోట్లు కాగా, 2015–16 నాటికి ఈ మొత్తం 3.765కు చేరింది. తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్‌ఎస్),తెలుగుదేశంపార్టీ (టిడిపి)లు అప్పుల్లో టాప్‌గా నిలిచాయి.

‘2015–16లో టిఆర్‌ఎస్ అప్పులు రూ.15.97 కోట్లు కాగా, 2011–12లో అసలు అప్పులే లేవు. ఇక అప్పుల్లో రెండో స్థానంలో నిలిచిన టిడిపికి రూ.8.1869 కోట్ల అప్పులున్నాయి’ అని ఎడిఆర్ తెలిపింది.కాగా 2015–16లో శివసేన అప్పులను తగ్గించుకుంది. ‘2013–14, 2014–15 సంవత్సరాల మధ్య ఈ పార్టీ తన అప్పులను 99.78 శాతం (22.21 కోట్లు) తగ్గించుకుంది. అయితే, టిడిపి 2014–15, 2015–16 మధ్య 259 శాతం(రూ.5.906 కోట్లు) అప్పుల్లో ఉంది. బ్యాంకులు, ఓవర్ డ్రాఫ్ట్, ఇతర రుణాలు తదితరాల ద్వారా తొమ్మిది పార్టీలు రుణాలు పొందాయి. అయితే, 2015–16 నాటికి వాటన్నింటినీ తీర్చేసుకున్నట్టు ప్రకటించాయి. మొత్తమ్మీద ప్రాంతీయ పార్టీల వద్ద ఉన్న రిజర్వు మొత్తం 2011–12 నాటికి రూ.434.635 కోట్లు కాగా, ఇది 20105–16 నాటికి రూ.1258.17 కోట్ల (189.48 శాతం వృద్ధి)కు పెరిగింది.

లంకేశ్ హత్య కేసులో సిట్ కస్టడీకి నిందితుడు

న్యూఢిల్లీ : జర్నలిస్ట్ గౌరీ లంకేశ్ హత్య కేసులో నిందితుడు టి నవీన్ కుమార్‌ను బెంగళూరు మేజిస్ట్రేట్ కోర్టు శుక్రవారం ఐదు రోజుల ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కస్టడీకి అప్పగించింది. హిందూ యువసేన నాయకుడైన నవీన్ కుమార్ అలియాస్ హొట్టె మధు, కర్నాటకలోని మాండ్య జిల్లా మద్దూరు నివాసి. నిందితుడి నుంచి 15 రౌండ్ల బుల్లెట్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు ఫిబ్రవరి 18న ఆయనను అరెస్ట్ చేశారు. గౌరీ శంకర్ హత్యకేసును విచారిస్తున్న సిట్ మార్చి2న నవీన్‌ను తమ కస్టడీలోకి తీసుకుని విచారిస్తోంది. గత ఏడాది సెప్టెంబర్ 5న బెంగళూరులో గౌరీ లంకేశ్‌ను దుండగులు కాల్చి చంపారు. ఆమెను హత్య చేసేందుకు నవీన్ కుమార్ వ్యూహ రచన చేశారని, గత ఏడాది సెప్టెంబర్ 3 నుంచి 5 వరకు ఆయన రెక్కి నిర్వహించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం



న్యూఢిల్లీ : తెలుగుదేశం పార్టీకి చెందిన కేంద్రమంత్రులు అశోక్ గజపతిరాజు, సుజనాచౌదరిల రాజీనామాలను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ శుక్రవారం ఆమోదించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సూచన మేరకు మంత్రుల రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం తెలిపినట్లు రాష్ట్రపతి కార్యాలయ అధికార ప్రతినిధి ఒకరు చెప్పారు. వారి రాజీనామా ఆమోదం తక్షణం అమల్లోకి వస్తుందన్నారు.కాగా,అశోక్ గజపతిరాజు పౌర విమానయాన మంత్రిగా ఉండగా, సుజనా చౌదరి శాస్త్ర సాంకేతికశాఖ మంత్రిగా సేవలందిస్తున్నారు. పౌర విమానయాన మం త్రిత్వశాఖ ప్రధాని చూసుకోవాల్సిందిగా రాష్ట్రపతి ఆదేశించినట్లు ఆ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాను సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వ పూర్తిగా విఫలమైందంటూ ప్రతిపక్షాల విమర్శల నేపథ్యంలో అధికార టిడిపి మోడీ ప్రభుత్వం నుంచి గురువారం వైదొలగిన విషయం తెలిసిందే. తాము కేవలం ప్రభుత్వం నుంచి మాత్రమే బయటకు వచ్చామని, ఎన్‌డిఎ కూటమి నుంచి కాదని పేర్కొన్న విష యం విదితమే. కాగా, టిడిపికి చెందిన కేంద్రమంత్రులు గురువారం సాయంత్రం ప్రధానిని కలిసి తమ రాజీనామా లేఖలను సమర్పించారు.

ఎస్‌పి అభ్యర్థిగా జయా బచ్చన్



లక్నో/ కోల్‌కతా : బాలీవుడ్ నటుడు, సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) నేత జయా బచ్చన్ ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభ సభ్యులుగా శుక్రవారం ఎస్‌పి తరుపున నామినేషన్ దాఖలు చేశారు. వ్యాపారవేత్త సుబ్రతా రాయ్ సహరాతో పాటు పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ భార్య డింపుల్ యాద వ్, పార్టీ నేతలు రాజేంద్ర చౌదరి, కిరణ్‌మయి నందతో కలిసి జయా బచ్చన్ అసెంబ్లీ సెంట్రల్‌హాల్‌లో తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రాజ్యసభ ఎన్నికల్లో తనకు అభ్యర్థిత్వం కల్పించినందుకు ఎస్‌పి వ్యవస్థాపకులు ములాయం సింగ్ యాదవ్, పార్టీ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలకు కృతజ్ఞత లు తెలియజేస్తున్నానన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ మనూ సంఘ్వీకి తాము మద్దతు ఇవ్వనున్నట్లు పశ్చిమ బెంగాల్ సిఎం, తృణమూల్ కాంగ్రెస్ సుప్రీం మమతా బెనర్జీ పేర్కొన్నారు.

జడ్జిల పదవీ విరమణ పెంపు లేదు

న్యూఢిల్లీ : ఉన్నత న్యాయస్థానాల్లో ఖాళీలపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో హైకోర్టు జడ్జిల పదవీ విరమణ వయస్సును 62 నుంచి 65 సంవత్సరాలకు పెంచే ప్రతిపాదన ఏదీ లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. శుక్రవారం రాజ్యసభలో హైకోర్టు జడ్జిల పదవీ విరమణ వయస్సును పెంచే ఆలోచన ఏమైనా ప్రభుత్వానికి ఉందా? అన్న ప్రశ్నకు కేంద్ర సహాయ మంత్రి పిపి చౌదరి పై విధంగా సమాధాన మిచ్చారు. అలాంటి ప్రతిపాదన ఏమీ ప్రభుత్వానికి లేదని చెప్పారు.హైకోర్టు జడ్జిల పదవీ విరమణ వయస్సును 62 నుంచి 65 సంవత్సరాలకు పెంచాలని ప్రతిపాదిస్తూ 2010లో యుపిఎ ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లు 2014 లో లోక్‌సభ రద్దు కావడంతో గడువు ముగిసిపోయింది. హైకోర్టు జడ్జిల పదవీ విరమణ వయస్సును 62 నుంచి 65 సంవత్సరాలకు పెంచాలని ప్రతిపాదిస్తూ భారత రాజ్యాంగం(144వ సవరణ) బిల్లు, 2010 జూలై 25న లోక్‌సభలోకి ప్రవేశపెట్టారు. అయితే దీన్ని ఆమోదించేందుకు ఎలాంటి పరిశీలన చేయకపోవడంతో గడువు ముగిసిపోయింది. దేశంలోని 24 హైకోర్టుల్లో 406 జడ్జిల పోస్టుల ఖాళీలున్నాయని న్యాయ మంత్రిత్వ శాఖ తాజా సమాచారం తెలియజేస్తోంది. దేశవ్యాప్తంగా దాదాపు 3 కోట్ల కేసులో వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి.

దినకరన్ వర్గానికి గుర్తు, పేరు ఇవ్వండి

ఇసికి ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ : టిటివి దినకరన్ నేతృత్వంలోని ఎఐఎడిఎంకెకు ప్రెషర్ కుక్కర్ ప్రాధాన్యంగా సాధారణ గుర్తు,పేరును ఇవ్వాల్సిందిగా ఢిల్లీ హైకోర్టు శుక్రవారం నాడు ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. దినకరన్–శశికళ వర్గం కోరిన విధంగా ఆ పార్టీకి గుర్తు, పేరును మూడు వారాల్లోగా మంజూరు చేయాలని న్యాయమూర్తి జస్టిస్ రేఖ ఎన్నికల సంఘానికి సూచించారు.తమిళనాడు సిఎం కె.పళనిస్వామి,డిప్యూటీ సిఎం ఓ.పన్నీరు సెల్వం నేతృత్వంలోని వర్గానికి రెండాకుల గుర్తును మంజూరు చేస్తూ గత ఏడాది నవంబరు 23న ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాలు సవాల్ చేస్తూ దినకరన్ హైకోర్టును ఆశ్రయించారు.దీనిపై వాదోపవాదాలు జరిపిన అనంతరం కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. అసలు పిటిషన్ పెండింగ్‌లో ఉన్నంత వరకు వెంటనే తనకు గుర్తు, పేరును ఇవ్వాలని కోరుతూ దినకరన్ చేసుకున్న మధ్యంతర విజ్ఞప్తి మేరకు ఈ కేటాయింపు చేయాలని సూచించింది.

విగ్రహాల ధ్వంసం బిజెపి అసహనానికి నిదర్శనం : కారత్

న్యూఢిల్లీ: హిందుత్వ మినహా ఏ ఇతర భావజాలమైన బిజెపి అసహన విధానాన్ని ప్రదర్శిస్తోందని సిపిఎం మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్ పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో విగ్రహాల ధ్వంసాలను నిరసిస్తూ సిపిఐ, సిపిఎం, ఎఐఎఫ్‌బి, ఆర్‌ఎస్‌పి, సిపిఐ (ఎంఎల్), ఎస్‌యుసిఐ, సిజిపిఐలతో కూడిన ఏడు వామపక్ష పార్టీలు పార్లమెంట్ వైపు మార్చ్ నిర్వహించగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. అనంతరం పార్లమెంట్ వీధిలో వామపక్ష కార్యకర్తలు, మద్దతుదారులనుద్దేశించి ప్రకాశ్ కారత్ మాట్లాడారు.త్రిపురలో లెనిన్ విగ్రహ ధ్వం సం, తమిళనాడులో పెరియార్ ఇవి రామస్వామి నాయికర్ విగ్రహ రూపాన్ని మార్చడం, ఉత్తరప్రదేశ్‌లో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేయడం పట్ల, హిందుత్వ మినహా ఏ ఇతర భావజాలాన్ని సహించేందుకు బిజెపి సిద్ధంగా లేదని పేర్కొన్నారు. త్రిపురలో వామపక్షాలకు ఓటు వేసిన వారిపై బిజెపి హింసకు పాల్పడుతోందన్నారు. సిపిఐ (ఎంఎల్) నేత కవిత క్రిష్ణన్ మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు లెనిన్‌ను విదేశీయుడు అని ప్రచారం చేయడం సరికాదన్నారు.భగత్ సింగ్ కూడా ఆయన నుంచి స్ఫూర్తి పొందారన్నారు.

తక్లా పాస్‌పోర్టుపై ఆరా

న్యూఢిల్లీ : దావూద్ ఇబ్రహీం అనుచరుడు తక్లాకు పాస్‌పోర్టు ఏ విధంగా వచ్చిందనే అంశంపై విదేశాంగ మంత్రిత్వశాఖ ఆరా తీస్తోంది. ముంబై దాడులలో కీలక నిందితుడు , ఫరారీలో ఉన్న తక్లాను ఢిల్లీ విమానాశ్రయంలో సిబిఐ గురువారం అరెస్టు చేసింది. అయితే ఆయన పాస్‌పోర్టు పొంది దుబాయ్ నుంచి ఇక్కడికి రావడం ఏ విధంగా సాధ్యం అయ్యిందనేది కీలకంగా మారింది. పాస్‌పోర్టు పొందడం దానిని పునరుద్ధరించుకోవడం గురించి దుబాయ్‌లోని భారతీయ విదేశాంగ కార్యాలయం నుంచి వివరాలను తెలుసుకుంటున్నారు. తక్లా కోసం భారత దర్యాప్తు సంస్థలు గాలిస్తున్నాయి. ముంబై దాడులలో ఆయన నిందితుడు అనే విషయాన్ని దుబాయ్ ప్రభుత్వానికి తెలియచేశాం . ఈ మేరకు దుబాయ్ నుంచి ఆయనను ఇక్కడికి తరలించారని, ఈ క్రమంలో అరెస్టు జరిగిందని విదేశాంగ శాఖ ప్రతినిధి రవీష్ కుమార్ తెలిపారు. ఆయన పాస్‌పోర్టు దక్కించుకోవడానికి వెనుక కొందరు కేంద్ర మంత్రుల ప్రమేయం ఉందనే వార్తలపై తాము స్పందించలేమన్నారు. నీరవ్ మోడీ అంశం గురించి ప్రస్తావిస్తూ ఆయన పాస్‌పోర్టు రద్దు అయిందని , దర్యాప్తునకు సహకరించడం లేదని తెలిపారు. శ్రీదేవి మృతిపై తలెత్తుతున్న వివాదాల గురించి కూడా ప్రస్తావించారు. యుఎఇ ప్రభుత్వ దర్యాప్తు తరువాత పత్రాలు అందించారని , దీని మేరకు భౌతిక కాయం అప్పగింత జరిగిందని, అనుమానాస్పద అంశాలు ఉంటే నివేదికలో పొందుపర్చి ఉండేవారని తెలిపారు.

కాలేజీ ఎదుటే విద్యార్థిని నరికివేత

దుండగుడిని పట్టుకున్న స్థానికులు



చెన్నై : తమిళనాడు రాజధానిలో చెన్నైలో దారుణం జరిగింది. ఇక్కడి కెకె నగర్‌లోని మీనాక్షి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన అశ్విని అనే విద్యార్థినిని అళగేషన్ అనే దుండగుడు కత్తితో కిరాతకంగా నరికి చంపారు. శుక్రవారంనాడు కళాశాల ఎదుటే జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. విద్యార్థినిని నరికిన దుండగుడు పారిపోతుండగా వెంటనే అప్రమత్తమైన స్థానికులు అడ్డుకుని దేహశుద్ధి చేశారు. మీనాక్షి కళాశాలలో బీకాం మొదటి సంవత్సరం చదువుతున్న అశ్విని కాలేజీ ముగియడంతో రోజులాగే ఇంటికి వెళ్లేందుకు గేట్ ముందు వేచి చూస్తోంది. అంతలో అటుగా వచ్చిన ఓ యువకుడు గేటు ముందు నిల్చుని ఉన్న ఆమెపై కత్తితో విచక్షణారహితం పొడిచాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అశ్విని రక్తపు మడుగులో కుప్పకూలిపోయింది. అదే సమయం పారిపోయేందుకు ప్రయత్నించిన యువకుడిని స్థానికులు పట్టుకుని చితకబాదారు. అనంతరం అతన్ని పోలీసులకు అప్పగించారు. కాగా స్థానికుల దాడితో తీవ్రంగా గాయపడిన దుండగుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

త్రిపుర సిఎంగా బిప్లవ్ ప్రమాణం

● మంత్రులుగా ఏడుగురు ప్రమాణ స్వీకారం ● కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోడీ, అమిత్ షా, మాణిక్





అగర్తలా : త్రిపుర ముఖ్యమంత్రిగా బిప్లవ్ కుమార్ దేవ్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. అసోం రైఫిల్స్ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ తథాగత రాయ్, బిప్లవ్ కుమార్ దేవ్‌చే ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ, బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా హాజరయ్యారు. అదే విధంగా ఉప ముఖ్యమంత్రిగా విష్ణు దేవ్‌బర్మాన్ ప్రమాణం చేశారు. అయితే ఆయన చారిలమ్ నియోజకవర్గం నుంచి ఎంఎల్‌ఎగా ఎన్నిక కావాల్సి ఉంది. ఎన్నికలకు ముందు సిపిఐ(ఎం) అభ్యర్థి మృతి చెందడంతో ఈ నియోజకవర్గంలో పోలింగ్ వాయిదా పడింది. ఎస్‌టికి రిజర్వ్ చేసిన ఈ సీటుకు ఈనెల 12న ఎన్నికలు జరగనున్నాయి. కాగా, సిఎం, డిప్యూటీ సిఎంతో పాటు మరో ఏడుగురు మంత్రులుగా ప్రమాణం చేశారు. మంత్రిమండలో బిజెపి నుంచి ఐదుగురికి, దాని మిత్రపక్షమైన ఇండిజీనియస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపిఎఫ్‌టి) నుంచి ఇద్దరికి బెర్తులు దక్కాయి.మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఐపిఎఫ్‌టి చీఫ్ ఎన్ సి దెబ్బార్మతో పాటు ఆ పార్టీ జనరల్ సెక్రెటరీ మేవర్ కుమార్ జమాతియా కూడా ఉన్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మోడీ, అమిత్ షాతో పాటు కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్, బిజెపి సీనియర్ నాయకులు ఎల్‌కె అద్వానీ, మురళీ మనోహర్ జోషి, బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు విజయ్ రూపానీ (గుజరాత్), శివరాజ్‌సింగ్ చౌహాన్ (మధ్యప్రదేశ్), సర్బానంద సోనోవాల్ (అసోం),రఘుబర్ దాస్ (జార్ఖండ్)లు హాజరయ్యారు. అదే విధంగా మాజీ సిఎం మాణిక్ సర్కార్ కూడా పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో మొదటిసారిగా బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో అగర్తలా వ్యాప్తంగా మోడీ, అమిత్ షాలతో కూడిన పోస్టర్లు పెద్ద ఎత్తున దర్శనమిచ్చాయి. విమానాశ్రయం నుంచి ప్రమాణ స్వీకార వేదిక వరకు రోడ్డుకు ఇరువైపులా బిజెపి జెండాలను ఏర్పాటు చేశారు. కాషాయ రంగులో ఉన్న బ్యానర్లను పెట్టారు. రాష్ట్రానికి ప్రధాని, ఇతర ప్రముఖులు విచ్చేస్తున్నందున రాజధాని నగరంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎద్ద ఎత్తున నిర్వహిస్తున్న ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వంద ఫీట్ల వేదికను ఏర్పాటు చేసినట్లు బిజెపి జనరల్ సెక్రెటరీ రామ్ మాధవ్ మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలోరాజకీయ మార్పు జరిగిన ఈ రోజు తాము మరిచిపోలేనిదన్నారు. మోడీ చేస్తున్న అభివృద్ధిని స్ఫూర్తిగా తీసుకొని తమ పార్టీ కార్యకర్తలు పార్టీ విజయంకోసం శక్తి వంచన లేకుండా కృ షి చేశారని ఆయన చెప్పారు. కాగా,త్రిపురలో 60 స్థానాలను ఉన్న అసెంబ్లీకి ఇటీవల జరిగిన ఎన్నికల్లో బిజెపి దాని మిత్రపక్షం మూడింట రెండొంతుల మెజారిటీని సాధించింది.

రైల్వే టికెట్ ఇతరులకు బదిలీ చేసుకోవచ్చు

న్యూఢిల్లీ : రైల్వే టికెట్ రిజర్వేషన్ చేయించుకుని, అనుకోకుండా ఆ ప్రయాణాన్ని రద్దు చేసుకోవాల్సి వస్తే టికెట్ వృథా పోతుందన్న రంది ఇక అక్కర్లేదు. ఇలాంటి సమస్యలకు భారత రైల్వేశాఖ ప్రత్యామ్నాయాన్నితీసుకొచ్చింది. అనివార్య కారణాల వల్ల ప్రయాణం రద్దు చేసుకోదలిస్తే ప్రయాణికులు రిజర్వు చేసుకున్న టికెట్‌ను ఇతరులకు బదిలీ చేయవచ్చు. ఒక వేళ టికెట్ రిజర్వు చేసుకున్న ప్రయాణికులు ప్రభుత్వోద్యోగులయితే రైలు బయల్దేరడానికి నిర్దేశించిన 24గంటల్లోపు తమ టికెట్‌ను వేరే ప్రయాణికుడి పేరు మీదకు మార్చుమన్నట్లు లిఖితపూర్వకంగా లేఖరాసి ఇవ్వాల్సి ఉంటుంది. సాధారణ ప్రయాణికులకు సైతం ఇలాంటి నిబంధనే ఉంటుంది. కాకపోతే ప్రయాణికుడి కుటుంబ సభ్యులకు అంటే అమ్మానాన్నలకు,భార్య, సోదరులు, అక్కాచెల్లెల్లు, భర్త, కొడుకు, కుమార్తెలకు ఈ నియమం వర్తిస్తుంది.రైలు బయల్దేరడానికి 24గంటలలోపు ప్రయాణికులు ఈమేరకు అభ్యర్థన పెట్టుకోవాల్సి ఉంటుంది.



20 వరకు కార్తిని అరెస్టు చేయొద్దు

ఇడికి ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ : ఐఎన్‌ఎక్స్ మీడియా అవినీతి కేసులో నిందితుడిగా ఉన్న కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం కుమారుడు కార్తి చిదంబరానికి ఢిల్లీ హైకోర్టులో కాస్త ఊరట లభించింది. ఈ కేసును సిబిఐతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కూడా విచారణ జరుపుతోంది. అయితే ఇడి తనను అరెస్ట్ చేయకుండా మధ్యంతర ఉత్తర్వులివ్వాలని కార్తి హైకోర్టును కోరగా కోర్టు ఈ మేరకు అంగీకరించింది. మార్చి 20 వరకు కార్తిని అరెస్ట్ చేయరాదని ఇడిని ఆదేశించింది. సిబిఐ నమోదుచేసిన కేసులో కార్తికి ప్రత్యేక న్యాయస్థానం ఒకవేళ బెయిల్ ఇచ్చినా తర్వాత విచారణ జరిగే వరకు అరెస్ట్ చేయరాదని కూడా జస్టిస్ ఎస్.రవీంద్ర భట్ ఆదేశించారు. కాగా,మనీలాండరింగ్ కేసులో తనకు వచ్చిన సమన్లు, తనపై జరుగుతున్న విచారణను సవాలు చేస్తూ కార్తి దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించాలని కేంద్రానికి, ఇడికి కోర్టు నోటీసులు జారీ చేసింది. ఇదిలావుండగా, కార్తికి సిబిఐ కస్టడీ ముగుస్తుండడంతో మార్చి12 వరకు పోలీసు కస్టడీని పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చింది.కార్తికి మూడు రోజుల పోలీసు రిమాండ్ ముగియడంతో శుక్రవారం అతనిని ప్రత్యేక జడ్జి సునీల్‌రాణా ఎదుట హాజరు పర్చారు. బెయిల్ కోరుతూ కార్తి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను మార్చి15కు వాయిదా వేశారు. అనంతరం మార్చి22 వరకు కార్తి, అతని సిఏ భాస్కర రామన్‌ను సిబిఐ జ్యూడీషియల్ కస్టడీకి అనుమతించింది.



పార్లమెంట్‌లో అదే రభస

విపక్షాల ఆందోళనలు, నిరసనలు

న్యూఢిల్లీ : పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో శుక్రవారం నాడు ఎలాంటి కార్యకలాపాలు సాగకుండానే ముగిసిపోయింది. దీంతో సమావేశాలు ఈ వారం మొత్తం నిష్ఫలంగానే జరిగినట్టయింది. వేర్వేరు పార్టీలు వివిధ డిమాండ్లతో ఆందోళన కొనసాగించడంతో వరుసగా ఐదో రోజు కూడా ఎలాంటి కార్యకలాపాలకు వీలు కుదరలేదు. శుక్రవారం ఉదయం లోక్‌సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ సుమిత్ర మహాజన్ ఇటీవలే చనిపోయిన ముగ్గురు మాజీ సభ్యులకు సంతాపం తెలుపుతూ తీర్మానాలు చదివి వినిపించారు. ఆ తర్వాత రిజర్వేషన్ల పెంపు బిల్లును ఆమోదించాలని టిఆర్‌ఎస్ సభ్యులు, ఎపికి ప్రత్యేక హోదా కల్పించడంతో పాటు విభజన హామీలు నెరవేర్చాలని టిడిపి సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నిరసనకు దిగారు. పిఎన్‌బి కుంభకోణంపై కాంగ్రెస్, పెరియార్ విగ్రహ ధ్వంసంపై ఎఐఎడిఎంకె సభ్యులు వెల్‌లోకి వెళ్లి నిరసన వ్యక్తం చేశారు ప్రశ్నోత్తరాల సమయంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ సహా అన్ని పార్టీల నిరసనల మధ్య స్పీకర్ సభను 40 నిమిషాల పాటు వాయిదా వేయగా, అనంతరం ప్రారంభమైన సభలో మళ్లీ గందరగోళం నెలకొనడంతో సభను తిరిగి వచ్చే సోమవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభలోనూ ఇదే సీన్ !

వివిధ అంశాలపై విపక్ష సభ్యులు ఆందోళనతో శుక్రవారం నాడు రాజ్యసభ కార్యకలాపాలను స్తంభింపజేశారు. విభజన హామీలు నెరవేర్చాలని టిడిపి సభ్యులు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. డిప్యూటీ ఛైర్మన్ కురియన్ సభ్యులకు ఎంత నచ్చజెప్పినా వినకపోవడంతో సభను సోమవారానికి వాయిదా వేశారు. అంతకు ముందు శుక్రవారం ఉదయం కూడా రిజర్వేషన్ల పెంపు బిల్లును ఆమోదించాలని టిఆర్‌ఎస్, ప్రత్యేక హోదా, విభజన హామీలు సాకారం చేయాలని టిడిపి సభ్యులు ఆందోళన చేయడంతో రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యానాయుడు 2.30 గంటలకు వాయిదా వేశారు. అనంతరం మధ్యాహ్నం సభ ప్రారంభం కాగానే సభ్యులు తిరిగి నినాదాలతో సభా కార్యకలాపాలను అడ్డుకోవడంతో డిప్యూటీ ఛైర్మన్ కురియన్ చివరికి సభను సోమవారానికి వాయిదా వేశారు.



షాపింగ్ ఆరోపణలు : పదవికి మారిషస్ అధ్యక్షురాలు గుడ్‌బై

పోర్టు లూయిస్: ఆర్థిక అవకతవకల ఆరోపణలు రావడంతో మారిషస్ అధ్యక్షురాలు అమీనాహ్ గురిబ్ ఫకీమ్ పదవికి రాజీనామా చేయనున్నారు. ఈ విషయాన్ని దేశ ప్రధాని ప్రవీంద్ జుగన్నాథ్ శుక్రవారం ఇక్కడ తెలిపారు. మారిషస్‌కు తొలి అధ్యక్షురాలిగా ఉన్న గురిబ్ ఒక విదేశీ సంస్థ ఇచ్చిన బ్యాంకు కార్డును ఉపయోగించి యదేచ్ఛగా దుబాయ్‌లో షాపింగ్‌లకు దిగారని పత్రికలలో వార్తలు వెలువడ్డాయి.మారిషస్ పత్రిక ఎల్ ఎక్స్‌ప్రెస్ దీనికి సంబంధించి ఒక కథనం ప్రచురించింది. తాను స్వచ్ఛందంగా పదవి నుంచి వైదొలుగుతున్నట్లు ఆమె చెప్పారని ప్రధాని జుగన్నాథ్ వెల్లడించారు.12న జరిగే మారిషస్ స్వాతంత్ర్య దినోత్సవఅర్థశతాబ్ది వేడుకలలో పాల్గొన్న తరువాత పదవి నుంచి ఆమె వైదొలుగుతారని ప్రధాని తెలిపారు. అక్రమాల ఆరోపణలు ఎవరిపై వచ్చినా ఫలితం ఒక్కటిగానే ఉంటుందని,వ్యక్తుల కన్నా దేశం తమకు ముఖ్యం అని ప్రధాని ప్రకటించారు. అంతర్జాతీయంగా పేరొందిన సైంటిస్టు, బయోలజిస్టు అయిన గురిబ్ మారిషస్ గౌరవ పదవిని మూడేళ్ల క్రితం చేపట్టారు.లండన్‌కు చెందిన ప్లానెట్ ఎర్త్ సంస్థ ఇచ్చిన క్రెడిట్ కార్డు సాయంతో అధ్యక్షురాలు వేలాది డాలర్ల కొనుగోళ్లు సాగించారని తెలియచేసే ఆధారాలతో పత్రిక వార్తను ప్రచురించింది. బ్యాంకు డాక్యుమెంట్లను వెలువరించింది. ఇది ఒక భారీ ఆర్థిక స్కామ్‌గా మారుతూ ఉండటంతో దీనిపై స్పందించిన దేశనేత పదవి నుంచి వైదొలుగుతున్నారు.

మేలో ట్రంప్-కిమ్ భేటీ!

సరేనన్న అమెరికా అధ్యక్షుడు

వాషింగ్టన్ : అమెరికా, ఉత్తర కొరియా మధ్య చర్చలకు పెద్ద ముందడుగు పడింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో చర్చలకు ఒకే అన్నారు. అంతా అనుకున్నట్టు జరిగితే ఇరుదేశాల అధినేతలు వచ్చే మే మాసంలో సమావేశం కానున్నారని సమాచారం. ఇదే జరిగితే ఇరు దేశాల నడుమ సుదీర్ఘకాలంగా నెలకొన్న వివాదం సమసిపోయే సంకేతాలు స్పష్టమయ్యాయి. ట్రంప్‌ని చర్చలకు ఆహ్వానిస్తూ గురువారం వైట్ హౌస్‌ని సందర్శించిన దక్షిణ కొరియా ప్రతినిధులు కిమ్ పంపిన లేఖను అందజేశారు. ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య జరుగుతున్న చర్చల సారాంశాన్ని వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ట్రంప్ ట్విటర్‌లో తన అభిప్రాయాలను వెల్లడించారు. కిమ్‌తో దక్షిణ కొరియా ప్రతినిధులు, అణు క్షిపణుల నియంత్రణకు జరుపుతున్న చర్చలు కొనసాగుతున్నాయని ట్రంప్ తెలిపారు. ఉత్తర కొరియా ఇటీవల క్షిపణి పరీక్షలకు దూరంగా ఉండటాన్ని ఆయన స్వాగతించారు. ఒప్పందాలు కుదిరే వరకు ఇది ఇలాగే కొనసాగాలన్నారు. సమావేశానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. డోనాల్డ్ ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక ట్రంప్, కిమ్‌ల మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. కిమ్ ఏ మాత్రం తగ్గకుండా తమ అణు క్షిపణులతో ప్రపంచానికే పెను సవాలు విసురుతూ వచ్చారు. దీంతో ప్రపంచ దేశాలన్నీ శాంతి చర్చల ద్వారా వివాదానికి తెర దించాలని ఇరు దేశాలకు సూచించాయి. దీంతో ఈ ఏడాది ఆరంభం నుంచి కిమ్ వైఖరిలో మార్పు చోటుచేసుకుంది. ఉప్పు నిప్పుగా ఉన్న ఉభయ కొరియాల మధ్య ఉద్రిక్తతలు సడలాయి. ఇటీవలే పొరుగు దేశమైన దక్షి ణ కొరియా అధికారులు చర్చల కోసం దశాబ్ద కాలం తర్వాత ఉత్తర కొరియా లో అడుగుపెట్టారు. ఈ క్రమంలోనే కిమ్ సోదరి దక్షిణ కొరియాలో జరిగిన ఒలంపిక్స్‌కి హాజరవ్వడంతో, చర్చలు సత్ఫాలితాలు ఇచ్చే సంకేతాలు వెలువడ్డాయి.



ముషారఫ్ అరెస్ట్‌కు ఆదేశం

పెషావర్ : పాకిస్థాన్ మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆయన అరెస్ట్‌కు ఇక్కడి ఓ ప్రత్యేక కోర్టు శుక్రవారం ఆదేశించింది. ఆయన ఆస్తులను కూడా జప్తు చేయాలని ఆదేశించింది. 2007 లో దేశంలో అత్యవసర పరిస్థితిని విధించినందుకు ప్రకటిత నేరస్థుడైన ముషారఫ్ దేశద్రోహం కేసు విచారణ సందర్భంగా ఈ ఆదేశాలిచ్చింది. ఆయనపై ఈ కేసు 2014 మార్చిలో దాఖలైంది. పాకిస్థాన్‌లో ఎమర్జెన్సీ విధించిన ముషారఫ్ ఆ దేశ సుప్రీంకోర్టు న్యాయమూర్తులపై గృహ నిర్బంధం విధించారు, 100 మందికి పైగా న్యాయ మూర్తులను తొలగించారు. ఈ కేసుపై పెషావర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యాహ్యా అఫ్రిది నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరుపుతోంది. ముషారఫ్ 2016 మార్చి నుంచి దుబాయ్‌లో ఉంటున్నారు.

తాలిబాన్ల దాడి : 10 మంది పోలీసులు దుర్మరణం

కాబూల్: అఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు రెచ్చిపోయారు. ఉత్తర తఖర్ ప్రావిన్స్‌లోని మారుమూల ప్రాంతంలో ఉన్న సైనిక స్థావరంపై తాలిబన్లు దాడికి పాల్పడటంతో 10 మంది స్థానిక పోలీసులు మృతి చెందారు. తొమ్మిది మంది గాయపడ్డారు. శుక్రవారం ప్రావిన్షియల్ పోలీస్ అధికార ప్రతినిధి ఖలీ అసీర్ విలేకరులతో మాట్లాడుతూ గత రాత్రి సైనిక స్థావరంపై భారీ సంఖ్యలో తాలిబన్లు దాడికి పాల్పడినట్లు తెలిపారు. ఖ్వాజాఘర్ జిల్లాలోని సైనిక స్థావరానికి సహాయం చేసేందుకు వెళ్తున్న స్థానిక పోలీసులపై ఉగ్రవాదులు పొంచి ఉండి దాడి చేశారు. ఈ ఘటనలో సైనికులెవరూ మృతి చెందలేదు. కాగా, సైనిక స్థావరంపై దాడి చేసి పోలీసులను తామే చంపామని తాలిబాన్ అధికార ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ తెలిపారు. ఇంకా ఎక్కువ మంది పోలీసులను చంపినట్లు ఆయన చెప్పినప్పటికీ తీవ్రవాదులు మరణాలు ఎక్కువగా చెప్పడం మాములే. ఘటన మారు మూల ప్రాంతంలో జరగడంతో వివరాలను వెంటనే వెల్లడించలేకపోయినట్లు అధికారులు తెలిపారు.

సింగపూర్ ప్రధానితో రాహుల్ భేటీ



సింగపూర్: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ శుక్రవారం సింగపూర్ ప్రధాని లీ సీన్ లూంగ్, ఇతర సీనియర్ నేతలతో సమావేశమయ్యారు. మూడు రోజుల పర్యటనకు గానూ ఆయన గురువారం సింగపూర్, మలేషియాకు వెళ్లారు. తాను కాంగ్రెస్ నేత మిలింద్ డియోరా, టెలికాం వ్యాపారి శ్యామ్ పిట్రోడాతో కలిసి సింగపూర్ ప్రధాని లీని కలిసినట్లు ఫేస్‌బుక్‌లో రాహుల్ పోస్ట్ చేశారు. అనంతరం సింగపూర్ ఉప ప్రధానమంత్రి తర్మాన్ షణ్ముగ రత్నంతో ఆయన సమావేశమయ్యారు. 1945 లో అమర వీరుల స్మారకార్థం సింగపూర్‌లో నిర్మించిన ఇండియన్ మెమోరియల్‌ను సందర్శించి, సుభాష్ చంద్ర బోస్‌కు ఆయన నివాళులర్పించారు. తన మలేషియా పర్యటనలో భాగంగా రాహుల్ మలేషియా ప్రధాని నజీబ్ రజాక్, మలేషియా భారతీయులు,వ్యాపారవేత్తలతో సమావేశమవుతారు. సింగపూర్‌లో అనేక జాతులకు చెందిన 5.3 మిలియన్లకు పైగా జనాభా ఉండగా వారిలో ఐదు లక్షల మంది భారతీయులు ఉన్నా రు.

పాక్ 'స్పెషల్ టెర్రరిస్ట్ జోన్' : భారత్

ఐరాస : పొరుగుదేశం పాకిస్థాన్‌లో 'స్పెషల్ టెర్రరిస్ట్ జోన్'గా భారత్ అభివర్ణించింది. సరిహద్దులో చొరబాట్లను పాకిస్థాన్ నిలిపి వేసేలా కౌన్సిల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. జమ్ముకశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్నాయన్నపాక్ ఆరోపణలను ఆమె దీటుగా తిప్పికొట్టారు. అసలు ఉగ్రవాదమే అన్నింటి కన్నా పెద్ద మానవ హక్కుల ఉల్లంఘన అని అన్నారు. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదమే అతిపెద్ద సమస్య. దానికి పాకిస్థానే కారణం అని దేవి స్పష్టం చేసింది. గతేడాది సెప్టెంబర్‌లో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో పాక్‌ను టెర్రరిస్తాన్‌గా భారత్ అభివర్ణించిన విషయం తెలిసిందే.

ఉగ్రవాదిపై భారీ రివార్డు

వాషింగ్టన్: తెహ్రిక్-ఎ-తాలిబన్ పాకిస్థాన్,దాని అనుబంధ ఉగ్ర సంస్థలకు చెందిన పలువురు ఉగ్రవాదులను పట్టిస్తే భారీ మొత్తంలో డబ్బు రివార్డుగా ఇస్తామని అమెరికా ప్రకటించింది. టిటిని నేత మౌలానా నా ఫజుల్లా, మరో ఇద్దరు ఉగ్రవాదుల జాడ తెలిపిన వారికి భారీ నజరానా ఇవ్వనున్నట్లు వెల్లడించింది. పాకిస్థాన్‌కు చెందిన ప్రముఖ ఉద్యమ కారిణి, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మలాలా యూసఫ్ జాయ్‌ను చంపేందుకు 2012 అక్టోబరు 9న ఆమెపై కాల్పులకు, 2012 జూన్‌లో 17 మంది పాకిస్థాన్ సైనికుల హత్యకు ఫజుల్లానే బాధ్యుడు. మౌలానా ఫజుల్లా తలపై అమెరికా 5 మిలియన్ డాలర్లు (సుమారు రూ.32కోట్లు) రివార్డు ప్రకటించింది. మరో ఇద్దరు ఉగ్రవాదులు అబ్దుల్ వలి, మంగల్ బాగ్‌లపై ఒక్కొక్కరిపై 3 మిలియన్ డాలర్ల రివార్డు ప్రకటించింది.

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం

తిరుమల : తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శ్రీవారి దర్శనం కోసం భక్తులు నాలుగు కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు. శ్రీవారి సర్వదర్శనానికి ఆరు గంట లు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి రెండు గం టలు, కాలినడక భక్తులకు రెండు గం టల సమయం పడుతోంది. గురువారం శ్రీవారిని 61,013మంది భక్తులు దర్శించుకున్నారు. 23,962మంది తలనీలాలు సమర్పించుకున్నారు. గురువారం శ్రీవారి హుండీకి రూ.2.72 కోట్ల ఆదాయం సమకూరింది.

ముక్త్యాల సంస్థానం రాణి కన్నుమూత

కృష్ణా : ముక్త్యాల సంస్థానం చివరి రాణి వాసిరెడ్డి రాజ్యలక్ష్మమ్మ గురువారం రాత్రి చెన్నయ్‌లో చనిపోయారు. గతకొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి కన్నుమూశారు. ఆమె జగ్గయ్యపేట ఎంఎల్‌ఎగా కూడా పని చేశారు. కెసిపి సిమెంట్స్ ఎండి ఇందిరాదత్‌కు ఆమె తల్లి అన్న విషయం తెలిసిందే. జగ్గయ్యపేట నియోజకవర్గ అభివృద్ధికి ముక్త్యాల రాజా దంపతులు విశేష కృషి చేశారు.రాజ్యలక్ష్మమ్మ మృతిపై పలువురు సంతాపం తెలిపారు. శనివారం జగ్గయ్యపేటలో ఆమె అంత్యక్రియలు జరగనున్నాయి.

కలుషిత ఆహారం తిని ఇద్దరు మృతి


అనంతపురం : కలుషిత ఆహారం తిని ఇద్దరు చనిపోయారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది.ఈ ఘటన హిందూపురంలోని ముక్కిడి పేటలో శుక్రవారం జరిగింది. ముగ్గురు స్నేహితులు శుక్రవారం ఉద యం టిఫిన్‌తో పాటు కూల్ డ్రింక్ తీసుకున్నారు. ఈక్రమంలో వీరు అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ హిందూపురంకు చెందిన ప్రదీప్,శివానందలు మృతి చెందారు. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



తెలంగాణ రాష్ట్రంలో నేరాల అదుపు, కేసుల దర్యాప్తులో ముందున్న డిజిపి ఎం.మహేందర్‌రెడ్డిని గురువారం ఢిల్లీలో అభినందిస్తూ మెమోంటో అందిస్తున్న రష్యా రాయబార కార్యాలయ అధికారి ఇగోర్ బోడైరెవ్.

మహాత్ముడి అరుదైన చిత్రం వేలం

వాషింగ్టన్ : మహాత్మా గాంధీ అరుదైన చిత్రాన్ని అమెరికాలో వేలం వేశారు. గాంధీ, మదన్ మోహన్ మాలవీయతో కలిసి నడుస్తున్న ఆ ఫోటో వేలంలో 41,806 డాలర్లు (సుమారు రూ.27లక్షలు) పలికింది. ఆ చిత్రంపై 'ఎం కె గాంధీ' అని ఫౌంటెయిన్ పెన్‌తో సంతకం చేసి ఉంది. అది 1931 సెప్టెంబరులో లండన్‌లో రెండో సెషన్ భారత్ రౌండ్ టేబ్ సమావేశం అనంతరం తీసిన ఫొటో అని బోస్టన్‌కు చెందిన ఆర్ ఆర్ వేలం సంస్థ వెల్లడించింది. భారత నేషనల్ కాంగ్రెస్ తరఫున గాంధీ ఈ సమావేశానికి హాజరయ్యారు. లండన్‌లో 1930 నుంచి1932 మధ్య బ్రిటన్ మూడు సార్లు రౌండ్ టేబ్ సమావేశాలు నిర్వహించింది. గాంధీ ఈ ఫొటోపై సంతకం చేసిన సమయంలో కుడి చేతి బొటనవేలులో నొప్పితో బాధపడుతున్నారని వేలం సంస్థ తెలిపింది. ఆయన 1931లో ఆగస్టు 8 నుంచి డిసెంబరు 19 వరకు ఎడమ చేతితోనే రాశారని, ఆ సమయంలోనే ఈ ఫొటోపై సంతకం చేసినట్లు పేర్కొంది.



రసాయన పరిశ్రమలో అగ్ని ప్రమాదం

ముగ్గురు మృతి, 13 మందికి గాయాలు

ముంబయి : మహారాష్ట్రలో ఇటీవల జరిగిన వరుస అగ్నిప్రమాదాలు మరవక ముందే తాజాగా మరో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గురువారం రాత్రి పల్ఘార్ జిల్లాలోని ఓ రసాయన పరిశ్రమలో ఉన్న బాయిలర్ లోపల పేలుడు సంభవించింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసి పడ్డాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పో గా, మరి 13 మంది గాయాల పాలైనట్లు పోలీసులు తెలిపారు. బైసర్-తారాపూర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న రామ్‌దేవ్ కెమికల్స్‌లో ఈ ఘటన జరిగిందన్నారు. బాయిలర్ లోపల పెద్ద ఎత్తున పేలుడు జరగడంతో పరిశ్రమలో రాత్రి 11.40 గం టలకు మంటలు ఎగిసిపడ్డట్లు ఓ సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు. పరిశ్రమకు చుట్టూ 8 కిలోమీటర్ల మేరకు ఉన్న గ్రామాలపై పేలుడు ప్రభావం పడిందన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టగా ఆర్తి ఇండస్ట్రీస్ సైట్‌లో మూడు గుర్తు తెలియని మృత దేహాలను లభ్యమయ్యాయని పల్ఘార్ ఎస్‌పి మంజునాథ్ షింజే తెలిపారు. మరికొన్ని మృతదేహాలు కూడా లభించవచ్చన్నారు. సహాయక, గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు ఆయన చెప్పారు. అదే విధంగా రామ్‌దేవ్ పరిశ్రమలో ఎగిసిన పడిన మంటలు పక్కన ఉన్న మరో మూడు కంపెనీలకు వ్యాపించగా, 13 మంది గాయపడ్డారని, వారిని వివిధ ఆసుపత్రులకు తరలించినట్లు మరో సీనియర్ పోలీసు అధికారి పేర్కొన్నారు. సమాచారం అందుకు అగ్నిమాపక సిబ్బం ది ఘటనాస్థలికి చేరుకొని ఇతర కంపెనీలకు వ్యాపించిన మంటలను అదుపు చేశారని, రామ్‌దేవ్‌లో ఎగిసిపడుతున్న మంటలను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆ అధికారి చెప్పారు.



అమెరికాలో విమాన ప్రమాదం

వాషింగ్టన్ :అమెరికాలో విమాన ప్రమాదం చోటు చేసుకుంది. టెక్సాస్‌లోని లారెడో అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగిన దుర్ఘటనలో ముగ్గురు మృత్యువాతపడ్డారు. ఓ మినీ విమానంలో టేకాఫ్ అయిన కొద్దిసేపటికే మంటలు చెలరేగాయి. దీంతో వెంటనే పైలెట్ తిరిగి ఎయిర్‌పోర్టులో విమానాన్ని దించాలనుకున్నారు. అయితే విమానం ల్యాండ్ అవుతుండగా ఇంజిన్‌లో పేలుడు చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో అందులో ఉన్న ముగ్గురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతిచెందారు. ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. ఎయిర్‌పోర్టు నుంచి వెళ్లే అన్ని విమాన సర్వీసులను రద్దు చేశారు. విమానం ఇంజిన్ పేలిన దృశ్యాలు సిసి కెమెరాల్లో రికార్డయ్యాయి.

పార్లమెంట్ ఆవరణలో టిడిపి ఎంపిల ధర్నా

ఢిల్లీ : ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వడంతో పాటు విభజన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ టిడిపి ఎంపిలు పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద గురువారం ఆందోళనకు దిగారు. ఈ ధర్నాలో కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు కూడా పాల్గొన్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు రెండో విడత ప్రారంభమైన నాటి నుంచి టిడిపి ఎంపిలు పార్లమెంట్ ఉభయ సభలతో పాటు బయట కూడా ఆందోళన చేస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర మంత్రులుగా ఉన్న అశోక్‌గజపతిరాజు, సుజనా చౌదరి గురువారం తమ మంత్రి పదవులకు రాజీనామా చేశారు. ఈనేపథ్యంలో గురవారం జరిగిన ఆందోళనలో అశోక్‌గజపతి రాజు పాల్గొన్నారు.



ఉస్తాద్ వదాలీ కన్నుమూత

పంజాబ్ : ప్రముఖ పంజాబ్ సూఫీ గాయకుడు ఉస్తాద్ ప్యారేలాల్ వదాలీ శుక్రవారం ఉదయం గుండెపోటుతో కన్నుమూశారు. ప్యారేలాల్ వదాలీ ఉస్తాద్ పురానా చంద్ వాదాలీ సోదరుడు అన్న విషయం తెలిసిందే. పంజాబీ సూఫీ సంగీతంలో వీరు ప్రసిద్ధులుగా పేరుగాంచారు. ప్యారేలాల్ అనారోగ్యంతో బాధపడుతూ ఫోర్టీస్ ఎస్కార్ట్స్ ఆస్పత్రిలో గురువారం చేరా రు. ఆరోగ్యం విషమించి శుక్రవారం ఉదయం మృతి చెందారు. కాఫీయన్, గజల్, భనతో పాటు పలు రకాల పాటలు , బాలీవుడు పాటలు పాడారు. ప్యారేలాల్ మృతిపై పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

అవిశ్వాసం మీరు పెడతారా? మేం పెట్టాలా?: బొత్స



హైదరాబాద్: ఈ నెల 21న్ కాకుండా వచ్చే సోమవారమైనా కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు తాము సిద్ధమేనని.. అందుకు టిడిపి మద్ద తివ్వాలని వైసిపి సీనియర్ నేత బొత్స సత్యనారాయణ అన్నారు. దీంతో ఎవరు భయపడుతున్నారో ప్రజలకు తెలిసి పోతుందన్నారు. లేదా టిడిపి ఎప్పుడు అవి శ్వాసం పెట్టమంటే తాము అప్పుడే పెడ తామ ని,అందుకు మద్దతు ఇచ్చేం దుకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. అవిశ్వాసం పెడితే పార్లమెంట్ సాక్షి గా రాష్ట్రానికి ఇచ్చిన హామీను కేంద్ర ప్రభుత్వం ఎందుకు అమలు చేయలేక పోతుందో దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. అవిశ్వాస తీర్మానం తర్వాత వైసిపి ఎంపీలు రాజీనామాలు చేస్తారని చెప్పారు. టిడిపి నాయకులు మంత్రి పదవులకు రాజీనామా చేశామని చెబుతు న్నారే తప్ప ప్రత్యేక హోదా ఇవ్వని కారణంగా రాజీనామా చేశామని మాత్రం చెప్పుకోలేకపోతున్నారని విమర్శించారు. రాష్ట్ర మంత్రులు ఓ మాట.. ఢిల్లీలో ఉన్న ఎంపీలు మరో మాట మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రధానితో జరిగిన ఫోన్ సంభాషణలో సీఎం ప్రత్యేకహోదా ఇవ్వనందుకు తమ మంత్రులతో రాజీనామా చేయించినట్టు ఎందుకు చెప్పలేకపోయారని ప్రశ్నించారు.

మీటూ ఉద్యమం : నటుడి ఆత్మహత్య




సియోల్: లింగ బేధం లేకుండా లైంగిక వేధింపుల గురించి ప్రపంచానికి చాటి చెప్పేందుకు మీటూ (#MeToo) ఉద్యమం సాగుతున్న విషయం తెలిసిందే. ఈ ఉద్యమం ఓ నటుడి ప్రాణాలు తీసింది. జో మిన్ (52) అనే నటుడు రెండొందల చిత్రాల్లో నటించారు. పలు టివి కార్యక్రమాల్లో కూడా నటించారు. కొంతకాలంగా అతడిపై లైంగిక వేధింపుల ఆరోపణలు వస్తున్నాయి. జోమిన్ తమ ను లైంగికంగా వేధించాడంటూ ఎనిమిది మంది మహిళలు మీడియా ముందుకు వచ్చారు.ఈ క్రమంలో దక్షిణ కొరియాలో మీటూ ఉద్యమం మొదలైంది. దక్షిణ కొరియా పురుషాధిక్య దేశమన్న విషయం తెలిసిందే. దీంతో జో మిన్ మీడియా ద్వారా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పారు. తనపై ఆరోపణలు చేసిన వారి బండారం త్వరలోనే బయటపెడుతానంటూ తాజాగా ఆయన ప్రకటించారు. ఇంతలోనే ఆయన ఆత్మహత్య చేసుకున్నాడు. జో మిన్ మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని అతని కుటుంబ సభ్యులు చెబుతుండగా, పోలీసులు మాత్రం అతడు ఆత్మహత్య చేసుకున్నాడని తేల్చి చెబుతున్నారు.

గుంటూరులో జనసేన ఆవిర్భావ దినోత్సవం

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం సినీనటుడు పవన్ కల్యాణ్ స్థాపించిన జనసేన పార్టీ ఆవిర్భావదినోత్సవ మహాసభ వేడుకను గుంటూరులో నిర్వహించనున్నారు. మార్చి 14న గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీకి ఎదురుగా, కాజా టోల్ ప్లాజా సమీపంలో ఉన్న ప్రాంగణంలో ఈ మహాసభ జరగనుంది. మధ్యాహ్నం మూడు గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని జనసేన వర్గాలు పేర్కొన్నాయి. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి జనసేన కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. జనసేన స్థాపించి నాలుగేళ్లు పూర్తవుతున్నా ఎన్నిక బరిలోకి దిగిన దాఖలాలు లేవు.

ముున్ముందు పెద్ద నిర్ణయాలు

టిడిపి ముఖ్య, గ్రామస్థాయి నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్



అమరావతి: సీఎం చంద్రబాబు అధ్యక్షతన ప్రారంభమైన టిడిపి వ్యూహ కమిటీ సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్యనేతలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా గ్రామస్థాయి నేతలందరితోనూ సీఎం చంద్రబాబు సుమారు రెండున్నర గంటల పాటు టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రాష్ట్ర విభజన హామీలను నెరవేర్చడంలో కేంద్రం వైఫల్యం చెందిన నేపథ్యంలో టిడిపి తీసుకున్న నిర్ణయంతో తలెత్తిన రాజకీయ పరిణామాలను వారంద రికీ వివరించారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం నుంచి వైదొలిగిన కారణాలను సైతం వారికి వివరించారు. రెండు జాతీయ పార్టీలూ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశాయని వారితో సీఎం చెప్పారు. కేంద్రమంత్రి పదవులకు సుజనా చౌదరి, అశోక్ గజపతిరాజు రాజీనామాలు చేసిన నేపథ్యంలో నేతల స్పందనను చంద్రబాబు కోరగా.. అధిక శాతం మంది నేతలు సానుకూలంగాస్పందించినట్టుతెలుస్తోంది. అలాగే ప్రజల నుంచి కూడా సానుకూలమైన స్పందన వస్తోందని సీఎంకు వివరించినట్టు సమాచారం. అయితే, ఇంకా ఎన్డీయేలో కొనసాగడంపై వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తున్నాయని వారు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనికి సీఎం స్పందిస్తూ సందర్భానుసారం నిర్ణయాలు తీసుకుంటామన్నారు. విభజన హామీల సాధనలో కాలానుగుణంగా, అంచెలంచెలుగా కేంద్రంపైఒత్తిడిని పెంచే భాగంగా ముున్ముందు కీలక నిర్ణయాలు ఉంటాయని సీఎం చంద్రబాబు నేతలతో అన్నట్టు సమాచారం. .

15వేల మందితో టెలీకాన్ఫరెన్స్

వ్యూహ కమిటీ భేటీలో భాగంగా సీఎం చంద్రబాబు 13 జిల్లాలకు చెందిన సుమారు 15వేల మంది నేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 'రెండు జాతీయ పార్టీలు ఏపీ ప్రజల మనోభావాలను అర్థంచేసుకోలేదు. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ఎంపీలు సమర్థంగా ఎండగడుతున్నారు. ప్రత్యేక హోదా, ప్రత్యేక సాయం విషయాల్లో భాజపా మనకు అన్యాయం చేసింది. కాంగ్రెస్ పార్టీ మన కన్ను పొడవాలనుకుని తన రెండు కళ్లు పొడుచుకుంది. రాష్ట్రానికి న్యాయం చేస్తుందనే బిజెపితో పొత్తు పెట్టుకున్నాం. అందువల్ల రెండు జాతీయ పార్టీలు చేసిన అన్యాయాన్ని ప్రజలకు వివరించండి. టిడిపి తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారు. పార్లమెంట్‌లో టిడిపిఎంపీలు పోరాడుతుంటే..వైసిపి ఎంపీలు కూర్చుంటున్నారు.విజయసాయిరెడ్డి వైఖరే ఇందుకు నిదర్శనం. రాష్ట్ర విభజన సమయంలో జగన్ పార్లమెంట్‌లో సోనియాకు కనబడకుండా తిరిగారు. ఇప్పుడు మోడీ ప్రాపకం కోసం ఆయన పాకులాడుతున్నారు. ఎంపీలు రాజీనామాలు చేస్తే పార్లమెంట్‌లో ఏపీ ప్రజల గళాన్ని ఎవరు విన్పిస్తారు? ఎంపీలంతా రాజీనామాలు చేస్తే బిజెపి లాభం చేకూర్చడమే అవుతుంది. వైసిపి వైఖరి చూస్తుంటే ఇలాగే కనబడుతోంది' అని సీఎం అన్నారు.

విమర్శల సుడిలో రోహిత్ శర్మ



ముంబయి: టీమిండియా స్టార్ ఆటగాడు రోహిత్ శర్మ విమర్శల సుడిలో చిక్కుకున్నాడు. ఇటీవల కాలంలో వరుస వైఫల్యాలు చవిచూస్తున్న రోహిత్‌పై విమర్శల వర్షం కురుస్తోంది. తాజాగా లంకలో జరుగుతున్న ముక్కోణపు టోర్నమెంట్‌లో కూడా రోహిత్ విఫలమయ్యాడు. రెండు మ్యాచుల్లో కూడా తక్కువ స్కోరుకే పెవిలియన్ చేరడంతో అతనిపై సోషల్ మీడియా వేదికగా అభిమానులు విమర్శలకు దిగుతున్నారు. అతనికి ఏడు కోట్ల ప్యాకేజి కల్పించడం దండగేనని వారు విమర్శలు గుప్పిస్తున్నారు. రోహిత్ తీరు చూస్తుంటే అతనికి మూడు కోట్ల ప్యాకేజి కూడా దండగేనని మరికొందరూ నెటిజన్ల వ్యాఖ్యానించారు. జట్టును ముందుండి నడిపించడంలో రోహిత్ విఫలమవుతున్నాడని వారు ఆరోపించారు. సహచర ఆటగాడు శిఖర్ ధావన్ నిలకడైన బ్యాటింగ్‌తో జట్టుకు అండగా నిలుస్తుండగా రోహిత్ వరుస వైఫల్యాలతో సతమతమవుతున్నాడు. దీన్ని నెటిజన్లు, క్రికెట్ అభిమానులు జీర్ణించుకోలేక పోతున్నారు. దీంతో సోషల్ మీడియాలో రోహిత్‌కు వ్యతిరేకంగా తీవ్ర కామెంట్లు చేస్తున్నారు. మరోవైపు మాజీ క్రికెటర్లు సైతం రోహిత్ వైఫల్యంపై మండిపడుతున్నారు.



తల్లిగా సెరెనాకు తొలి గెలుపు

ఇండియన్‌వెల్స్: అమెరికా టెన్నిస్ దిగ్గజం, ప్రపంచ మాజీ నంబర్‌వన్ సెరెనా విలియమ్స్ తల్లి అయిన తర్వాత తొలి విజయాన్ని నమోదు చేసింది. ఇండియన్‌వెల్స్‌లో జరుగుతున్న డబ్ల్యూటిఏ టోర్నమెంట్‌లో పాల్గొన్న సెరెనా తొలి రౌండ్‌లో జయకేతనం ఎగుర వేసింది. కిందటి ఏడాది ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచిన తర్వాత సెరెనా ఆటకు దూరమైంది. ఆమె గర్భవతి కావడంతో పోటీలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. గతేడాది సెప్టెంబర్‌లో ఆడ బిడ్డకు జన్మనిచ్చిన సెరెనా కొద్ది రోజుల పాటు తీవ్ర అనారోగ్యంతో బాధపడింది. ఈ సందర్భంగా సెరెనా పరిస్థితి విషమించడంతో ఒక దశలో మృత్యువు అంచు వరకు వెళ్లింది. అయితే వైద్యుల కృషితో సెరెనా ప్రాణపాయం తప్పింది. 2017 డిసెంబర్‌లో సెరెనా మళ్లీ టెన్నిస్ కోర్టులోకి అడుగు పెట్టింది. ఓ ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడిన సెరెనా అందులో ఓటమి పాలైంది. అయినా ఆత్మవిశ్వాసాన్ని కోల్పోని సెరెనా అప్పటి నుంచి తీవ్ర సాధనలో నిమగ్నమైంది. చివరికి ఇండియన్‌వెల్స్ టోర్నీలో పాల్గొని తన ఖాతాలో తొలి విజయాన్ని నమోదు చేసింది. కజకిస్థాన్ క్రీడాకారిణి జరీనా దియాస్‌తో జరిగిన పోరులో సెరెనా 7–5, 6–3తో విజయం సాధించింది. రానున్న ఫ్రెంచ్ ఓపెన్ నాటికి తిరిగి గాడిలో పడాలనే ఉద్దేశంతో సెరెనా ఉంది. ఈ దశలో కఠోర సాధనతో ముందుకు సాగుతోంది.

ఆసీస్‌కు రబడా పంచ్

పోర్ట్ ఎలిజబెత్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టులో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 243 పరుగులకే కుప్పకూలింది. ఒక దశలో 3 వికెట్ల నష్టానికి 150 పరుగులతో పటిష్టంగా ఉన్న ఆస్ట్రేలియాను రబడా దెబ్బతీశాడు. ఇతనికి ఎన్‌గిడి తోడు కావడంతో కంగారూలు మొదటి ఇన్నింగ్స్‌లో 243 పరుగులకే పరిమతమయ్యారు. జట్టులో డేవిడ్ వార్నర్ ఒక్కడే రాణించాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన వార్నర్ 9ఫోర్లతో 63 పరుగులు చేశాడు. మరో ఓపెనర్ కామెరూన బెన్‌క్రాఫ్ట్ 38 పరుగులతో తనవంతు పాత్ర పోషించాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 98 పరుగులు జోడించి శుభారంభం అందించారు. అయితే చివరి సెషన్‌లో దక్షిణాఫ్రికా బౌలర్లు పుంజుకున్నారు. చెలరేగి బౌలింగ్ చేసిన రబడా ఐదు వికెట్లు పడగొట్టాడు. ఎన్‌గిడికి మూడు వికెట్లు లభించాయి. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా శుక్రవారం తొలి రోజు ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టానికి 39 పరుగులు చేసింది.

జోరుమీదున్న శ్రీలంక

నేడు బంగ్లాతో పోరు, ముక్కోణపు టోర్నీ



కొలంబో: తొలి మ్యాచ్‌లో పటిష్టమైన టీమిండియాను ఓడించి జోరుమీదున్న ఆతిథ్య శ్రీలంక జట్టు శనివారం బంగ్లాదేశ్‌తో జరిగే పోరుకు సమరోత్సాహంతో సిద్ధమైంది. నిదహాస్ ముక్కోణపు టోర్నమెంట్‌లో భాగంగా జరుగుతున్న ట్వంటీ–20 మ్యాచ్‌లో శ్రీలంక విజయమే లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు తొలి మ్యాచ్‌లో భారత్ చేతిలో ఓటమి పాలైన బంగ్లాదేశ్‌కు ఈ మ్యాచ్ కీలకంగా మారింది. ఫైనల్ రేసులో నిలువాలంటే ఈ మ్యాచ్‌లో గెలవాల్సిన పరిస్థితి బంగ్లాకు నెలకొంది. ఇక సొంత గడ్డపై శ్రీలంక జోరుమీదుంది. మొదటి మ్యాచ్‌లోనే బలమైన భారత్‌ను చిత్తు చేసి దూకుడు మీద ఉంది. ఈ మ్యాచ్‌లోనూ గెలిచి ఫైనల్ అవకాశాలను మరింత పటిష్టం చేసుకోవాలని తహతహలాడుతోంది. ఇటీవల బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచుల్లో వరుస విజయాలు సాధించిన లంక ఆత్మవిశ్వాసంతో కనిపిస్తోంది. ఈ మ్యాచ్‌లోనూ అదే జోరును కొనసాగించాలనే పట్టుదలతో ఉంది. కుశాల్ పెరీరా అద్భుత ఫాంలో ఉండడం లంకకు కలిసి వచ్చే అంశం. భారత్‌కు కుశాల్ అద్భుత ఇన్నింగ్స్‌తో చెలరేగిన విషయం తెలిసిందే. ఈసారి కూడా అదే జోరును కొనసాగించేందుకు తహతహలాడుతున్నాడు. గుణతిలక, ఉపుల్ తరంగ, కుశాల్ మెండిస్, జీవన్ మెండిస్, కెప్టెన్ చండీమల్, ఆల్‌రౌండర్ తిసార పెరీరాలతో లంక చాలా బలంగా ఉంది. ఈ మ్యాచ్‌లోనూ లంక భారీ విజయంపై కన్నేసింది. ఇక, బౌలింగ్‌లో కూడా లంక చాలా పటిష్టంగా కనిపిస్తోంది. లక్మల్, జీవన్, శనక, అకిల ధనంజయ, నువాన్ ప్రదీప్, తిసార పెరీరా వంటి మ్యాచ్ విన్నర్ బౌలర్లు జట్టుకు అందుబాటులో ఉన్నారు. ఈ నేపథ్యంలో లంకను ఓడించడం బంగ్లాదేశ్‌కు అంత తేలిక కాదనే చెప్పాలి.

చావోరేవో: మరోవైపు బంగ్లాదేశ్‌కు ఈ మ్యాచ్ చావోరేవోగా మారింది. తొలి మ్యాచ్‌లో భారత్ చేతిలో చిత్తుగా ఓడిన బంగ్లాదేశ్ ఈ మ్యాచ్‌లో ఎలా ఆడుతుందనే అంతు బట్టకుండా మారింది. కీలక ఆటగాడు సాకిబ్ అల్ హసన్ గాయం వల్ల దూరం కావడంతో బంగ్లాదేశ్ ఆత్మవిశ్వాసం దెబ్బతింది. అతను లేని లోటు మొదటి మ్యాచ్‌లో స్పష్టంగా కనిపించింది. అయితే లంకతో జరిగే పోరులో మాత్రం చెలరేగి ఆడాలనే పట్టుదలతో బంగ్లా ఉంది. తొలి మ్యాచ్‌లో చేసిన పొరపాట్లకు తావు లేకుండా ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగేందుకు సిద్ధమైంది. మహ్మదుల్లా, రహీం, తమీమ్, సౌమ్య సర్కార్, లిటన్ దాస్, ముస్తఫిజుర్ రహెమాన్ తదితరులతో బంగ్లా చాలా పటిష్టంగా ఉంది. కానీ, నిలకడలేమి జట్టుకు ప్రధాన అవరోధంగా మారింది. ఈ మ్యాచ్‌లో గెలిచి టోర్నమెంట్‌లో నిలువాలనే పట్టుదలతో బంగ్లాదేశ్ సమరానికి సిద్ధమైంది. రెండు జట్లు కూడా విజయమే లక్ష్యంగా పెట్టుకోవడంతో సమరం హోరాహోరీగా సాగడం ఖాయం.

శ్రీలంక: దినేష్ చండీమల్ (కెప్టెన్), ఉపుల్ తరంగ, దనుష్క గుణతిలక, కుశాల్ మెండిస్, దాసున్ శనక, కుశాల్ పెరీరా, జీవన్ మెండిస్, సురంగ లక్మల్, ఇసురు ఉడనా, అకిల ధనంజయ, అమిలా అపొన్సొ, నువాన్ ప్రదీప్, దుష్మంత చమీరా, ధనంజయ డిసిల్వా, తిసారా పెరీరా.

బంగ్లాదేశ్: మహ్మదుల్లా, తమీమ్ ఇక్బాల్, సౌమ్య సర్కార్, ముష్ఫికుర్ రహీం, షబ్బీర్ రహెమాన్, ముస్తఫిజుర్ రహెమాన్, రుబెల్ హుస్సేన్, అబు జయ్యద్, తస్కిన్ అహ్మద్, ఇమ్రూల్ కైస్, నూరుల్ హసన్, మెహది హసన్, ఆరిఫుల్ హక్, నజ్ముల్ హక్, అబు హైదర్ రోని, లిటన్ దాస్.



DD SPORTS
రాత్రి 7 గంటల నుంచి డిడి స్పోర్ట్స్, డిడి నేషనల్‌లలో ప్రత్యక్షప్రసారం

అంజుమ్‌కు రజతం

ప్రపంచకప్ షూటింగ్



మెక్సికో: ఇక్కడ జరుగుతున్న సీనియర్ ప్రపంచకప్ షూటింగ్ పోటీల్లో భారత్ మరో పతకం సాధించింది. టోర్నీలో భాగంగా జరిగిన మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రి పొజిషన్ విభాగం పోటీల్లో భారత షూటర్ అంజుమ్ మోడ్గిల్ రజత పతకం గెలుచుకుంది. అద్భు ఆటను కనబరిచిన అంజుమ్ తృటిలో స్వర్ణం గెలిచే అవకాశాన్ని చేజార్చుకుంది. ప్రారంభం నుంచే నిలకడైన ఆటతో దూసుకెళ్లిన అంజుమ్ కీలక దశలో ఒత్తిడికి గురైంది. ఈ సమయంలో కాస్త గురి తప్పడంతో రజతంతో సరిపెట్టుకోక తప్పలేదు. చైనా క్రీడాకారిణి రుజియో ఈ విభాగంలో పసిడి పతకాన్ని గెలుచుకుంది. చివరి వరకు నిలకడగా రాణించిన రుజియో 455.4 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. మరోవైపు భారత క్రీడాకారిణి అంజుమ్ 454.2 రజత పతకాన్ని దక్కించుకుంది. కాగా, చైనాకు చెందిన టింగ్ సున్‌కు కాంస్య పతకం లభించింది. ఈ ప్రపంచకప్‌లో భారత్ ఇప్పటి వరకు 8 పతకాలు గెలుచుకుంది. మూడు స్వర్ణాలు, ఒక రజతం, మరో నాలుగు కాంస్య పతకాలు ఉన్నాయి. ఇప్పటి వరకు భారత్ పాయిం ట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. చైనా రెండో స్థానంలో నిలిచింది.



మహ్మద్ షమిపై కేసు నమోదు

కోల్‌కతా: టీమిండియా స్పీడ్‌స్టర్ మహ్మద్ షమిపై కోల్‌కతా పోలీసులు కేసు నమోదు చేశాడు. తన భర్త మోసగాడని, అతనితో తనకు ప్రాణ హాని ఉందని ఆరోపిస్తూ షమి భార్య హసిన్ జహాన్ తన న్యాయవాదితో కలిసి కోల్‌కతా పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. తన భర్తకు పలువురు మహిళలతో శారీరక సంబంధాలు ఉన్నాయని, షమితో పాటు అతని కుటుంబ సభ్యులు తనపై దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ హసిన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. షమితో అతని కుటుంబ సభ్యులపై హసిన్ గృహ హింస చట్టం కింద చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరింది. దీనికి స్పందించిన కోల్‌కతా పోలీసులు శుక్రవారం భారత క్రికెటర్ షమిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా షమితో పాటు మరో నలుగురిపై పలు సెక్షన్ల కింద కేసును నమోదు చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు. ఐపిసి 498ఎ, 323,307,376, 506, 328, 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు వారు తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణలన్ని బూటకమని, కావాలనే హసిన్ తనపై, తన కుటుంబ సభ్యులపై తప్పుడు ఫిర్యాదులు చేసిందని పేర్కొన్నాడు. తాను నేరం చేసినట్టు రుజువైతే ఏ శిక్షకైనా సిద్ధమేనని షమి స్పష్టం చేశాడు.

భారత్‌కు ఐర్లాండ్ షాక్

సుల్తాన్ అజ్లాన్‌షా హాకీ



ఇఫో(మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా హాకీ టోర్నమెంట్‌లో భారత్‌కు మరో ఓటమి ఎదురైంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ పసికూన ఐర్లాండ్ చేతిలో పరాజయం చవిచూసింది. భారీ ఆశలతో బరిలోకి దిగిన భారత్‌కు ఐర్లాండ్ ఊహించని షాక్ ఇచ్చింది. పెద్దగా అంచనాలు లేకుండానే బరిలోకి దిగిన ఐర్లాండ్ 3–2 గోల్స్ తేడాతో భారత్‌పై సంచలన విజయం సాధించింది. కిందటి మ్యాచ్‌లో ఆతిథ్య మలేసియాపై ఘన విజయం సాధించి జోరుమీదున్న భారత్‌కు ఈ ఓటమి కోలుకోలేని దెబ్బతీసిందని చెప్పాలి. ఇప్పటికే టైటిల్ రేసు నుంచి వైదొలిగిన భారత్ ఐర్లాండ్ చేతిలోనూ ఓటమి పాలై మరింత అవమానాన్ని మూట గట్టుకుంది. ఆట ప్రారంభంలోనే భారత్ గోల్ సాధించి పైచేయి సాధించింది. రమన్‌దీప్ సింగ్ పదో నిమిషంలోనే గోల్ చేసి భారత్‌కు ఆధిక్యాన్ని అందించాడు. అయితే 24వ నిమిషంలో షేన్ ఓ డొనాగు గోల్ చేసి స్కోరును సమం చేశాడు. మరో రెండు నిమిషాల తర్వాత అమిత్ రోహిదాస్ చేసిన గోల్‌తో భారత్ మళ్లీ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. కానీ ద్వితీయార్ధంలో ఐర్లాండ్ దూకుడైన ఆటతో భారత్‌ను ఉక్కిబిబిక్కిరి చేసింది. 36వ నిమిషంలో సీన్ ముర్రే గోల్ చేసి స్కోరును 2–2తో సమం చేశాడు. మరోవైపు లీ కోలె 42వ నిమిషంలో చేసిన గోల్‌తో ఐర్లాండ్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ ఆధిక్యాన్ని చివరి వరకు కాపాడుకోవడంలో సఫలమైన ఐర్లాండ్ స్ఫూర్తి దాయక విజయాన్ని అందుకుంది.



సిరీస్ ఎవరిదో?

నేడు కివీస్–ఇంగ్లాండ్ చివరి పోరు

క్రిస్ట్‌చర్చ్: సిరీస్ ఫలితాన్ని తేల్చే చివరి మ్యాచ్‌లో అమీతుమీ తేల్చుకునేందుకు ఇంగ్లాండ్, న్యూజిలాండ్ జట్లు సిద్ధమయ్యాయి. ఇరు జట్ల మధ్య ఆఖరి వన్డే శనివారం జరుగనుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇరు జట్లు రెండేసి విజయాలు సాధించాయి. తొలి మ్యాచ్‌లో కివీస్ గెలవగా, తర్వాతి రెండు వన్డేల్లో ఇంగ్లాండ్ జయకేతనం ఎగుర వేసింది. నాలుగో వన్డే మళ్లీ కివీస్ గెలవడంతో సిరీస్ 2–2తో సమమైంది. ఈ నేపథ్యంలో సిరీస్ ఫలితం తేల్చే చివరి వన్డేలో ఇరు జట్లు కూడా విజయమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. కిందటి మ్యాచ్‌లో ఇంగ్లాండ్ ఉంచి భారీ లక్ష్యాన్ని కివీస్ అలవోకగా ఛేదించింది. రాస్ టైలర్ కళ్లు చెదిరే శతకంతో కివీస్‌కు రికార్డు విజయాన్ని అందించాడు. మరోవైపు ఇంగ్లాండ్ జట్టులో రూట్, బైర్‌స్టో శతకాలు సాధించినా ఫలితం లేకుండా పోయింది. కాగా, రెండు జట్లలోనూ ఒంటిచేత్తో మ్యాచ్ ఫలితాన్ని తారుమారు చేసే ఆటగాళ్లకు కొదవలేదు. జాసన్ రాయ్, బైర్‌స్టో, రూట్, మోర్గాన్, బట్లర్ వంటి అగ్రశేణి బ్యాట్స్‌మెన్ ఇంగ్లాండ్‌కు అందుబాటులో ఉన్నారు. అంతేగాక బెన్‌స్టోక్స్, మొయిన్ అలీ, వోక్స్ వంటి ప్రపంచ స్థాయి ఆల్‌రౌండర్లు ఉండనే ఉన్నారు. దీంతో ఇంగ్లాండ్‌ను ఏమాత్రం తక్కువ అంచన వేసిన కివీస్ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇక, కివీస్ కూడా చాలా బలంగా ఉంది. మార్టిన్ గుప్టిల్, కెప్టెన్ విలియమ్సన్, రాస్ టైలర్, లాథమ్, గ్రాండోమ్ వంటి మ్యాచ్ విన్నర్లు జట్టులో ఉన్నారు. దీంతో కివీస్ కూడా విజయమే లక్ష్యంగా పెట్టుకుంది.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.